


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 106 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 26 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 106 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 26 FEBRUARY 2026 PRICE : 1/- RS


Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# తెలంగాణలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయి

## కుమ్మెర జాతర ఘటనపై కేటీఆర్ ఆగ్రహం

- చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కేటీఆర్ డిమాండ్
- సమాజం తలదించుకోవాల్సిన ఘటన జరిగిందన్న కేటీఆర్
- నిందితులను కాపాడే ప్రయత్నం సిగ్గుమాలిన చర్య అన్న కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని, సమాజం తలదించుకోవాల్సిన ఘటన కుమ్మెర జాతరలో జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కుమ్మెర జాతరలో మృతి చెందిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుమ్మెర గ్రామస్థులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు మద్దతు తెలిపిన కేటీఆర్ మాట్లాడుతూ, ఈనాటికీ కులం పేరు మీద దాడులు దారుణమని అన్నారు.రెండేళ్ల చిన్నారికి కులం తెలుసా, మతం తెలుసా, పసిగుడ్డు ఏం అడిగిందని పొట్టన పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ ఘటనకు కారణమైన 8 మందిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారి ప్రాణాలు తీసిన వారికి ఎవరూ అండగా నిలవవద్దని అన్నారు.నిందితులను కాపాడేయత్నం సిగ్గుమాలిన చర్య అన్నారు. వారు ఏ పార్టీకి చెందిన వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.1 కోటి పరిహారం చెల్లించాలని కేటీఆర్ అన్నారు. ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు.




## నాగర్‌కర్నూల్‌లో ఉద్రిక్తత.. బాధితులతో కలిసి కేటీఆర్ ధర్నా

- నాగర్‌కర్నూల్‌లో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- కుమ్మెర జాతర ఘటనలో మృతి చెందిన పసిపాప కుటుంబానికి పరామర్శ
- బాధిత కుటుంబానికి సంఘీభావంగా కేటీఆర్ నిరసన దీక్ష
- కాంగ్రెస్ నేతల దాడి వల్లే పసిపాప మృతి చెందిందని ఆరోపణ
- బాధితులపైనే పోలీసులు కేసు పెట్టారని ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:**నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప మరణించిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఆయన నాగర్‌కర్నూల్‌లో పర్యటించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్షలో పాల్గొన్నారు. వివరాల్లోకి వెళితే... మల్లన్న జాతర సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కుల వివక్షతో చాకలి చంద్రకళ కుటుంబంపై దాడి చేశారని, ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రెండు నెలల చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందిందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఘటన తర్వాత పోలీసులు తమపైనే కేసు నమోదు చేయడంతో

- మిగతా2లో



## ముంబైలోని రూ.3,700 కోట్ల అనిల్ అంబానీ ఇంటిని అటాచ్ చేసిన ఈడీ

- పాల్ హిల్ నివాస ఆస్తిని తాత్కాలికంగా జప్తు చేసిన ఈడీ
- 17 అంతస్తులతో 66 మీటర్ల ఎత్తు ఉన్న విలాసవంత భవనం
- ఇప్పటి వరకు అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.15,700 కోట్లు

- మిగతా2లో



## ఐ-ప్యాక్ తో ఒప్పందం కుదుర్చుకున్న అఖిలేశ్ యాదవ్

- వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు
- యోగి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా అఖిలేశ్ అడుగులు
- మమత, స్టాలిన్ సలహాలతో ఐ-ప్యాక్ తో ఒప్పందం


- మిగతా2లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శంతను నారాయణ్ సమావేశం

- ఉద్యోగాలపై ఏఐ, నైపుణ్యాభివృద్ధి, కొత్త అవకాశాలపై చర్చ
- ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై వారి మధ్య చర్చ
- రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా నిలబెట్టడానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్న సీఎం



**హైదరాబాద్ పెన్ పవర్:**అడోబ్ సీఈవో, తెలంగాణ రైజింగ్-2047 విజన్ బోర్డు సభ్యుడు శంతను నారాయణ్ హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఉద్యోగాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం, నైపుణ్యాభివృద్ధి, తెలంగాణను తయారీ కేంద్రంగా మార్చడం, గ్లోబల్ ట్రెండ్స్, గ్రీన్ ఎనర్జీ, కొత్త అవకాశాలు వంటి అంశాలపై వారు చర్చించారు. ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై కూడా వారి మధ్య చర్చ జరిగింది. కృత్రిమ మేధను సమర్థవంతంగా వినియోగించుకునే అంశంపై శంతను నారాయణ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. తెలంగాణను తయారీ కేంద్రంగా నిలబెట్టడానికి కీలక కంపెనీలను ఆకర్షించడానికి కొన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.



## హైకోర్టు ఆదేశాల మేరకే సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పనులు

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లోని మాదాపూర్ లో ఉన్న సున్నం చెరువు ఎఫ్టీఎల్ పరిధిపై కీలక వ్యాఖ్యలు చేశారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. సున్నం చెరువు ఎఫ్టీఎల్ పరిధి 2014లోనే నిర్ణయించబడిందని స్పష్టం చేశారు. ఒకసారి ఫిక్స్ చేసిన ఎఫ్‌టీఎల్ పరిమితుల్లో మార్పులు, చేర్పులు ఉండవని వెల్లడించారు రంగనాథ్.ఎఫ్‌టీఎల్ హద్దులను 5 ఎకరాలు మినహాయించి మార్చుతున్నారన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణలు నిరాధారమని ఖండించారు. హైకోర్టు ఆదేశాల మేరకే సున్నంచేరువు ఎఫ్టీఎల్ పరిధిలో పనులు జరుగుతున్నాయని అన్నారు. సున్నం చెరువు దగ్గర గతంలో వేసిన ఫెన్సింగ్‌లో ప్రభుత్వ భూమి కలిసివున్నా, అది ఎఫ్‌టీఎల్‌కు వర్తించదని అన్నారు రంగనాథ్. చెరువు చెంత ప్రభుత్వ భూమి ఉంటే స్వాధీనం చేసుకుని పార్కులు, ప్లే ఏరియాలుగా అభివృద్ధి చేస్తామని

- మిగతా2లో

## మోదీకి ఘన స్వాగతం పలికిన నెతన్యాహు

- ఇజ్రాయెల్‌కు చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో మోదీకి స్వాగతం పలికిన నెతన్యాహు
- పలు రంగాల్లో కీలక ఒప్పందాలు చేసుకోనున్న భారత్-ఇజ్రాయెల్

**పెన్ పవర్ డెస్క్:**భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్‌కు చేరు కున్నారు. టెల్ అవీవ్‌లోని బెన్-గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మోదీకి ఆ దేశ ప్రధాని బెంజమిన్

- మిగతా2లో





## నల్గొండ జిల్లాలో మిల్లర్ల మాయాజాలం..

### రూ.43 కోట్ల ప్రభుత్వ ధాన్యం అమ్ముకున్న నిందితులు అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రభుత్వానికి, రైతులకు మధ్య వర్తులుగా ఉంటూ ధాన్యం కొనుగోలు చేసిన మిల్లర్లు.. ప్రభుత్వానికి 43 కోట్ల రూపాయల మేర ఎగనామం పెట్టడం సంచలనంగా మారింది. మిల్లులలో ఉన్న ధాన్యాన్ని మిల్లుల నుంచే దారి మళ్లించిన బాగోతాన్ని కనిపెట్టిన సివిల్ సప్లై అధికారులు.. పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. కనీస మద్దతు ధరతో రైతుల దగ్గర నుంచి ధాన్యం కొని.. ప్రభుత్వానికి అందించకుండా అమ్ముకుని జేబులు నింపుకున్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం (ఫిబ్రవరి 25) తెలంగాణ సివిల్ సప్లైస్

- మిగతా2లో


## రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి.. వేగవంతమైన సేవలు అందిస్తాం



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు.

- మిగతా2లో

## ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయి



- ఎప్‌స్టీన్స్‌తో సంబంధాలు ఉండటంపై క్షమాపణలు చెప్పిన బిల్‌గేట్స్
- ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టీకరణ
- ది వాల్ స్ట్రీట్ జర్నల్ ఇంటర్వ్యూలో వెల్లడించిన బిల్‌గేట్స్

- మిగతా2లో

## పాకిస్థాన్ న్యాయవ్యవస్థలో పెను సంచలనం

### నకిలీ డిగ్రీతో పాకిస్థాన్ హైకోర్టు జడ్జిగా ఐదేళ్ల కొలువు!

- ఇస్లామాబాద్ హైకోర్టు జడ్జిగా ఐదేళ్ల పనిచేసిన మహమూద్ జహంగీరి
- జహంగీరిని బాధ్యతల నుంచి తొలగించిన ఇస్లామాబాద్ హైకోర్టు
- ఐదేళ్ల పాటు జడ్జిగా అనేక తీర్పులు వెలువరించిన జహంగీరి

- మిగతా2లో



## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

- ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న వసంతగా గుర్తింపు
- బాలికల వసతి గృహంలో బలవన్మరణం
- మృతురాలిది వనపర్తి జిల్లా

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బాసర ట్రిపుల్ ఐటీలో మరో విషాదం చోటుచేసుకుంది. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆర్. వసంత అనే విద్యార్థిని

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# మానవతావాది హేమలతా లవణం

జోగినీ దురాచార నిర్మూలన, నేరస్థుల సంస్కరణల కోసం అవిరళ కృషి జరిపిన మహిళా సంఘ సంస్కర్త, ప్రముఖ రచయిత్రి డాక్టర్ హేమలతా లవణం.స్వాతంత్ర్యానంతర భారత దేశంలో సంఘ సంస్కరణ ఉద్యమానికి అవిరళకృషి చేసిన ప్రముఖ సామాజిక సేవకురాలు. సంఘం విస్మృతులైన దళితులను, గిరిజనులను సంస్కరణోద్యమ అజెండాలో చేర్చి సమకాలీన భారత చరిత్రలో ఒక ప్రధాన మైలురాయిగా మిగిలారు. సుప్రసిద్ధ కవి గుఱ్ఱం జాషువా కుమార్తెగా, సంఘసేవకుడు గోపరాజు రామచంద్రరావు (గోరా) కోడలిగా, లవణానికి జీవన సహచరిగా, అన్నింటినీ మించి సాంఘిక సంస్కర్తగా చిరపరిచితులు ఆమె.ఆస్తికురాలిగా జీవితం ప్రారంభించి, వాస్తవికత, సంఘదృష్టి, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకున్న ఆమె నాస్తికురాలిగా మారారు. ప్రశ్నించే చైతన్యం, పరీక్షించే మనస్తత్వం, సమాజంలో అణగారిన ప్రజల అభ్యున్నతికి పాటుపడాలన్న తపన, దారిద్ర్యాన్ని, అసమానతలను తొలగించి తోటి మానవులకు తోడ్పడాలన్న ఆలోచన ఆమెను క్రొత్తపుంతలు తొక్కడానికి పురికొల్పాయి. తనలో నిహితమైన శక్తి సామర్థ్యాలను, సంఘ సంస్కరణాభిలాషను, సమాజ కళ్యాణ కార్యక్రమాలను పెంపొందించేందుకు ఆమె ముందడుగు వేశారు. స్టువర్టుపురం దొంగతనాలు వృత్తిగా జీవించిన కుటుంబాలను మంచి మార్గంలో పెట్టిన మనత హేమలతదే. హేమలతా లవణం (ఫిబ్రవరి 26, 1932 –మార్చి 20, 2008) గుంటూరు జిల్లా వినుకొండలో జాషువా మరియమ్మలకు 1932 సంవత్సరం ఫిబ్రవరి 26 న ఆఖరి సంతానంగా జన్మించారు. ఆమె ప్రాథమిక, మాధ్యమిక విద్య గుంటూరులో సాగింది. మద్రాసు క్వీన్స్ కళాశాలలో బి.ఏ బంగారు పతక గ్రహీత. నాస్తికత్వం, ప్రజాస్వామ్య విలువలు, గాంధేయ వాదం తదితర విలువలకు కట్టుబడిన గోరా కుమారుడు లవణంతో ఆమె వివాహం జరిగింది. వర్ణభేదాలను అతిక్రమించి జరిగిన ఆమె వివాహం అప్పట్లో సంచలనం కలిగించింది. వినోబా భావే భూదాన యాత్రలో ఆయనతో పాటు చంబల్ లోయలో పర్యటించి బందిపోటు దొంగల్లో మానసిక పరివర్తన తెచ్చేందుకు కృషిచే?శారు. 1961లో వాసవ్య విద్యాలయాన్ని స్థాపించి సమత, మమతల కోసం పాటు పడ్డారు. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లో ఆర్థిక సమతా మండలి అని సేవా సంస్థను స్థాపించి వెనుక బడిన వారిలో, నిమ్న కులాల్లో చైతన్యం కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. 1981లో కావలిలో 'నవవికాస్' అనే సంస్థను స్థాపించి దాని ద్వారా అణగారిన వర్గాలను ఆదుకొన్నారు. జోగినులను, వారి పిల్లలను ఆదుకోవడానికి 'సంస్కార్' చెల్లి నిలయం అనే సంస్థలు ఏర్పరచారు. అంధ విశ్వాసాలు 'బాణామతి' మహిళల జీవితాలను ధ్వంసం చేస్తోన్న వైనాన్ని గుర్తించి వాటిని ఆరోగ్య సమస్యగా గుర్తింప చేయడానికి కృషి చేశారు. రెండు వేలకు పైగా జోగినులను సంస్కరించడమే కాక ప్రభుత్వం చేత వారికి పొలాలు ఇప్పించి, జోగినులకు వివాహాలు జరిపించారు. సంస్కార్ సంస్థను స్థాపించి, నిజామాబాదు జిల్లాలో జోగినీ వ్యవస్థ నిర్మూలణకు ఆమె చేసిన కృషి ఫలితంగా "ఎన్టీ రామారావు ప్రభుత్వం జోగినీ వ్యవస్థ నిర్మూలణ చట్టాన్ని" తెచ్చింది. వర్ణాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించారు. బాలికల కోసం నిజామాబాద్ జిల్లా, గాంధారి గ్రామంలో ప్రత్యేక పాఠశాల నిర్మించారు. చైల్డ్ ఎట్ రిస్క్ (సి.ఎ.ఆర్) పేరుతో దొంగలు, తాగు బోతులు, వ్యభిచార వృత్తిలో కూరుకు పోయిన వారి పిల్లల కోసం సంస్కరణ కేంద్రం స్థాపించారు."గోరా కోడలు కావడం తన జీవితంలో జరిగిన గొప్ప విషయం" అనేవారు హేమలత. అప్పటి వరకు ఇంటి బాధ్యతలు చదువుకి మాత్రమే పరిమితమైన ఆమె బయటి ప్రపంచాన్ని చూసింది లవణంతో కలిసి చేసిన యాత్రల్లోనే. అయితే, అతి తక్కువ కాలంలోనే సంఘసేవికగా మారి పోగలగడం వెనుక ఆమెలో ఉన్న దయా గుణం, స్పందించే హృదయం కారణాలు అంటారు. జాషువా కావ్యాలు అందరికీ అందుబాటులో ఉండాలన్న దృఢసంకల్పంతో వాటన్నిటినీ ముద్రించారు. స్వయంగా పలు ప్రక్రియల్లో రచనలు చేశారు. అహింసా మూర్తులు – అమర గాథలు, నేరస్థుల సంస్కరణం, జీవన ప్రభాతం, జాషువా కలం చెప్పిన కథ, మా నాన్నగారు, జీవన సాగరం, అనుభవ తరంగాలు, నేరస్తుల సంస్కరణ, తాయెత్తు – గమ్మత్తు, మృత్యోర్మా అమృతంగమయ వంటి పలు రచనలు చేసిన ఆమె 'జీవన ప్రభాతం' నవలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆత్మగౌరవ పురస్కారం, కర్ణాటక ప్రభుత్వం నుంచి దేశస్నేహి పురస్కారం, అమెరికా నుంచి ఎథీయిస్ట్ ఎచీవ్‌మెంట్ అవార్డు, 2003 సంవత్సరానికి రెడ్ అండ్ వైట్ బ్రేవరి అవార్డు, సావిత్రి పూలే అవార్డు వంటివి ఎన్నో పొందారు. ఆంధ్ర, నాగార్జున విశ్వ విద్యాలయాల సిండికేట్ మెంబరుగా పనిచేశారు. స్టూవర్టుపురం దొంగల పునరావాసం – సంస్కరణ దురాచారంపై హేమలతా లవణం విశేషంగా కృషి చేశారు. 1977 దివిసీమ ఉప్పెనలో బాధితులకు పునరావాస సేవలందించారు. 1979లో ప్రకాశం, నెల్లూరు, 1996 తూర్పుగోదావరి జిల్లా తుపాను విపత్తు సమయంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె సంఘ సేవికగా చేసిన కృషికి, రచనలకు తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్, తానా ఎచ్చీవ్‌మెంట్, వరల్డ్ ఎచ్చీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారు. మాజీ ముఖ్య మంత్రులు ఎన్టీఆర్, చంద్రబాబు నుంచి తెలుగు ఆత్మగౌరవ అవార్డులు తీసుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి నుంచి ఉగాది పురస్కారాన్ని, అంబేద్కర్ శతజయంతి సందర్భంగా భీమరత్న అవార్డును పొందిన ఏకైక మహిళ హేమలత. గుఱ్ఱం జాషువా ఫౌండేషన్ స్థాపించి దేశంలో తొమ్మిది మంది కవులకు పురస్కారాలు అంద చేశారు. అండాశయపు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ విజయవాడ లోని నాస్తిక కేంద్రంలో మార్చి 20, 2008 న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు హేమలతా లవణం.

# నల్గొండ జిల్లాలో మిల్లర్ల మాయాజాలం..

- మొదటి పేజీ తరువాయి
కార్పోరేషన్ నల్గొండ జిల్లా మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు కె.శివరాం రెడ్డి, ౹ాణూరా, నల్గొండ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు నిందితులను పట్టుకున్నాయి. ఈ ఆపరేషన్ కు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు.

నల్గొండ మండలం దోమలపల్లి గ్రామ శివారులో నిందితులను అదుపులోకి తీసుకున్నాం

అరెస్టు చేసిన నిందితులు కందుకూరి మహేందర్, కందుకూరి పద్మ (దంపతులు)

మిగతా నిందితులు మాశెట్టి రాధా కృష్ణ, మేడమ్ కృష్ణమూర్తి, ఇడుకుళ్ళ దామోదర్, కందుకూరి రవి కుమార్, బూరుగు బాలకృష్ణ పరారీలో ఉన్నారు.

త్వరలో పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేస్తాం .. ప్రభుత్వానికి నష్టం కలిగిస్తానంటే ఊరుకోం

నిందితుల నుంచి లక్షా 9 వేల రూపాయలు, మూడు సెల్ ఫోన్లు, బెలెనో కారు (TG-07-A-9927) స్వాధీనం చేసుకున్నాం

2022–23 రబీ సీజన్‌లో సుమాంజలి పార్ బాయిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ – ఆర్జాలబావి, వరలక్ష్మి పార్ బాయిల్డ్ మిల్ – చిట్యాల, మనోహర ఆగ్రో ఫుడ్ ప్రాడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ – మునుగోడు.. ప్రభుత్వానికి ఈ మిల్లర్లతో కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం జరిగింది.

కందుకూరి మహేందర్ ప్రధాన పాత్రధారిగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ ఏజెంట్/మర్చంట్‌గా రైతుల నుంచి కనీస మద్దతు ధర (MSP) కింద IKP/PACS/DAO/NDCMS/FPOల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు.

ప్యాడీకి సరిపడా బియ్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా అక్రమంగా ధాన్యాన్ని అమ్ముకున్న మహేందర్ అండ్ టీమ్.

ఈ మూడు రైస్ మిల్లుల ద్వారా మొత్తం 13,170.061 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి సుమారు 43 కోట్ల రూపాయల నష్టం కలిగించారు .

సుమాంజలి మిల్ ద్వారా– సుమారు రూ.22 కోట్ల నష్టం

వరలక్ష్మి మిల్ –సుమారు రూ.19.33 కోట్ల నష్టం

మనోహర మిల్ – సుమారు రూ.1.47 కోట్ల నష్టం.

అదుపులోకి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన నేరస్థులు

నల్గొండ రూరల్, చిట్యాల, మునుగోడు పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదు చేసి రిమాండు

పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఈ కేసును నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. దర్యాప్తులో నల్గొండ II టౌన్ CI రాఘవరావు, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, నల్గొండ రూరల్ ఎస్. ఐ సైదాబాబు మొదలైనసిబ్బంది పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో ఉద్రిక్తత.. బాధితులతో కలిసి కేటీఆర్ ధర్నా

- మొదటి పేజీ తరువాయి
భయపడి గ్రామం విడిచి నాగర్‌కర్నూల్‌లో తలదాచుకుంటున్నామని వారు తెలిపారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితర బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతకుముందు

పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం బాధితులకు సంఘీభావంగా దీక్షలో కూర్చుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనలో బాధితులకు వెంటనే న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ముంబైలోని రూ.3,700 కోట్ల అనిల్ అంబానీ ఇంటిని అటాచ్ చేసిన ఈడీ

రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్.కామ్.) బ్యాంకు మోసం కేసుకు సంబంధించి ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీకి చెందిన రూ.3,716.83 కోట్ల విలువైన పాలి హిల్ నివాస ఆస్తిని ఈడీ బుధవారం తాత్కాలికంగా జప్తు చేసింది. 17 అంతస్తులతో 66 మీటర్ల ఎత్తు ఉన్న ఈ విలాసవంతమైన ఇల్లు విలువ రూ.3,716 కోట్లు ఉంటుందని అంచనా. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్లాది రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో సంబంధం ఉన్న ఈ కేసులో భాగంగా ఆ ఇంటిని ఈడీ అటాచ్ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతంలో ముంబైలోని

రూ.473.17 కోట్ల విలువైన ఆస్తిని కూడా ఈడీ అటాచ్ చేసింది. ఈ కేసులో ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది. ఆర్.కామ్., దాని అనుబంధ సంస్థలు దేశీ, విదేశీ రుణదాతల నుంచి తీసుకున్న మొత్తంలో రూ.40,185 కోట్ల బకాయిలు ఉన్నాయి.

## ఐ-ప్యాక్ తో ఒప్పందం కుదుర్చుకున్న అఖిలేశ్ యాదవ్

భారత రాజకీయాల్లో కీలకమైన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2027 ప్రారంభంలో జరగనున్నాయి. కానీ, అప్పుడే ఆ రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలయింది. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ భారీ స్కెచ్ వేశారు. వరుసగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌ను గద్దె దించడమే లక్ష్యంగా... దేశంలోనే అత్యంత విజయవంతమైన రాజకీయ వ్యూహకర్తల సంస్థ 'ఐ–ప్యాక్' (×ౌ్రూజ)తో అఖిలేశ్ ఒప్పందం కుదుర్చుకున్నారు.పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ ఇచ్చిన సూచన మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు. ఐ–ప్యాక్ వ్యూహాలతోనే బెంగాల్‌లో టీఎంసీ, తమిళనాడులో డీఎంకే విజయాలు సాధించిన నేపథ్యంలో, అదే ఫార్ములాను యూపీలోనూ వర్తింపజేయాలని ఆయన నిర్ణయించారు. పార్టీ ప్రచారాన్ని కేవలం పట్టణాలకే పరిమితం చేయకుండా జిల్లా, బూత్ స్థాయి వరకు బలంగా తీసుకువెళ్లే బాధ్యతను ఐ–ప్యాక్‌కు అప్పగించారు.

## పాకిస్థాన్ న్యాయవ్యవస్థలో పెను సంచలనం

### నకిలీ డిగ్రీతో పాకిస్థాన్ హైకోర్టు జడ్జిగా ఐదేళ్ల కొలువు!

పాకిస్థాన్ న్యాయవ్యవస్థలో అత్యంత విస్మయకరమైన ఘటన వెలుగుచూసింది. ఏకంగా హైకోర్టు జడ్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తి.. నకిలీ లా డిగ్రీతో ఆ పదవిని దక్కించుకున్నట్లు తేలడం సర్వత్ర చర్చనీయాంశమైంది. ఇస్లామాబాద్ హైకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ తారిక్ మహమూద్ జహంగీరిని పదవి నుంచి తొలగిస్తూ కోర్టు సోమవారం 116 పేజీల సుదీర్ఘ తీర్పును వెలువరించింది.

జహంగీరి విద్యార్హతలపై అనుమానాలు రావడంతో విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. కరాచీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ నుంచి అసలు రికార్డులను తెప్పించింది. ఆ రికార్డుల ప్రకారం.. జహంగీరి 1988లో ఒక నకిలీ ఎన్‌రోల్‌మెంట్ నంబర్‌తో పరీక్షలకు హాజరయ్యారని, అప్పట్లో కాపీ కొడుతూ దొరికిపోవడంతో యూనివర్సిటీ ఆయనపై మూడేళ్ల పాటు నిషేధం విధించిందని వెల్లడైంది. అయితే, ఆ శిక్షను అనుభవించకుండానే, ఆయన తప్పుడు మార్గాల్లో 'ఇంతియాజ్ అహ్మద్' అనే మరో విద్యార్థికి కేటాయించిన నంబర్‌ను వాడుకుని పట్టా పొందినట్లు కోర్టు నిర్ధారించింది.

ఈ వ్యవహారంలో ఇస్లామాబాద్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. జహంగీరి లా డిగ్రీ 'అబ్ ఇనిషియో' (తొలి నుంచీ చెల్లనిది) అని కోర్టు స్పష్టం చేసింది. డిగ్రీయే లేనప్పుడు హైకోర్టు జడ్జిగా ఆయన నియామకం చట్టబద్ధంగా అసాధారణమని పేర్కొంది. తన విద్యార్హతలకు సంబంధించిన అసలు పత్రాలను సమర్పించేందుకు కోర్టు పలుమార్లు అవకాశం ఇచ్చినప్పటికీ, జహంగీరి వాటిని చూపించడంలో విఫలమయ్యారు. దీనికి బదులుగా విచారణను వాయిదా వేయాలని, బెంచ్ మార్చాలని రకరకాల సాకులు చెప్పడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నమెంట్ ఇస్లామియా లా కాలేజీ ప్రిన్సిపాల్ కూడా కోర్టులో కీలక సాక్ష్యం చెబుతూ.. తమ సంస్థలో జహంగీరి ఎప్పుడూ అడ్మిషన్ తీసుకోలేదని ధృవీకరించారు.

డిసెంబర్ 2020లో హైకోర్టు జడ్జిగా నియమితులైన జహంగీరి, సుమారు ఐదేళ్ల పాటు అనేక కేసుల్లో తీర్పులు ఇచ్చారు. అయితే గత ఏడాది సెప్టెంబర్‌లోనే ఆయన విధులపై స్టే విధించిన కోర్టు, తాజాగా తుది తీర్పుతో ఆయనను పదవి నుంచి శాశ్వతంగా తొలగించింది.

## ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయి

సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో తన పేరు ఉండటంపై మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ స్పందించారు. ఎప్‌స్టీన్స్‌తో సంబంధాలు ఉన్నాయని, కానీ ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టం చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్స్‌తో తనకు సంబంధం ఉండటంపై బిల్ గేట్స్ తన గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు.తాను చట్టవిరుద్ధంగా ఏ పని చేయలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయని ఆయన అంగీకరించడం గమనార్హం. నేరాల్లో మాత్రం భాగస్వామ్యం లేదని 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' ఇంటర్వ్యూలో ఈ అంశాలను పేర్కొన్నారు.ఎప్‌స్టీన్స్‌తో సంబంధాలు, అతని సమావే శాలలో గేట్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొనడం తాను చేసిన తప్పు అని అంగీకరించారు. ఎప్‌స్టీన్ నేరాలు తమ ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు వ్యతిరేకమని తెలిపారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు తమ ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు.

## వెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి.. వేగవంతమైన సేవలు అందిస్తాం

- మొదటి పేజీ తరువాయి
సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

## హైకోర్టు ఆదేశాల మేరకే సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పనులు

- మొదటి పేజీ తరువాయి
అన్నారు.మాదాపూర్‌లోని తమ్మిడికుంట సహా మొదటి విడతలో చేపట్టిన 6 చెరువుల దగ్గర ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు రంగనాథ్.గతంలో హైడ్రా చర్యలకు సహకరించిన ఎమ్మెల్యే అకస్మాత్తుగా విమర్శలకు దిగడం ఆశ్చర్యకరమని అన్నారు.కూకట్‌పల్లి జోన్‌లో భూముల విలువ ఎక్కువగా ఉండటం వల్లే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. హైడ్రాకు వచ్చిన మొత్తం ఫిర్యాదుల్లో సుమారు 40శాతం కూకట్‌పల్లి జోన్ నుంచే వచ్చాయని వెల్లడించారు.చెరువులు, నాలాలు, పార్కులు, ప్రజావసర స్థలాలు, ప్రభుత్వ భూములను కాపాడటం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఏ ఒక్కరి పక్షాన కాకుండా ప్రజలందరికీ ఉపయోగపడేలా హైడ్రా చర్యలు ఉంటాయని..ఇప్పటివరకు 1,240 చోట్ల ఆక్రమణలు తొలగించి 1,310 ఎకరాల ప్రభుత్వ భూమి రక్షించామని అన్నారు.

## మోదీకి ఘన స్వాగతం పలికిన నెతన్యాహు

- మొదటి పేజీ తరువాయి
నెతన్యాహు స్వయంగా విచ్చేసి, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి ఘనస్వాగతం పలికారు. 2017లో తొలిసారి ఇజ్రాయెల్‌లో పర్యటించిన మోదీ, మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత ఆ దేశ గడ్డపై అడుగుపెట్టడం ఇరు దేశాల మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి నిదర్శనంగా నిలిచింది.

ఈ పర్యటనలో అత్యంత కీలకమైన ఘట్టం ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పార్లమెంట్ ను ఉద్దేశించి ప్రసంగించనుండటం. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించబోతున్న మొట్టమొదటి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించనున్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని నెస్సెట్ భవనాన్ని భారత త్రివర్ణ పతాక వర్ణాలతో అలంకరించడం విశేషం. ఈ గౌరవం ప్రపంచంలోని అతికొద్ది మంది నేతలకు మాత్రమే దక్కుతుంది.పర్యటనలో భాగంగా ఇరువురు నేతలు పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. రేపు జరగనున్న ఉన్నత స్థాయి సమావేశంలో ఆర్థిక, భద్రత, రక్షణ, సాంకేతికత, వ్యవసాయ రంగాల్లో కీలక ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేయనున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతికత బదిలీపై చర్చలు జరగనున్నాయి.

మరోవైపు, మోదీ రాకను పురస్కరించుకుని ఇజ్రాయెల్ మీడియా 'నమస్తే.. షాలోమ్' అంటూ ఫ్రంట్ పేజీ కథనాలతో స్వాగతం పలికింది. "మోదీ, నెతన్యాహుల మధ్య ఉన్న వ్యక్తిగత స్నేహం కేవలం ఇద్దరు నేతల మధ్య సంబంధం మాత్రమే కాదు, ఇది రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య ఉన్న దృఢమైన బంధం" అని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం పేర్కొంది. పర్యటనలో భాగంగా మోదీ ప్రవాస భారతీయులతో కూడా సమావేశమై, వారితో సంభాషించనున్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

- మొదటి పేజీ తరువాయి
ఆత్మహత్య చేసుకుంది. బాలికల వసతి గృహంలో ఆమె బలవన్మరణానికి పాల్పడినట్టు అధికారులు తెలిపారు. మృతురాలి స్వస్థలం వనపర్తి జిల్లాగా గుర్తించారు.

ఈ ఘటన గురించి తెలుసుకున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది, విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని హుటాహుటిన బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఈ ప్రక్రియను అధికారులు గోప్యంగా నిర్వహించడం గమనార్హం.వసంత ఆత్మహత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆమె వ్యక్తిగత కారణాలతో ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందా? లేక ఇతర ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టే అవకాశం ఉంది. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు తరచూ జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

# యార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** అకాల వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అన్ని మార్కెట్ యార్డుల్లో పంట ఉత్పత్తులకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. వర్షాల పరిస్థితులపై బుధవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "ప్రస్తుతం యార్డులకు భారీఎత్తున వస్తున్న వ్యవసాయ ఉత్పత్తులను తడవనీయొద్దు. టార్పాలిన్లు ఉచితంగా ఇవ్వాలి. ఉత్పత్తులను నేరుగా నేలపై నిల్వ చేయకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. మార్కెట్ షెడ్లు, గోదాముల పైకప్పులను పరిశీలించి లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతు చేయాలి. ప్రతిరోజూ వాతావరణ సూచనలను రైతులు, వ్యాపారులకు తెలపాలి. రాత్రి సమయంలో తగినంత లైటింగ్ ఏర్పాట్లు చేయాలి. నిల్వల రక్షణ కోసం భద్రతా సిబ్బందిని నియమించాలి. సాధ్యమైనచోట్ల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి" అని మంత్రి ఆదేశించారు.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

# శత్రువు దాడి చేయాలంటే భయపడాలి

### ఇంటెలిజెంట్ వార్‌ఫేర్ వైపు మళ్లాల్సిన అవసరం ఉంది
### చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** మారుతున్న కాలానికి అనుగుణంగా యుద్ధతంత్రాలు భౌతికం నుంచి సింథటిక్, కాగ్నిటివ్ రంగాలకు విస్తరిస్తున్నాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. భారత సాయుధ దళాలు ఇప్పుడు ఇంటెలిజెంట్ వార్‌ఫేర్ వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)లో మంగళవారం, బుధవారం మల్టీ డొమైన్ ఇంటిగ్రేటెడ్ టెక్నలాజికల్లీ–ఎంపవర్డ్ రెసిలియంట్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్(మిత్రా) సమావేశాలు జరిగాయి. రెండో రోజు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భారత రక్షణ వ్యూహాల్లో రాబోయే విప్లవాత్మక మార్పుల గురించి కీలక ప్రసంగం చేశారు. "కేవలం మల్టీ డొమైన్ ఆపరేషన్స్‌కు(ఎండీవోకి) పరిమితం కాకుండా ఆల్ రియల్మ్ ఆల్ డొమైన్ ఆపరేషన్స్(అరాడో) దిశగా భారత సైన్యం పరిణామం చెందాలి. ఎండీవోలో భూమి, ఆకాశం, సముద్రం, అంతరిక్షం, సైబర్ రంగాల మధ్య సమన్వయం ఉంటుంది... అరాడో అంతకంటే విస్తృతమైనది. ఇది యుద్ధాన్ని భౌతిక సరిహద్దులకే పరిమితం చేయకుండా మేధోపరమైన రంగాలపై దృష్టి పెడుతుంది. శత్రువు ఆలోచనా విధానాన్ని, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

**అణ్వాయుధాలను వాడకుండానే...**

సైనిక వ్యవహారాల్లో ప్రస్తుతం మూడో విప్లవం నడుస్తోంది. ఇది పాత, కొత్త రంగాలు కైనటిక్, నాన్ కైనటిక్ కలయికగా ఉంటుంది. భారత్ నాన్ న్యూక్లియర్ డిటరెన్స్‌ని పెంపొందించుకోవాలి. శత్రువు మనపై దాడి చేయాలంటే భయపడేలా మన సాంకేతికత, సైనికశక్తిని ప్రదర్శించే స్థాయికి చేరాలి" అని జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. ఈ సదస్సులో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) కూడా పాలుపంచుకొంది.

# ఉగాది కానుకగా ఇందిరమ్మ ఇళ్లు..

## హైదరాబాద్ వాసుల కోసం సర్కార్ ప్రత్యేక ప్రణాళిక

- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఏర్పాట్లు
- ఉగాదిలోగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాలని లక్ష్యం
- సొంత స్థలం ఉన్న పేదలకు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం
- మురికివాడల్లో మోడల్ కాలనీల నిర్మాణం.. 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి ప్లాన్
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 3 లక్షల ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలోని నిరుపేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోనూ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉగాది పండగలోపు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల నుంచి భారీగా దరఖాస్తులు రావడంతో అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే చేపట్టి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశారు.

**సొంత స్థలం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం**

ప్రస్తుతం సొంత స్థలం ఉండి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేని పేదలకు తొలి విడతలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుంది. గ్రేటర్ పరిధిలో సుమారు 12 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలనలో 18 వేల మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే, ఈ జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, వారం రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఆదాయ పరిమితి, భూ యాజమాన్య పత్రాలు, కుటుంబ పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

**బహుళ ప్రణాళికలతో ముందుకు**

మురికివాడల్లో నివసించే వారి కోసం "ఇందిరమ్మ మోడల్ కాలనీలు" నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

-4లో

# తెలంగాణ ఏర్పాటులో సోనియాది కీలకపాత్ర

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ఏర్పాటుతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ కీలక పాత్ర పోషించారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. భారాస హయాంలో నాశనమైన రాష్ట్రాన్ని రెండేళ్ల తమ పాలనలో ప్రగతిపథంలోకి తీసుకుని వచ్చినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ, ఏపీలకు చెందిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు వికారాబాద్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో బుధవారం ఉత్తమ్ మాట్లాడారు. "తెలంగాణ

-4లో

# జగిత్యాల జిల్లాలో పెద్ద పులి సంచారం..

## అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక





**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాల జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. జిల్లాలోన కొడిమ్యాల, భీమారం మండల్లాలో సంచరిస్తూ ప్రజలన భయభ్రాంతులకు గురిచేస్తోంది. పులి సంచారంతో సమీప గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. పులిసంచారంపై సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బుధవారం ( ఫిబ్రవరి 25)కొడిమ్యాలమండలం దమ్మయ్యపేట సమీపంలో గరటవాగు సమీపంలో పెద్దపులి సంచరిస్తున్న ట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో దమ్మయ్యపేట శివారులోని అడవుల్లో పరిశీలించిన అధికారులు పులి పాదముద్రలు గుర్తించారు. దీంతో దమ్మయ్యపేట, సమీప గ్రామాలపై సూరంపేట, తిరుమలాపూర్, సంద్రాలపల్లిగ్రామాల ప్రజలు

-4లో

# రైతు బంధు నిధులు వెంటనే విడుదల చేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తడం లేదని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు దాటుతున్నా.. క్యాబినెట్ సమావేశంలోనూ ఆ ప్రస్తావన లేదని తెలిపారు. "రైతుల కన్నీళ్లతో పునాదులు నిర్మించుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించినట్లు చరిత్రలో లేదు. ఓట్ల కోసం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యతలు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. ఎన్నికల ముందు ఎకరానికి రూ. 15,000 రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటికే రెండు సీజన్ల రైతుబంధుకు ఎగనామం పెట్టారు. రైతులకు సకాలంలో రైతుబంధు ఇవ్వడానికి నిధులు లేవంటున్న రేవంత్‌రెడ్డికి.. మూసీ సుందరీకరణకు, ఫోర్త్ సిటీ పేరుతో భూసేకరణకు రూ.వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇకనైనా రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

### మంత్రి రాజనర్సింహకు ఐకాస వినతి

# ఆరోగ్య పథకంలో పెన్షనర్ల వాటా 1 శాతానికి తగ్గించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్టు పేరులో పెన్షనర్లను చేర్చాలని, దానికి తాము చెల్లించే వాటాను ఒక శాతానికే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఐకాస.. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కోరింది. వైద్యసేవలను ఆయుర్వేద, హోమియోపతి విధానాలకు సైతం విస్తరించాలని అభ్యర్థించింది. ఐకాస ఛైర్మన్ కె.లక్ష్మయ్య అధ్యక్షతన నేతలు సత్యనారాయణ, మోహన్ నారాయణ, భరత్‌రెడ్డి, పుల్లయ్య, రాజేంద్రబాబు, సూర్యనారాయణ తదితరులు మంత్రిని సచివాలయంలో కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని సూసైడ్ కేసులో ట్విస్ట్.. పోలీసులు చెబుతోంది నిజమేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ సెకండియర్ చదువుతోన్న వసంత (19) అనే విద్యార్థిని బాలికల హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. వసంత ఆత్మహత్యకు చదువుల ఒత్తిడి కారణమా? లేక కుటుంబ సమస్యలా? తోటి విద్యార్థులంతా ఆందోళన చెందుతున్న సమయంలో పోలీసులు కొత్త విషయం చెప్పడంతో విద్యార్థుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆత్మహత్యకు సరైన కారణమేంటో చెప్పాలని డిమాండ్ చేస్తూ వీసీ ఛాంబర్ ను ముట్టడించారు. దీంతో కళాశాల ఆవరణలో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. వసంత ఆత్మహత్య కేసులో పోలీసులు అనుమానించిన కోణమేంటి?వసంత ఆత్మహత్య కేసులో పోలీసులు సంచలన విషయాలను బయటపెట్టినట్లు తెలుస్తోంది. గణేష్ అనే యువకుడితో వసంత ఐదేళ్లుగా ప్రేమలో ఉన్నట్లు సమాచారం. నిన్న (మంగళవారం) రాత్రి గణేష్ నుంచి ఫోన్ కాల్ రాగా.. ఆ తర్వాత ఆమె మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత ఫోన్ కాల్స్, వాట్సప్ బ్లాక్ చేసినట్లు గుర్తించారు. ట్విస్ట్ ఏంటంటే.. గణేష్ నిన్న రాత్రే హైదరాబాద్ లోని ఓ హాస్టల్ లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గణేష్ ఆత్మహత్య విషయం తెలుసుకున్న వసంత.. నిన్న రాత్రే కత్తితో చేతికి, మెడకు గాట్లు పెట్టుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ తర్వాత యమున గర్ల్స్ హాస్టల్లో తన గదిలో ఉరివేసుకుని చనిపోయినట్లు తెలిపారు. అయితే విద్యార్థులు మాత్రం.. వసంత ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆమె చేతులు, మెడపై గాయాలుండటంతో ఏం జరిగిందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు, వీసీ మాత్రం వసంత మనోవేదనతోనే చనిపోయినట్లు చెప్తున్నారు. కాగా.. గణేష్ చివరిగా చేసిన ఫోన్ కాల్ లో గణేష్ ఏం చెప్పాడు?

ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడమే కారణమా? బంధువులే అయినా ఎందుకు దూరం పెట్టాలనుకున్నారు? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మీ అందరి మద్దతుకు ధన్యవాదాలు.. దేవ్‌జీ సోదరుడి కుమార్తె తిప్పిరి సుమ భావోద్వేగ సందేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** దశాబ్దాల పాటు సాగిన మావోయిస్టు సాయుధ పోరాటం చివరి అంకానికి చేరుతోంది. ఈ క్రమంలో తాజాగా మావోయిస్టు పార్టీ టాప్ లీటర్లు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నరసింహారెడ్డి అజ్ఞత జీవితం వదిలిపెట్టారు. సుదీర్ఘ కాలం తమ కుటుంబాలను వదిలి అడవి బాట పట్టిన వీరు ఇప్పుడు జనజీవన స్రవంతిలో కలవడం పట్ల వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో దేవ్‌జీ రాకపై ఆయన తమ్ముడి కూతురు తిప్పిరి సుమ కృతజ్ఞతా సందేశం పంపించారు.

**నమ్మిన సిద్ధాంతం కోసమే పని చేశారు..**

దేవ్‌జీ అడవులను వీడి బయటకు రావడంపై తిప్పిరి సుమ సంతోషం వ్యక్తం చేశారు. 'పేద ప్రజలకు సేవ చేయాలన్న మా పెదనాన్న ఆశయం గొప్పది.. 40 ఏళ్లుగా కుటుంబానికి దూరమైనా ఆయన నమ్మిన సిద్ధాంతం కోసమే పని చేశారు.. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఆయన ప్రజాక్షేత్రంలో ఉండి పోరాటం చేయాలని కోరుకున్నాం.. అనుకున్నట్లుగానే మా కోరిక ఫలించి పెదనాన్న పోలీసుల ఎదుట లొంగిపోయారు.. మా పెద్దనాన్నను ఎప్పుడెప్పుడు చూడాలా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం.. ఎంతో కాలం ఎదురు చూసిన రోజు చివరికి వచ్చింది.. మా నిరీక్షణ నెరవేరింది. ఈ క్షణంలో మా హృదయాల్లో నిండిన ఆనందాన్ని మాటల్లో వ్యక్తపరచలేము.. ఇది మా కుటుంబానికి సాధారణ రోజు కాదు.. ఇది ఒక గొప్ప భావోద్వేగ ఘట్టం.. ఒక ఆశీర్వాదం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ), డీజీపీ శివధర్?రెడ్డికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.. అలాగే ఎస్ఐబీ అధికారులు, ఈ కార్యం విజయవంతం కావడానికి అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.. మీ అందరి కృషి, సహాయం, మద్దతు వల్లే ఈ రోజు సాధ్యమైంది.. మా కుటుంబం తరఫున ప్రతిఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు.. ఇది మా జీవితాల్లో మరచిపోలేని రోజు.. మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోయే క్షణం.. మీ అందరికీ మా ప్రగాఢ కృతజ్ఞతలు.. మీడియా ప్రతినిధులందరికీ నా కృతజ్ఞతలు..' అంటూ సుమ సందేశంలో పేర్కొన్నారు.

**సుమ పుట్టకముందే అజ్ఞాతంలోకి..**

నిజానికి తిప్పిరి సుమ జన్మించక ముందే దేవ్‌జీ ఉద్యమబాట పట్టారు. కానీ తన పెద్దనాన్న ఉద్యమంలో ఉన్నారని తెలుకున్న సుమ ఆయన తిరిగి ఇంటిరి రావాలని చాలా ఏళ్లుగా ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్లు జరిగిన ప్రతిసారి తన పెద్దనాన్నకు ఆందోళనతో కూడిన విజ్ఞప్తిని చేస్తూ వచ్చారు. ఆపరేషన్ కగార్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు స్థానాన్ని దేవ్‌జీతో భర్తీ చేయబోతున్నారన్న ప్రచారం జరిగిన సమయంలో తిప్పిరి సుమ తన పెద్దనాన్నకు లేఖ రాశారు. 'పెదనాన్నా ఇంటికి రా... ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట ఎన్‌కౌంటర్లు జరుగుతున్నయ్.. నువ్వెట్లున్నవో.. నీకేం అవుతుందోనని భయమేస్తోంది. సమసమాజం కోసం అడవులకు వెళ్లావు.. ఇక చాలు.. ఇంటికి వచ్చేయ్..' అంటూ గతేడాది మేలో లేఖ రాశారు. రెండు నెలల క్రితం దేవ్‌జీ పోలీసుల కస్టడీలో ఉన్నారనే ప్రచారం నేపథ్యంలో 'మా పెద్దనాన్న ఆచూకీ తెలపాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు సుమ ట్వీట్ ద్వారా కోరారు. ప్రతి రోజు వినిపించే ఈ సమాచారం తమ కుటుంబాన్ని తీవ్ర కలిచివేతకు గురిచేస్తోందని, దయచేసి ఆయనకు లొంగిపోవడానికి అవకాశం ఇవ్వాలని తమ కుటుంబం తరఫున వేడుకుంటున్నామని విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. మొత్తానికి దేవ్‌జీ అజ్ఞాతం వీడి బయటకు రావడంతో ఆయన కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఉగాది కానుకగా ఇందిరమ్మ ఇళ్లు..

### హైదరాబాద్ వాసుల కోసం సర్కార్ ప్రత్యేక ప్రణాళిక

-3 పేజి తరువాయి

నగరానికి దూరంగా ఇళ్లు కేటాయిస్తే వారి జీవనోపాధి దెబ్బతింటుందనే ఉద్దేశంతో, వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే 5 నుంచి 10 అంతస్తుల భవనాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అవసరమైన స్థల సేకరణపై మంత్రులు ఇటీవల అధికారులతో చర్చించారు. వీటితో పాటు, నగరంలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పేదలకు కేటాయించాలని నిర్ణయించారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా జోరుగా పనులు**

ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు వేగంగా సాగుతోంది. ప్రభుత్వం ఇప్పటివరకు 3 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, వారిలో 2.50 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. వచ్చే నెలాఖరు నాటికి లక్ష ఇళ్లను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## తెలంగాణ ఏర్పాటులో సోనియాది కీలకపాత్ర

-3 పేజి తరువాయి

ఏర్పాటైతే పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని కేసీఆర్ తొలుత హామీ ఇచ్చారు. కానీ కుటుంబ పాలనతో సహా తన వ్యక్తిగత ఎజెండా అమలు కోసం రాష్ట్రం వచ్చిన తర్వాత వెనక్కి తగ్గారు. కాళేశ్వరం బ్యారేజీ కొంత కూలిపోయినందున దానికి మరమ్మతులు చేయాలా లేక పూర్తిగా కూల్చివేసి పునర్నిర్మాణం చేపట్టాలా అనే అంశంపై ఐఐటీ నిపుణులు అధ్యయనం చేస్తున్నారు" అని ఉత్తమ్ అన్నారు.


## జగిత్యాల జిల్లాలో పెద్ద పులి సంచారం.. అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

-3 పేజి తరువాయి

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బావులు, పొలాల దగ్గర వెళ్లే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మరోవైపు భీమారం మండలం మోత్కూర్ రావుపేట గ్రామ శివారులో గత రెండు రోజులుగా పెద్దపులి సంచరిస్తోంది. పొలాలకు వెళ్లే రైతులకు ఈ క్రూరమృగం ప్రత్యక్షంగా కనిపించడంతో వారు ప్రాణభయంతో పరుగులు తీశారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.

# 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ.. అభ్యర్థుల వివరాలు విడుదల




**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల్లో ఖాళీగా ఉన్న 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ అయింది. వైద్య, ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డు (MHSRB) ఈ నియామకాలకు సంబంధించి అభ్యర్థుల ప్రాథమిక వివరాలను విడుదల చేసింది. ప్రస్తుతం బోర్డు విడుదల చేసిన అభ్యర్థుల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, అభ్యర్థులు తమ ఫిర్యాదులను ఈనెల 28 వరకు సమర్పించుకోవచ్చు. దరఖాస్తులో దొర్లిన తప్పులు లేదా మెరిట్ లెక్కింపులో వ్యత్యాసాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన వెంటనే, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తుది మెరిట్ జాబితాను బోర్డు సిద్ధం చేయనున్నారు. మెరిట్ జాబితా ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసి, మార్చి చివరి నాటికి నియామక పత్రాలను అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏప్రిల్ మొదటి వారం కల్లా కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరతను తీర్చడానికి ఈ నియామకాలు అత్యంత కీలకం కానున్నాయి.

## రాష్ట్ర చరిత్రలోనే ఆదర్శ కాలనీ

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** రాష్ట్ర చరిత్రలో ఒక పురపాలక సంఘంలో ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేదలకు పంచేందుకు సిద్ధం చేయడం ఇదే ప్రథమమని, ఇది రాష్ట్రంలోనే ఆదర్శ ఇందిరమ్మ ఇళ్ల కాలనీ అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రామస్వామి గట్టు వద్ద నిర్మించిన ఇందిరమ్మ ఆదర్శ కాలనీ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. 110 ఎకరాలలో రూ.125 కోట్లతో జీప్లస్-1 పద్ధతిలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం

**బాల్కొండ, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా, బాల్కొండలోని భవిత సెంటర్‌లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ హెల్త్ చెకప్, ఫిజియోథెరపీ సేవలు అందించారు. మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ పిల్లలకు ఫిజియోథెరపీ వైద్యం ఒక వరమని, ప్రతి వారం సోమవారం, బుధవారం ఉచిత ఫిజియోథెరపీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రూ.91 కోట్ల బియ్యం పక్కదారి !

**నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** గడువు పెంచినా బియ్యం అప్పగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన 20 మిల్లర్లను జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు తాజాగా డీఫాల్టర్లుగా ప్రకటించారు. వారి నుంచి 2024-25 ఖరీఫ్‌కు సంబంధించిన 24 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాయమైనట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.91 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. సదరు మిల్లర్లకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. ఈ నెల 16వ తేదీతో పొడిగించిన గడువు సైతం ముగియడంతో అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు.

## డాక్టర్ నిర్లక్ష్యం వల్ల 8 నెలల పసికందు బలి!

**నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డాక్టర్ నిర్లక్ష్యం వల్ల 8 నెలల పసికందు మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కడారి శ్రీహరి భార్య మహేశ్వరికి ఎనిమిది నెలల గర్భం నిండుతున్న సమయంలో ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటుండగా ఈ దుర్ఘటన జరిగింది. గర్భంలోనే శిశువు మరణించినా, డాక్టర్ హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లాలని సూచించారని, అక్కడికి తీసుకెళ్లగా అప్పటికే శిశువు మరణించిందని చెప్పారని బాధితులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, వెంటనే ఆసుపత్రిని సీజ్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## 264 మంది పోకిరిలను అదుపులో తీసుకున్న షీ టీం పోలీసులు

**నాంపల్లి, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో షీ టీం పోలీసులు 264 మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 242 మంది మేజర్లు, 22 మంది మైనర్లు ఉన్నారు. 56 మందిపై కేసులు నమోదు చేయగా, 52 మందికి కోర్టు రూ.1050 జరిమానా విధించింది. నలుగురికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు. 188 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## స్పందించి.. పరీక్ష కేంద్రానికి పంపించి..!

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** తెలంగాణ వ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు హడావుడితో ఇబ్బందులు పడుతుంటారు. ఈ విషయాన్ని గ్రహించిన జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. ఓ విద్యార్థికి చింతల్‌లోని వాగ్దేవి కళాశాలలో పరీక్ష కేంద్రం ఉంది. కానీ ఆమె భాగ్యరథి కళాశాలకు వెళ్లారు. ఈ విషయాన్ని గ్రహించిని కానిస్టేబుల్ రఫీ వెంటనే తన ద్విచక్ర వాహనంపై విద్యార్థినిని ఆ పరీక్ష కేంద్రం వద్దకు తీసుకెళ్లారు.

## భరత్‌నగర్ వంతెన పక్కన వ్యక్తి దారుణహత్య

**సనత్‌నగర్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** నగరంలోని సనత్‌నగర్ పీఎస్ పరిధిలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. బుధవారం తెల్లవారుజామున భరత్‌నగర్ వంతెన పక్కన శంకర్ (48) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పొడిచి చంపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని కర్ణాటక వాసిగా గుర్తించారు. శంకర్ రెండేళ్లుగా మూసాపేటలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

## భార్యను గొడ్డలితో నరికి దారుణ హత్య

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** కట్టుకున్న భర్తే కాలయముడై భార్యను దారుణంగా హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నోముల గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ మధు వివరాల ప్రకారం.. స్థానికుడు మాదనమెని బాబు వ్యవసాయం, మేస్త్రీ పనిచేస్తాడు. భార్య అమృత భర్తతోపాటు వెళ్తుండేది. వీరికిద్దరు కుమారులు. పెద్ద కుమారుడికి పెళ్లి కాగా చిన్న కుమారుడు పెట్రోల్ బంకులో పనిచేస్తాడు. ఐదారు నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో బంధువులు, కుటుంబ సభ్యులు నచ్చజెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది.

## కల్తీ టీ పొడి తయారీ.. ఒకరి అరెస్టు

**సనత్‌నగర్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** కొబ్బరి పీచు, రసాయన రంగులను ఉపయోగించి కల్తీ టీ పొడి తయారుచ్తేన్న ఒకరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టుచేశారు. సనత్‌నగర్ ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కమిషనర్ టాస్క్‌ఫోర్స్(వెస్ట్‌జోన్) బృందం.. సనత్‌నగర్ పోలీసులతో కలిసి ఒక ప్రాంగణంపై దాడి చేసింది. ఫతేనగర్‌కు చెందిన జగన్నాథ్ బిష్ణోయ్ అధిక లాభాల కోసం సింథటిక్ రసాయనాలను ఉపయోగించి టీ పొడిని కల్తీ చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రంగు కలిపిన టీ పొడి 120 కిలోలు, సహజమైన టీ పొడి 30 కిలోలు, కోకోపీట్ మిశ్రమం 138 కిలోలు, బెల్లం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## కారును ఢీకొన్న టిప్పర్.. నాలుగేళ్ల చిన్నారి మృతి

**మహేశ్వరం, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మొహబ్బత్‌నగర్ గేటు సమీపంలో కారును ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో కారు డ్రైవర్ రాత్లావత్ బద్రు కుమారుడు బిట్టు(4) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. మహేశ్వరం ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మల్లాపూర్‌లో నివాసముంటున్న రాత్లావత్ బద్రు కుటుంబసభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా డిండి మండలం తబ్లాపూర్ తండాలోని తన చెల్లెలు ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం సాయంత్రం తిరిగి వస్తుండగా మొహబ్బత్‌నగర్ గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో బిట్టు అక్కడికక్కడే మృతి చెందాడు.

# రాష్ట్రంలో అరెస్టుల పర్వం నడుస్తున్నది.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అరెస్టుల పర్వం నడుస్తున్నదని, అభివృద్ధిని మరచి అక్రమ కేసులపై దృష్టి పెట్టారని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఇబ్బందులు పెడుతున్నారని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను దోషులుగా చూస్తున్నారని ఆరోపించారు. పాడి కౌశిక్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యేగా వీణవంక సమ్మక్క-సారలమ్మ జాతరలో ప్రొటోకాల్ అడిగారని.. ప్రొటోకాల్ ఉల్లంఘించడమే కాక ఆయనపై పోలీసులు నిరాధార ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. సీపీ మత మార్పిడులకు పాల్పడుతున్నారని ఎక్కడా అనలేదని.. ఐపీఎస్ అధికారుల సంఘం చేసిన స్టేట్మెంట్‌ను అప్పుడే కౌశిక్ రెడ్డి ఖండించారని తెలిపారు. ఈ కేసును సీఐడీకి ఎందుకు ఇస్తున్నారని.. ఈ కేసులో స్కాం ఉన్నదా.. దొంగతనం ఉన్నదా? అని ప్రశ్నించారు. అలాగే.. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఎందుకు కస్టడీ కావాలని అడుగుతున్నారని ప్రశ్నించారు. డీజీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించవద్దని అన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నుంచి తాను వీణవంకకు వెళ్తుంటే ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. తమ తల్లిదండ్రులను హౌస్ అరెస్టు చేశారని.. తన మైనర్ బిడ్డను పోలీసులు గుంజుకుని వెళ్లారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కరీంనగర్ సీపీ తనను ఇబ్బందులు పెట్టారని అన్నారు. తాను ముస్లింలను తిట్టానని కాంగ్రెస్ వాళ్లు అసత్య ప్రచ

ారం చేస్తున్నారని అన్నారు. తాను 50 మందితో వెళ్లినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. మరోవైపు.. సీఐడీని పోలీసులు తప్పుదోవ పట్టిస్తున్నారని.. అక్కడి సీసీ టీవీ ఫుటేజ్‌ను బయటకు తీయాలని అన్నారు. పోలీసులతో కుమ్మక్కై సీఐడీ విచారణ చేస్తున్నారని.. రేవంత్‌రెడ్డి స్క్రిప్ట్ ఏం ఇస్తే అదే చేస్తారా అని నిలదీశారు. వచ్చే మూడేళ్లలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని.. ఎవరినీ విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. కరీంనగర్ సీపీ, హుజూరాబాద్ ఏసీపీ, జమ్మికుంట సీఐని సస్పెండ్ చేసే వరకూ పోరాటం చేస్తానన్నారు.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం!

**జడ్చర్ల, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** జడ్చర్ల మండలం మాచారం సమీపంలో 44వ జాతీయ రహదారిపై హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంతో ముందు వెళ్తున్న మినీ వ్యాన్‌ను ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మినీ వ్యాన్ పక్కనే వెళ్తున్న కారును ఢీకొట్టి, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్ కుటుంబానికి తీవ్ర గాయాలయ్యాయి. మినీ వ్యాన్‌లో జోగులాంబ వెళ్తున్న 16 మంది యాత్రికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువులో గల్లంతైన యువకుల మృతి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** చెరువులో ఈతకెళ్లి గల్లంతైన యువకులు మృతిచెందారు. సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. గొల్లపల్లికి చెందిన దుబ్బ నవీన్(24), యాదగిరి(24) పెయింటింగ్ పని చేస్తారు. ఈ నెల 22న గ్రామ సమీపంలో చెరువులో ఈతకు వెళ్లి గల్లంతయ్యారు. రెండు రోజుల గాలింపు అనంతరం మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది బయటకు తీశారు. పంచనామా చేసి కుటుంబీకులకు అప్పగించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. యాదగిరికి తండ్రి లేరు. పని చేస్తూ తల్లికి ఆసరాగా ఉంటున్నారు.

## 'గుట్ట' చప్పుడు కాకుండా మాయం

**కొల్లాపూర్, ఫిబ్రవరి 25పెన్ పవర్:** మట్టిదందాకు అడ్డూఅదుపూ ఉండటం లేదు. గుట్టలు కరుగుతున్నాయి. ఎక్కడ మన్ను కన్పించినా వదలడం లేదు., అక్రమార్కులు రాత్రింబవళ్లు టిప్పర్లు, లారీల్లో తరలించేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, అటవీ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. కొల్లాపూర్ నియోజక వర్గంకోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, కొల్లాపూర్ మండలాల్లో నిత్యం దందా జరుగుతోంది.

## కృష్ణా నదిలో రోడ్డు.. అవినీతికి పడని అడ్డు

**గద్వాల, ఫిబ్రవరి 25పెన్ పవర్:** అవినీతికి అడ్డుపడటం లేదు.. అక్రమాలకు తెరపడటం లేదు.. ఫలితంగా కృష్ణా నదిలోనే రోడ్డు వేసుకున్నారంటే ఇసుకాసురుల ఇష్టారాజ్యం అవగతం అవుతోంది.. అధికారంలో మేమున్నాం.. మా పరిధిలో మేము ఇసుక తవ్వుకుంటాం అంటూ కొందరు, అధికారంలో మీరుంటే మేమేమన్నా తక్కువా.. అని మరో వర్గం సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెట్టుకుంటుండటం తాజా పరిణామం. ఇదీ కృష్ణానదీ తీరంలోని పరిస్థితి.

## పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కల్పనలో రాజీ పడవద్దు



**నల్లగొండ, ఫిబ్రవరి 25పెన్ పవర్:** బుధవారం నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పరీక్ష కేంద్రాలలో సౌకర్యాలు, తాగునీరు, టాయిలెట్స్ వంటి అంశాలపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు.

## మద్యం మత్తులో వీరంగం

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 25పెన్ పవర్:** మద్యం మత్తులో ఐదుగురు వ్యక్తులు నల్గొండ జిల్లా నిడమనూరులో ఓ యువకుడిని తీవ్రంగా కొడుతూ వీరంగం సృష్టించారు. దీనిని చరవాణిలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. బాధితుడి మామ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హాలియా సీఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...నిజామాబాద్ జిల్లా వర్ని గ్రామానికి చెందిన నడిమిది సాయి నిడమనూరు మండలం వెంగన్నగూడెం గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆదివారం తన అత్తగారి ఇంటికి వచ్చిన సాయి అక్కడ ఐదుగురు వ్యక్తులతో గొడవ జరగడంతో నిడమనూరుకు వచ్చాడు. నిడమనూరుకు వచ్చిన అనంతరం సాయి మళ్లీ గొడవపడిన వారికి ఫోన్ చేసి తిట్టాడు. దీంతో వారు ఆదివారం అర్ధరాత్రి నిడమనూరు వచ్చి రాంనగర్‌లోని వీధిలో అతన్ని రోడ్డుపై పడేసి తీవ్రంగా కొట్టారు. అందులో ఒకరు దీనిని చరవాణిలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు పంపడంతో స్థానికంగా వైరల్ అయ్యింది. సాయి మామ సైదులు నిడమనూరు స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## కూర్చున్న వ్యక్తిని ఢీ కొట్టిన కారు

**దేవరకొండ, ఫిబ్రవరి 25పెన్ పవర్:** రోడ్డు పక్కన గల బెంచీపై కూర్చున్న ఓ యువకుడిని అదుపు తప్పిన కారు వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన షేక్ చాంద్‌పాషా(29) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం కూలి పనికి వెళ్లేందుకు రోజు మాదిరిగానే గుమ్మడవెల్లి బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన గల బెంచీపై కూర్చున్నాడు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి నుంచి నల్గొండ వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన చాంద్‌పాషాను వెంటనే దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నల్గొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

# తెలంగాణలో వాతావరణ శాఖ కీలక అప్ డేట్

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడుతున్నాయి. నేడు, రేపు కూడా తేలికపాటి జల్లులు కొన్ని ప్రాంతాల్లో మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో పాటు ఉపరితల ఆవర్తన ఏర్పడటంతో అకాల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే కొద్ది గంటల్లోనే ఉపరితల ఆవర్తనం బలహీన పడే అవకాశముందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

**మోస్తరు వానలు...**

ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే కొన్నిప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వానలు పడుతున్నాయని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. మరికొన్ని చోట్ల పొడి వాతావరణం నెలకొని ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు కూడా ఉత్తర కోస్తాలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశముందని పేర్కొంది. రాయలసీమలోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వాతావరణ శాఖ అంచనా మేరకు కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశముందని కూడా తెలిపింది. పశువుల కాపర్లు, రైతులు పొలాలకు వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

**రాజకీయ పరిశోధన**


**పంటలకు నష్టం...**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా




తెలంగాణలోనూ తేలికపాటి జల్లులు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పసుపు, మిర్చి పంటలు వేసిన రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షం వారిని నిలువునా ముంచేసింది. నేడు కూడా కొన్ని ప్రాంతాల్లో వానలు పడే అవకాశముందని, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. దీంతో పాటు గంటకు నలభై నుంచి నలభై ఐదు కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి జిల్లాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం.. మీడియా అకాడమీ ఛైర్మన్ పదవీకాలం పొడిగింపు




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మీడియా అకాడమీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ కె. శ్రీనివాస్ రెడ్డి పదవీకాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తూ ఇవాళ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, 2024, ఫిబ్రవరి 26న రెండేళ్ల కాలానికి గాను తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కె. శ్రీనివాస్ రెడ్డి నియమితులైన విషయం తెలిసిందే.

కాగా, జర్నలిజం రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న శ్రీనివాస్ రెడ్డి, జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న విశేష కృషిని ప్రభుత్వం గుర్తించి ఆయన పదవీకాలాన్ని పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, ఆయన మరో రెండేళ్ల పాటు తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మరియు ఇతర సంక్షేమ పథకాల అమలులో శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించనున్నారు.

# తిరుమలలో ఉచిత బస్సు సేవలకు కొత్త ఊపు

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల లో భక్తుల సౌకర్యార్థం టీటీడి నిర్వహిస్తున్న శ్రీవారి ధర్మ రథాలు (ఉచిత బస్సు సేవలు) డిజిటల్ డిస్ప్లే బోర్డుల ఏర్పాటుతో మరింత ప్రజాదరణ పొందుతున్నాయి. బస్సులు వచ్చే సమయాన్ని భక్తులు ముందుగానే తెలుసుకునేలా డిజిటల్ డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వేచిచూసే సమయం తగ్గి, ఉచిత రవాణా సేవలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో మొత్తం 12 ఆధునిక ఎలక్ట్రిక్ బస్సులు ఈ సేవలో ఉన్నాయి. రోజుకు సగటున 300 ట్రిప్పులు నిర్వహిస్తూ, ఒక్కో ట్రిప్పు సుమారు 6.5 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తోంది. ఈ విధానం దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోసం ప్రత్యక్ష బస్సు సమాచారం అందించే తొలి సాంకేతిక ప్రయోగంగా నిలుస్తోంది.

**రోజుకు 60 వేల మంది భక్తులు సురక్షితంగా ప్రయాణం**

బస్సుల ప్రత్యక్ష స్థానం, వచ్చే సమయాన్ని డిజిటల్ డిస్ప్లే ద్వారా భక్తులకు తెలియజేయడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజుకు సుమారు 60 వేల మంది భక్తులు ఈ ఉచిత బస్సు సేవలను వినియోగిస్తూ సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు.

**తగ్గిన ప్రైవేట్ ట్యాక్సీల ప్రయాణం – పెరిగిన ప్రజా రవాణా వినియోగం**

గతంలో ఉచిత బస్సు వచ్చే సమయం ముందుగా తెలియకపోవడంతో భక్తులు ప్రైవేట్ ట్యాక్సీల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపేవారు. దీంతో ట్యాక్సీ డ్రైవర్లు భక్తుల నుండి అధిక ధరలను వసూలు చేసేవారు. ఈ సమస్యను గుర్తించిన టీటీడీ అదనపు ఈవో శ్రీ సి. హెచ్. వెంకయ్య చౌదరి ప్రత్యేక చొరవ తీసుకుని తిరుమలలోని



20 బస్టాప్ లలో బస్సుల ప్రత్యక్ష సమయం తెలిసేలా డిజిటల్ డిస్ప్లే బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకుగాను హైదరాబాద్ కు చెందిన బి.ఎస్.టెక్నోట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డిజిటల్ బోర్డులను విరాళంగా అందివ్వగా, ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోంది. ఈ విధానం అమలు చేసినప్పటి నుండి బస్టాప్ వద్దకు వచ్చిన భక్తులకు బస్సు వచ్చే సమయం ప్రత్యక్షంగా తెలియడం, 10 నిమిషాల లోపే బస్సులు రావడంతో భక్తులు ఉచిత బస్సు సేవలను విరివిగా వినియోగించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ సౌకర్యం ఎంతో ఉపయోగరంగా ఉందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఇంధన వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ తోడ్పాటు**

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం ద్వారా ఇంధన వినియోగం తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా ఈ సౌకర్యం దోహదపడుతోంది. అదేవిధంగా తిరుమలలో వాహన రద్దీని తగ్గించి కాలుష్య నియంత్రణ దిశగా పటిష్టమైన ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి, భక్తులకు సౌకర్యవంతమైన, పర్యావరణ హితమైన రవాణా అందించాలనే లక్ష్యంతో టీటీడీ ఈ విధానాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది.

**భక్తుల కోసం రాత్రుల్లో అదనంగా 20 ట్రిప్పులు**

ప్రస్తుతం రాత్రి 9 నుండి ఉదయం 5 ఐదు గంటల వరకు ఈ ఎలక్ట్రిక్ బస్సులు 60 ట్రిప్పులు తిరుగుతుండగా భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో 20 ట్రిప్పులను పెంచనున్నారు. అదే విధంగా రాబోయే రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# కొల్లూరు సర్వీస్ రోడ్డుని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తాం : మెదక్ ఎంపీ



**హైదరాబాద్ పెన్ పవర్:** రామచంద్రాపురం మండలం కొల్లూరు ఎగ్జిట్ నెంబర్ 2 వద్ద నిర్మాణంలో ఉన్న సర్వీస్ రోడ్డు ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ సర్వీస్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గతంలోనే ఈ సర్వీస్ రోడ్ నిర్మాణం గురించి ప్రభుత్వం పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్థానిక జిల్లా మంత్రులు ఎమ్మెల్యే లకు కూతవేటు దూరంలో ఉన్న సర్వీస్ రోడ్ సమస్య ఎందుకు కనిపించట్లేదని ప్రశ్నించారు. ముఖ్యంగా ఈ రూట్ లో ప్రయాణించే స్థానిక ప్రజలతో పాటు ఐటీ ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.క్షేత్ర స్థాయిలో ట్రాఫిక్ ఇబ్బందులను స్వయంగా పరిశీలించిన ఆయన రోడ్డు పనులు పూర్తయ్యాక కొల్లూరు పరిసర ప్రాంతాలకు రాకపోకలు సులభతరం అవుతాయని, అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రజల సౌకర్యమే ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో రాజీ పడబోమని ఆయన పేర్కొన్నారు.

# పచ్చి పాలు తాగొద్దు.. చాలా ప్రమాదకరం..!




**హైదరాబాద్ పెన్ పవర్:** పచ్చి పాలు తాగొద్దని, చాలా ప్రమాదకరమని పీడియాట్రీషియన్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఓ చానెల్ డిబెట్‌లో పాల్గొన్న ఆయన కల్తీ పాల ఘటనలపై స్పందించారు. ఏ పాలు అయినా సరే పచ్చిగా తాగటం గాని, పాశ్చరైజ్ చేయకుండా అసలు ముట్టుకోవద్దని ఆయన తెలిపారు. పచ్చి పాలల్లో సూక్ష్మ క్రిములు ఉంటాయని తెలిపారు. ఇళ్లలో బర్రెల నుంచి తీసిన పాలల్లోనూ సూక్ష్మి క్రిములు ఉంటాయని, అందువల్ల వేడి చేసుకుని తాగాలని డాక్టర్ శ్రీకాంత్ సూచించారు.

**బర్రె పొదుగులోనూ సూక్ష్మ క్రిములు**

పాలు తీసే సమయంలో చేతులు తగులుతాయని, లేదా బర్రె పొదుగులోనూ బయట సూక్ష్మ క్రిములు ఉంటాయని, పాశ్చరైజ్ చేయకుండా ఎవరూ కూడా తాగొద్దని శ్రీకాంత్ పేర్కొన్నారు. పచ్చి పాలు తాగితే వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇంట్లో బర్రె నుంచి తీసిన పాలైతే వేడి చేసుకుని, డెయిరీ నుంచి అయితే పాశ్చరైజ్ చేసిన తర్వాతే తాగాలని చెప్పారు. ఇంట్లో పాశ్చరైజ్ చేయలేము కాబట్టే వేడిచేయమని చెబుతున్నామని పేర్కొన్నారు. పాశ్చరైజ్ చేయడం వల్ల పాలల్లో ఉన్న సూక్ష్మ క్రిములను నివారించగలుతామని డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు.

# నక్సలిజం.. ఒక సిద్ధాంత యుగానికి ముగింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** సాయుధ విప్లవం నుంచి ప్రజాస్వామ్య వాస్తవానికి నక్సలిజం ప్రయాణం. ఒక ఉద్యమం ముగింపు ఎప్పుడూ ఒక్కరోజులో రాదు. అది మెల్లగా కూలిపోతుంది. మొదట సిద్ధాంతం బలహీనపడుతుంది. తర్వాత ప్రజా మద్దతు తగ్గుతుంది. చివరికి నాయకత్వం ఒంటరిగా మిగులుతుంది. ఈరోజు మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా భావించబడుతున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జి తెలంగాణ పోలీసులకు లొంగిపోవడం.. కేవలం ఒక వ్యక్తి లొంగుబాటు కాదు. అది ఒక యుగానికి చారిత్రాత్మక మలుపు. గత కొన్నినెలలుగా కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకత్వం, ముఖ్య కార్యదక్షులు దాదాపు 95 శాతం మంది వరుసగా లొంగిపోయారు. ఇది యాదృచ్ఛిక పరిణామం కాదు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని ప్రకటించిన గడువు, లొంగుబాటు పిలుపులు, భద్రతా బలగాల కట్టుదిట్టమైన వ్యూహం.. ఈ పరిణామాలకు వేగం తెచ్చాయి. దేవ్ జీ లొంగిపోవడం మావోయిస్టు ఉద్యమానికి ప్రతీకాత్మక ముగింపు. కేంద్ర కమిటీ స్థాయి నాయకత్వం కూలిపోవడం అంటే సంస్థాగతంగా ఉద్యమం నిలబడే ఆధారం కూలిపోవడమే. వసంత మేఘంలా ఘర్జించిన విప్లవ స్వరం ఇప్పుడు లొంగుబాటు ప్రకటనల మౌనంగా మారింది. వసంత మేఘ ఘర్జన నుంచితెలంగాణ గ్రామాల గుండా ప్రయాణిస్తే హైవేల పక్కన, చిన్నచిన్న రహదారులలో అవతల సుత్తీ--కొడవలి గుర్తు ఉన్న స్థూపాలు కనిపిస్తాయి. అవి ఎవర్నీ పిలవవు. కానీ చాలా ప్రశ్నలు వేస్తాయి. అదే గ్రామాల్లో దళితవాడల్లో వరుసగా అంబేద్కర్ విగ్రహాలు, వాటి పక్కనే ఇటీవల వెలిసిన శివాజీ, వివేకానందుల విగ్రహాలు... ఇవి విగ్రహాల పోటీ కాదు. ఇవి భారత గ్రామీణ రాజకీయ చైతన్యంలో మారిన దశల సూచికలు. సాయుధ వామపక్షం, అస్తిత్వ--హక్కుల ఉద్యమం, హిందుత్వ రాజకీయాలు ఈ మూడు మధ్య నక్సలిజం ప్రయాణం. ఒక ఉద్యమం కథ మాత్రమే కాదు.. భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొన్న అత్యంత దీర్ఘకాలిక సవాల్ కథ.




**ఆకలి, కరవు, కోపం 'హంగ్రీ సిక్స్‌టీస్'**

1960ల భారత్ కేవలం పేద దేశం కాదు. అది అసంతృప్తితో మండుతున్న సమాజం. కరవు, ఆహార కొరత, డీవాల్యూయేషన్, నిరుద్యోగం... చరిత్రకారుడు సుమంత బెనర్జీ చెప్పినట్టు ఇది 'హంగ్రీ సిక్స్‌టీస్'.. రాడికల్ ఆలోచనలకు అత్యంత అనుకూల కాలం. అంతర్జాతీయంగా చైనా, వియత్నాం, క్యూబా విప్లవాల దశాబ్దం. భారత యువతకు సాయుధ మార్గం అసాధ్యంగా అనిపించలేదు. నిజాం పాలన ముగిసినా..తెలంగాణలో భూస్వామ్య పెత్తనం కొనసాగింది. వెట్టిచాకిరి, దొరల అరాచకాలు, ఉపాధి అవకాశాల లేమి, ఇక్కడ నక్సలిజం ఒక సిద్ధాంతంగా కాక, తక్షణ న్యాయ సాధనగా కనిపించింది. దున్నేవానికి భూమి,బీడీ ఆకు ఉద్యమం, పుల్లరి ఉద్యమం.. రాష్ట్రం చేయని పనులు నక్సలైట్లు చేసి చూపించారు. అందుకే దళితులు, ఆదివాసీలు ఈ ఉద్యమానికి పునాదిగా మారారు.

**దండకారణ్యం ప్రత్యామ్నాయ ప్రయోగం**

బస్తర్ అడవుల్లో మావోయిస్టులు ఒక 'జనతన రాజ్యం' నిర్మించాలనుకున్నారు. వ్యవసాయం, సహకార సంఘాలు పాఠశాలలు, ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థ.. అది ఒక సామాజిక ప్రయోగం. కానీ అది అడవులకే పరిమితమైంది. సోవియట్ యూనియన్ పతనం, ప్రపంచీకరణ, ఐటీ విప్లవం, సంక్షేమ పథకాలు.. ఈ మార్పులన్నీ నక్సలిజాన్ని కాలానికి అతీతంగా మార్చేశాయి. ఒకప్పుడు రిక్రూట్‌మెంట్ కేంద్రాలైన హాస్టళ్లు, కళాశాలలు ఇప్పుడు కార్పొరేట్ కలల దారులు. యువత కలలు మారాయి. సాయుధ విప్లవం అసంబద్ధంగా మారింది. 1990లలో దళిత ఉద్యమం నక్సలిజం ఖాళీ చేసిన స్థలాన్ని ఆక్రమించింది. కులాన్ని తగిన రీతిలో అడ్రస్ చేయలేకపోవడం నక్సలైట్ ఉద్యమానికి మౌలిక లోపం. ఈ విషయాన్ని కోబాడ్ గాంధీ వంటి నేతలు స్వయంగా అంగీకరించారు.

**లొంగుబాట్లు చివరి మలుపు**

ఇప్పుడు నక్సలిజం కేవలం సిద్ధాంతపరంగా కాదు.. సంస్థాగతంగా కూడా కూలిపోతోంది. మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా భావించబడుతున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ తెలంగాణ పోలీసులకు లొంగిపోవడం ఈ పరిణామానికి గట్టి సంకేతం. దేవ్ జీతో పాటు అనేక మంది సెంట్రల్ కమిటీ సభ్యులు, పార్టీకి ఆయువుపట్టుగా భావించిన ఉన్నత స్థాయి నాయకులు ఒక్కొక్కరుగా లొంగిపోతున్నారు. ఇది యాదృచ్ఛిక పరిణామం కాదు. దండకారణ్యంలో స్థావరాలు బలహీనపడటం, అర్బన్ నెట్‌వర్క్ పూర్తిగా ఛిన్నాభిన్నం కావడం, భద్రతా బలగాల సాంకేతిక ఆధిక్యం, ప్రజల మద్దతు కోల్పోవడం.. ఈ నాలుగు కారణాలు మావోయిస్టు ఉద్యమాన్ని తుది దశకు నెట్టేశాయి. ఇప్పుడు ప్రశ్న "ఎన్ని ఎన్‌కౌంటర్లు" కాదు. "ఎన్ని లొంగుబాట్లు" అన్నదే. డ్రోన్లు, గ్రేహౌండ్స్, డీఆర్‌జీ, అత్యాధునిక నిఘా వ్యవస్థ రాజ్యం వద్ద అపార శక్తి చేరింది. 2000--2025 మధ్య 12,000 మందికి పైగా మరణాలు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యం ప్రకటించారు.. 2026 మార్చి 31 నాటికి నక్సలిజానికి ముగింపు. ఇప్పుడు ఆ లక్ష్యం అసాధ్యంగా అనిపించడం లేదు.

**నక్సలిజం ఓడిందా లేక కాలం గెలిచిందా?**

నక్సలిజం భారతదేశాన్ని మార్చలేకపోయింది. అది నిజం. కానీ భారతదేశం ఎలా మారిందో.. నక్సలిజం మనకు చూపించింది. భూస్వామ్య అరాచకాలు, వెట్టిచాకిరి, అటవీ దోపిడీ ఈ అంశాలు ప్రజాస్వామ్య వ్యవస్థను సవరించడానికి నక్సలిజం ఒత్తిడి గ్రూప్‌లా పనిచేసింది. అయితే

కులం, ప్రజాస్వామ్యం, మారుతున్న ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో ఆ ఉద్యమం విఫలమైంది. ఇప్పుడు మావోయిస్టు నాయకుల లొంగుబాట్లు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి.. ఇది కేవలం సైనిక ఓటమి కాదు. ఇది ఒక సిద్ధాంత యుగానికి ముగింపు. వసంత మేఘ ఘర్జన ఇప్పుడు అడవుల్లో పీలస్వరమైంది. ఆ పీలస్వరంలో ఒక తరం కలల శబ్దం ఉంది. చరిత్ర దాన్ని తీర్పు చెప్పే రోజు ఇప్పుడే మొదలైంది.

## ఇంటర్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పై

**వైరా, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరీక్ష కేంద్రాన్ని ఎస్పై మేడా ప్రసాద్ బుధవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ చిన్నా మాట్లాడుతూ విద్యార్థులకు త్రాగునీటి వసతి, వైద్య సదుపాయం కల్పించామని ఎస్ఐకి తెలిపారు.

## ఉద్రిక్తతల నడుమ పూరిళ్ల కూల్చివేతలు

**పాలేరు, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్ల భూదాన్ భూమి (వినోభానగర్)లో పూరిళ్లు, రేకుల షెడ్ల తొలగింపుతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెల్లవారుజామునే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి పోలీసు సిబ్బంది తరలివచ్చారు. వీరితో పాటు ఖమ్మం జిల్లాలోని రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, వైద్యారోగ్య, పశుసంవర్ధకశాఖ సిబ్బంది సుమారు 2వేల మంది అక్కడికి చేరుకున్నారు. స్థానికులు కర్రలు చేతపట్టి అధికారులు, సిబ్బంది గుట్టపైకి రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అధికారులు సంయమనం పాటిస్తూనే పక్కకు తప్పుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రూ.67.20 లక్షల గంజాయి పట్టివేత

**సత్తుపల్లి, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న ఘటన వైరాలో చోటుచేసుకుంది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ డీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేశ్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీహరిరావు వైరాలోని ఐఎంఎల్ డిపో వద్ద తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రం కలిమెల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులో మత్తు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. క్షుణ్ణంగా తనిఖీ చేసి 101 కిలోల ఎండు గంజాయితో పాటు 2.7 కిలోల హాషిష్ ఆయిల్‌ను పట్టుకున్నారు. వీటితో పాటు కారు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ రూ. 67.20 లక్షలు ఉంటుందని నిర్ధారించారు.

## లింగగిరిలో ఎలుగుబంటి కలకలం

**వర్ధన్నపేట, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామ శివారులో రైతు మంద వెంకన్న పొలంలో ఓ ఎలుగుబంటి తన పిల్లలతో సంచరిస్తుంది. ఇది చూసిన గ్రామస్థులు భయాందోళనకు గురి అవుతున్నారు. గత మూడు రోజులుగా గ్రామ శివారులోని పొలాలలో అది సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## కార్మికశాఖ పరిహారం.. దళారులకు ఫలహారం

**నర్సంపేట, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** భవన నిర్మాణ, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల శ్రేయస్సు కోసం తెలంగాణ సంక్షేమ మండలి అనేక పథకాలను అమలు చేస్తోంది. కార్మికులు సాధారణ మరణం లేదా ప్రమాదవశాత్తు మృతిచెందినా కార్మికుల కుటుంబాలకు భరోసా కోసం కార్మికశాఖ పరిహారం చెల్లిస్తుంది. కార్మికుల పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి ఉపకార వేతనాలు, వారి వివాహం, ప్రసూతి సమయంలో ఆర్థిక సాయం అందిస్తోంది. నిర్దిష్ట సమయంలోపు దరఖాస్తు చేసుకుంటే పరిహారం అందుతుందని కార్మికశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే పరిహారం సకాలంలో అందడం లేదని అర్హులైన కార్మికుల కుటుంబాల సభ్యులు ఆరోపిస్తున్నారు.

## దుబాయ్‌లో జనగామ జిల్లావాసి మృతి

**జనగామ, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** దుబాయ్ వెళ్లిన జనగామ జిల్లావాసి అకస్మాత్తుగా మృతి చెందారు. దాంతో వారి కుటుంబం, స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తరిగొప్పుల మండలం మాన్‌సింగ్‌తండాకు చెందిన భూక్య శ్రీను(46) జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లారు. ఫిబ్రవరి 19న అక్కడే అకస్మాత్తుగా మృతిచెందారు. ఆయన మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఐదు రోజులు గడుస్తున్నా మృతదేహం ఇంటికి రాలేదు. స్థానిక పలు ప్రధాన పార్టీల ప్రజాప్రతినిధులు మృతదేహాన్ని గ్రామానికి చేర్చేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నారు. ఆయనకు భార్య విజయ, ఇద్దరు కుమారులున్నారు.

## బావను హత్య చేసిన మరదలు

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** మరదలు బావను హత్య చేసిన ఘటన హసన్‌పర్తిలోని సిద్ధాపూర్‌లో చోటుచేసుకుంది సీఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధాపూర్‌కు చెందిన బాల్నే మొగిలి (70) హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. మొగిలి భార్య సరోజన మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె చెల్లెలు వంగ ఇందిర భర్త చనిపోవడంతో మొగిలి ఇంట్లోనే ఉంటోంది. ఇంటి విషయంలో మొగిలి, ఇందిరకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో తెల్లవారుజామున ఇందిర మొగిలిని కత్తితో పొడిచి, బండరాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

## కాగస్మద్దూర్ రోడ్డుపై గుంతలతో ప్రయాణికులకు ఇక్కట్లు

**నర్సాపూర్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** ఆమెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని కాగస్మద్దూర్ రోడ్డు గుంతలతో నిండిపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు రోడ్డు దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## మురికి కాలువల సమస్యను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**గజ్వేల్, ఫిబ్రవరి 25( పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 1వ వార్డులో బుధవారం మురికి కాలువల సమస్యను మున్సిపల్ చైర్మన్ చందన రవీందరు, వార్డ్ కౌన్సిలర్ మమతా పోచయ్య పరిశీలించారు. చిన్న మరమ్మతులు, కాలువ శుభ్రతపై వారికి వివరించారు. సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి కాలువలను శుభ్రం చేయించారు. వార్డులో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించి, పరీక్షల తీరును పర్యవేక్షించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీవో యువరాజ్, ఆర్డీవో స్రవంతి, డిఐఈఓ గణేష్ జాదవ్, శిక్షణ ఐపీఎస్ రాహుల్ పాల్గొన్నారు.

# టీచర్ డిప్యూటేషన్ రద్దు చేయాలని తల్లిదండ్రుల నిరసన

**బోథ్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** తలమడుగు మండలం ఉండం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయులలో ఒకరిని డిప్యూటేషన్ పై వేరే స్కూల్ కు పంపిస్తున్నారని నిరసన తెలిపారు. 62 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో కేవలం ముగ్గురు టీచర్లు మాత్రమే ఉండగా, వారిలో ఒకరిని పంపడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని, వెంటనే డిప్యూటేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు పాఠశాల గేటుకు తాళం వేశారు.

## ఆదిలాబాద్ మార్చ్ 28న జాతీయ లోక్ అదాలత్

**నిర్మల్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు మార్చి 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పెండింగ్ కేసులను అధికంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. రానున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన సమన్వయ సమావేశంలో పలు సూచనలు చేశారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని సూసైడ్

**ఖానాపూర్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** బుధవారం బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థిని వసంత ఆత్మహత్యకు పాల్పడింది. వనపర్తి జిల్లాకు చెందిన ఈ విద్యార్థిని బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులకు కాలేజీ యాజమాన్యం సమాచారం అందించింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. వసంత ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## కొడుకుతో కలిసి భర్తను చంపిన భార్య!

**కరీంనగర్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి శివారులో ఈనెల 20న ఎర్రోల్ల లింబాద్రి హత్య కేసు మిస్టరీ వీడింది. భార్య లక్ష్మి పెట్టిన గృహహింస కేసును ఉపసంహరించుకోవాలని లింబాద్రి బెదిరించడంతో, విసిగిపోయిన ఆమె, కుమారుడు లతీఫ్, మరో నలుగురు కలిసి ఇనుప పైపులతో దాడి చేసి భర్తను హత్య చేసి మృతదేహాన్ని శివారులో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## వేములవాడలో కానిస్టేబుల్‌పై భక్తుడి దాడి!

**వేములవాడ, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** వేములవాడ పట్టణంలో అర్ధరాత్రి జాతర గ్రౌండ్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, అతిగా మద్యం సేవించిన ఓ భక్తుడు పోలీసు కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో పోలీసులపై దాడి చేసిన వ్యక్తితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వేములవాడ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఈ దాడి వరంగల్ జిల్లాకు చెందిన భక్తుడు చేశాడని సమాచారం.

# వేములవాడలో కానిస్టేబుల్‌పై భక్తుడి దాడి

**సిరిసిల్ల, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో అర్ధరాత్రి జరిగిన సంఘటనలో, అతిగా మద్యం సేవించిన ఓ భక్తుడు విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. జాతర గ్రౌండ్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి విచారించగా, కానిస్టేబుల్‌ను బూతులు తిడుతూ చేయి చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో స్థానికంగా వైరల్ అయింది. పోలీసులు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి, దాడి చేసిన భక్తుడితో పాటు అతనితో ఉన్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

# అయినవాళ్లే అంతమొందించారు

**చొప్పదండి, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండిలో నాలుగు రోజుల కిందట అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఎర్రోల్ల లింబాద్రి(51) కేసును పోలీసులు ఛేదించారు. అతడి వేధింపులు తాళలేక భార్య, కుమారుడు మరికొందరితో కలిసి హత్యకు పాల్పడినట్లు తేల్చారు. నిందితులు ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం మల్లాపూర్ మండలం మొగిలిపేటకు చెందిన లింబాద్రికి ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండికి చెందిన ఎర్రోల్ల లక్ష్మికి కొన్నేళ్ల కిందట పెళ్లయింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాలతో లక్ష్మి పిల్లలతో కలిసి ఎనిమిదేళ్లుగా భర్తకు దూరంగా పుట్టినింట్లో ఉంటుండగా, లింబాద్రి మెట్‌పల్లిలో ఉంటున్నారు.

# పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ బాధ్యతలు స్వీకరణ



**మానకొండూరు, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య, శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు సమక్షంలో తన పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపి, చైర్మన్, పాలకవర్గం కలిసికట్టుగా అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ సహకరించాలని సూచించారు.

# రామగుండం కార్పొరేషన్ బీజేపీ అభ్యర్థి తోట మమతకు ఘన సన్మానం

**హుజూరాబాద్, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో 32వ డివిజన్ లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన తోట మమత కుమార స్వామి రిని నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలని, పార్టీ బలోపేతానికి, అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజయం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# మావోయిస్టు మల్లేష్ లొంగుబాటు

**మధిర, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో కీలక మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యుడు మల్లేష్ బుధవారం ఉదయం చోటే భేథీయాలోని బీఎస్ఎఫ్ శిబిరంలో లొంగిపోయాడు. బీఎస్ఎఫ్ 94 బెటాలియన్ కమాండర్ రాఘవేంద్ర సింగ్ ఎదుట తన ఏకే 47 ఆయుధాన్ని అధికారులకు అందజేశాడు. మల్లేష్‌తో పాటు గ్రామస్థులు తమ ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ఈ సంఘటన మావోయిస్టులపై పోలీసుల ఒత్తిడిని సూచిస్తుంది.

# గ్రూప్ సభ్యుల పేరుతో అక్రమ రుణాలు!



**ఖమ్మం, ఫిబ్రవరి 25 పెన్ పవర్:** విజేత మండల మహిళా సమాఖ్య సిబ్బంది గ్రూపు సభ్యుల పేరుతో అక్రమంగా రుణాలు తీసుకున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండెబోయిన ఉమావతి కారేపల్లిలో జరిగిన ఐద్వా సమావేశంలో డిమాండ్ చేశారు. సిబ్బంది పర్సంటేజీ తీసుకోవడమే కాకుండా, గ్రూపు సభ్యుల పేరుతో రుణాలు తీసుకొని తామే చెల్లిస్తామని నమ్మించి, తర్వాత చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు అమాయక సభ్యులను ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఆరోపించారు. రుణాల మంజూరులో పారదర్శకత లోపించిందని, సరైన అజమాయిషీ లేకపోవడమే దీనికి కారణమని, బాధితులకు న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తొట్టతొలి భారతీయ వైద్యురాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆనందీబాయి గోపాల్‌రావ్ జోషి మొదటి భారతీయ మహిళా వైద్యులలో ఒకరు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మెడిసిన్ పట్టభద్రులు కావడంతో పాటు, స్నాతకోత్తర విద్య ( పోస్ట్ గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన భారతీయ సంతతికి చెందిన మొదటి మహిళ ఆమె. భారత దేశం నుండి అమెరికన్ గడ్డపై అడుగు పెట్టిన మొదటి మహిళ కూడా ఆమెనే అని భావిస్తారు. ఆనందీ గోపాల్ జోషి లేదా ఆనందీబాయి జోషి (మార్చి 31, 1865 – ఫిబ్రవరి 26, 1887) పూణే (మహారాష్ట్ర)లోని సనాతన సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు యమున అని పేరు పెట్టారు. 9 సంవత్సరాల వయసులో దాదాపు ఇరవై సంవత్సరాలు పెద్దయిన గోపాల్ రావు జోషిని వివాహం చేసుకున్నారు. వివాహం తరువాత, ఆమె భర్త ఆమెకు ఆనందీబాయి అని పేరు పెట్టారు. గోపాల్ రావు, కళ్యాణ్ లో తపాలా గుమాస్తాగా పనిచేసేవారు. తరువాత, ఆయన అలీభాగ్, చివరకు కలకత్తా బదిలీ అయ్యారు. విద్య పట్ల ఆనందీబాయికి ఉన్న ఆసక్తి గమనించి, సంస్కృతం కంటే ఆంగ్ల భాష నేర్చుకోవడం ముఖ్యమని భావించారు. ఆంగ్లం నేర్చుకోవడానికి సహాయం చేశారు. 14 సంవత్సరాల వయస్సులో, ఆనందీబాయి ఒక బాలుడికి జన్మనిచ్చింది. అవసరమైన వైద్య సంరక్షణ అందుబాటులో లేకపోవడంతో బాలుడు పది రోజుల్లో చనిపోయాడు. ఈ సంఘటన ఆనందీబాయి జీవితంలో ఒక మలుపును తీసుకొచ్చింది. ఆమె వైద్యురాలు కావడానికి ప్రేరణనిచ్చింది. గోపాల్ రావు సామాజిక భావాలు కలిగిన వ్యక్తి. విద్య నేర్చుకోవడానికి ఆ రోజుల్లో ఆనాటి బ్రహ్మణుల కుటుంబాలలో మహిళలకు పరిమితులు ఉండేవి. విదేశాలకు బ్రాహ్మణులు వెళ్లడం నిషేధమైన కాలమది. అయినా ఆమె భర్త తన భార్య వైద్య శాస్త్రాన్ని అభ్యసించడానికి ప్రోత్సహించాడు. ఆమెకు అమెరికాలో విశ్వ విద్యాలయం ప్రవేశం కొరకు ప్రయత్నాలు సాగించారు. 1880 లో, అయన రాయల్ విల్డర్ (ఒక ప్రసిద్ధ అమెరికన్ మిషనరీ) కు వ్రాసిన లేఖలో ఆనందీబాయికి యునైటెడ్ స్టేట్స్‌లో వైద్య అధ్యయనం చేయడానికి గల ఆసక్తిని పేర్కొంటూ, తన కోసం అమెరికాలో సరైన ఉద్యోగానికై అభ్యర్థించారు. ఇద్దరు ఆలుమగలు క్రైస్తవ మతం స్వీకరిస్తే సహాయం చేయగలనని విల్డర్ ప్రతిపాదించాడు. అయితే ఈ ప్రతిపాదన జోషి దంపతులకు ఆమోదయోగ్యం కాలేదు. అయితే విల్డర్ ఈ ఉత్తరప్రత్యుత్తరాలను తన సొంత పత్రికైన ప్రిన్స్టన్ మిషనరీ రివ్యూలో ప్రచురించాడు. రొస్సెల్, న్యూజెర్సీకి చెందిన థియోడెసియా కార్పెంటర్ అనే మహిళ తన దంత వైద్యుని కోసం ఎదురుచూస్తూ ఆయన కార్యాలయంలో యాధృచ్ఛికంగా సదరు పత్రికలో ఆనందీబాయి గురించి చదివింది. వైద్యవిద్య చదవాలన్న ఆనందీబాయి తపన, దాన్ని ప్రోత్సహిస్తున్న భర్త యొక్క వృత్తాంతం ఆమెను కదిలించింది. ఆనందీబాయికి ఉత్తరం వ్రాసి తాను ఆనందీబాయి అమెరికాలో ఉండటానికి వసతి సహాయం చేయగలనని ముందుకు వచ్చింది. కార్పెంటర్‌కు, ఆనందీబాయికి మధ్య అనేక విషయాలపై ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయి. వారు పరస్పరం సాగించిన ఉత్తర ప్రత్యుత్తరాలలో బాల్యవివాహం కారణంగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా ఒకటి కావటం విశేషం. " సెరంపోర్ కాలేజ్" హాలులో ఆనందీబాయి ఉపన్యసించిన సమయంలో తాను వైద్యవిద్యను అభ్యసించడానికి అమెరికా ఎందుకు వెళ్ళాలను కుంటుందో వెల్లడించారు. అనందీబాయి, ఆమె భర్త అనుభవించిన ఇబ్బందుల గురించి తన ఉపన్యాసంలో వివరించారు. భారత దేశంలో హిందూ మహిళా వైద్యురాళ్ల అవసరం గురించి, అలాగే ఆమె భారత దేశంలో మహిళా వైద్య కళాశాల ప్రారంభించడం తన లక్ష్యమని వివరించారు. అయితే తాను క్రైస్తవ మతాన్ని స్వీకరించనని మాత్రం నొక్కి వక్కాణించారు. ఆమె ఉపన్యాసం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. భారతదేశం నలుమూలల నుండి ఆర్థికసహాయం చేస్తామని సందేశాలు ఆమె అందుకున్నారు. ఆమె విద్యకు సహాయంగా అప్పటి భారత వైస్రాయి కూడా 200 రుపాయల ఆర్థికసాయం పంపారు. భర్తకు అమెరికాలో ఉద్యోగం లభించని కారణంగా అనందీబాయి మాత్రం ఒంటరిగా ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికా వెళ్లారు. ఆనందీబాయి కలకత్తా నుండి న్యూయార్క్ వరకూ నౌకలో ప్రయాణం చేసారు. ఈ ప్రయాణంలో ఆమెకు తోడుగా ఇద్దరు ఆంగ్ల మహిళలు ఉన్నారు. విపరీతమైన వ్యతిరేకతల నడుమ ఆమె 1883 జూన్ మాసంలో వైద్య విద్యాభ్యాసానికి అమెరికాలో అడుగు పెట్టారు. 1883 జూన్ లో న్యూయార్క్‌లో ఈమెను స్వాగతించ డానికి కార్పెంటర్ వచ్చింది. అమెరికాలో మిసెస్ కార్పెంటర్ అతిథిగా ఆమె ఇంటికి చేరుకున్నారు. న్యూయార్క్ లో 1983లో థియోడిసియా కార్పెంటర్ ఆనందీబాయి బస, పోషణ బాధ్యత వహించింది. ఆనందీ, కార్పెంటర్ అత్యంత ఆత్మీయులుగా మారారు. కార్పెంటర్ ఆనందీబాయిని కుమార్తెగా భావించి అభిమానించింది. ఆనందిని చూసి కార్పెంటర్ విస్మయం చెందగా, అమెరికా వైవిధ్యం అనందినీని విస్మయ పరిచాయి. పెన్సిల్వేనియా మహిళా వైద్యకాలేజీలో వైద్యవిద్యకై ఆమె దరఖాస్తు చేసుకున్నారు. మొట్ట మొదటి మెడికల్ క్యాంప్ నిర్వహించిన పెంసెల్వేనియా మెడీకల్ కాలేజ్ వారికి ఆమె తనూ పాల్గొనేందుకై ఒక లేఖ వ్రాసారు. అదే ప్రపంచ మొట్టమొదటి మహిళా మెడికల్ క్యాంప్. (ఇది ప్రపంచంలోనే ఈ తరహా మొదటి కార్యక్రమం). రేచెల్ బాడ్లీ, కాలేజీ డీన్, ఆమెకు ఈ విద్యా కోర్సుకై అర్హతను ఇచ్చారు. ఫిలడెల్ఫియా విశ్వ విద్యాలయంలో ఆమెను వదిలిన సందర్భంలో కార్పెంటర్ పసిపిల్లలా విలపించడం వారి మధ్య అనుబంధాన్ని తెలియ జేస్తుంది. కాలేజీ సెక్రెటరీ, సూపరింటెండెంట్ సుదూరం నుండి విద్యాభ్యాసానికి వచ్చిన ఆనందీ గోపాలును చూసి ప్రభావితమై ఆమెకు అక్కడ ఉన్న 3 సంవత్సరాలు 600 అమెరికన్ డాలర్లను ఉపకార వేతనం ఏర్పాటు చేసింది. 19వ యేట ఆమె తన వైద్య విద్యను ప్రారంభించారు. అయితే ఆమె అమెరికాలో ఎదుర్కొన్న ప్రధాన సమస్య శీతోష్ణస్థితి. అయినా ఆమెకు కాలేజి వారు ఏర్పాటు చేసిన గదిలో సరైన " ఫైర్ ప్లేస్ " లేనందున ఫైర్ ప్లేస్ నుండి అత్యధికంగా పొగరావడం వలన ఆమెకు చలి కాని లేక పొగ కాని భరించ వలసిన పరిస్థితి ఎదురైంది. రెండు సంవత్సరాల అమెరికా వాసం తరువాత ఆమెకు అపస్మారకం, తీవ్రజ్వరం అధికమైంది. అప్పుడు మొదలైన దగ్గు ఆమెను చివరి వరకు వదిలి పెట్టలేదు.ఆమె తీవ్ర ఆరోగ్య సమస్యలతో మూడు సంవత్సరాల ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి ఫైనల్ పరీక్షలు రాశారు. 1886 మార్చి 11 న ఆమె వైద్య విద్యలో డాక్టరేట్ సాధించింది. ఆమె పరిశోధనాంశం "ఆర్య హిందువులలో స్త్రీ జననాంగ – శిశు సంబంధిత వైద్యం". స్నాతకురాలయిన సందర్భంలో విక్టోరియా మహారాణి ఆమెకు శుభాకాంక్షలతో ఒక సందేశాన్ని పంపారు. ఆమె పట్టభద్రోత్సవంలో ఆమె భర్త కూడా పాల్గొన్నాడు. ఆ ఉత్సవంలో ఆమెను మొట్టమొదటి భారతీయ వైద్యురాలుగా పేర్కొనడం ఆమెకు మరపురాని అనుభూతిని కలుగజేదిందని ఆమె తన కథనాలలో పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం రోజుకు రోజుకు దిగ జారడంతో ఆమె భర్త ఆమెను ఫిలడెల్ఫియా స్త్రీల ఆసుపత్రిలో చేర్చారు. ఆమెకు క్షయ వ్యాధిగా నిర్ధారించ బడింది. అయినా వ్యాధి ఇంకా ఊపిరి తిత్తులను చేరలేదు. వైద్యులు ఆమెను భారత దేశానికి తిరిగి వెళ్ళమని సలహా ఇచ్చారు. అందుకు ఆమె అంగీకరించింది. కొల్హాపూరు సంస్థానంలో వైద్యురాలిగా పని చేయడానికి వచ్చిన అవకాశాన్ని స్వీకరించింది.భారత దేశానికి తిరుగు ప్రయాణం చేసే సమయంలో ఆనందీబాయి ఆరోగ్యం మరింత దిగజారింది. నౌకా ప్రయాణం చేసే సమయంలో ఆమెకు చికిత్స చేయడానికి వైద్యులు నిరాకరించారు. వైద్యులు చికిత్స చేయడానికి నిరాకరించడానికి కారణం ఆమె భారతీయురాలు కావడమే. 1886 చివరి భాగంలో, ఆనంది బాయి భారత దేశానికి తిరిగి వచ్చారు. దేశం ఆమెకు ఘనంగా స్వాగతం పలికింది. ఆమె కొల్హాపూర్ సంస్థానానికి వైద్యురాలిగా నియమించ బడింది. అల్బర్ట్ ఎడ్వర్డ్ వైద్య శాలలోని మహిళా వార్డుకు అధికారిణిగా బాధ్యతలను అప్పగించబడ్డాయి. కలకత్తా చేరిన తరువాత ఆనందీభాయి బలహీనత, నిరంతర తలనొప్పి, తరచూ జ్వరం, ఆయాసాలతో బాధ పడ్డారు. థియోడిసియా ఆమెకు అమెరికా నుండి ఔషధాలను పంపింది. తరువాత ఆమె ఆయుర్వేద చికిత్స కొరకు కజిన్ ఇంట్లో బసచేసింది. ఆయుర్వేద వైద్య నిపుణుడు ఆమె నౌకాయానం చేసి విదేశాలకు వెళ్ళి సంప్రదాయ సరిహద్దులు దాటినందుకు ఆమెకు చికిత్స చేయడానికి నిరాకరించాడు. భారత దేశానికి తిరిగి వచ్చిన ఒక్క సంవత్సరం లోపుగానే ఫిబ్రవరి 26, 1887 తేదీన 22 సంవత్సరాల చిరుత ప్రాయంలో ఆనందీభాయి వ్యాధి బాధతో తుదిశ్వాస విడిచారు.

ఆనందీబాయి మరణానికి దేశం అంతటా విషాదం ఆవరించింది. సాంప్రదాయ హిందూ అంత్యక్రియల కర్మల ప్రకారం దహన సంస్కారాలు జరిగాయి. ఆనందీబాయి చితాభస్మం థియోడిసియా కార్పెంటర్ కు పంప బడింది. కార్పెంటర్ వాటిని పూకిప్సీ, న్యూయార్క్ లోని తమ కుటుంబ శ్మశాన వాటికలో భద్ర పరిచారు. ఆమె సమాధి శిలా ఫలకాన్ని ఈ శ్మశాన వాటికలో ఇప్పటికీ చూడవచ్చు. అమెరికాలో ప్రసిద్ధ స్త్రీవాద రచయిత, సంస్కరణకర్త అయిన కారోలైన్ వెల్స్ హీలీ డాల్ 1888లోనే ఆనందీబాయి ఆత్మ కథను వ్రాసింది. దూరదర్శన్ ఆనందీబాయి జీవితమును ఆధారముగా చేసుకొని తీసిన ధారావాహిక "ఆనందీ గోపాల్"ను ప్రసారం చేసింది. ఈ ధారా వాహికకు కమలాకర్ సారంగ్ దర్శకత్వం వహించారు. శ్రీకృష్ణ జనార్ధన జోషి తన మరాఠీ నవల "ఆనందీ గోపాల్"లో ఆనందీబాయి జీవితం లోని కొన్ని ఘటనలను పొందు పరిచారు. ఈ నవల ఆషా దామ్లే ద్వారా ఆంగ్లంలోకి సంక్షిప్త రూపంలో అనువాదం చేయ బడింది. అదే పేరుతో రాంజీ జోగ్లేకర్ ఒక నాటకాన్ని కూడా రూపొందించారు. బహుళ మీడియా సంస్థలు ఆమె జీవిత కథను సినిమాలు మరియు సీరియల్స్ లోకి స్వీకరించాయి. ఆనందీ గోపాల్ అనే మరాఠీ బయోపిక్ కూడా విడుదలైంది.

# కార్మికులను కాలరాసే కొత్త కోడ్‌లు

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కార్మిక కోడ్లను అమల్లోకి తెస్తూ, 'ఇది స్వతంత్రం వచ్చిన తర్వాత కార్మికులకు అత్యంత మేలుచేసే కార్మిక అనుకూల సంస్కరణలు'గా ప్రచారం చేస్తున్నది. ఈ కోడ్లతో కార్మిక చట్టాలలో ఉన్న సంక్లిష్టతను తొలగిస్తూ, పెట్టుబడులను ఆకర్షించడానికి సామాజిక భద్రతను విస్తృతంగా అందించడానికని ఊదరగొడుతున్నది. సరళతరం పేరుతో తీసుకువచ్చిన ఈ కోడ్లు ఏళ్ల తరబడి దేశంలోని రెక్కాడితే డొక్కాడని కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మికుల చట్టాలతో పాటు హక్కులను కాలరాస్తున్నాయి. ఉద్యోగ భద్రతను గాలిలో దీపంలో నిలబెడుతున్నాయి. కార్మిక సంఘాలను బలహీనపరిచేలా, అసంఘటిత రంగ కార్మికులను పెంచేలాగా ఉపయోగ పడుతున్నాయి. ప్రమాదంలో ఉద్యోగ భద్రత కంపెనీలకు, పారిశ్రామిక అధిపతిలకు కార్మికుల తొలగింపులను ఇవి సులభతరం చేస్తున్నాయి. పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో ఇప్పటి వరకు లే ఆఫ్ ప్రకటించడానికి వందమంది కార్మికులు అంతకంటే ఎక్కువ ఉండే పరిశ్రమలకు ప్రభుత్వ అనుమతి అవసరం. కానీ, ఈ పరిమితిని మూడువందల మంది కార్మికులకు పెంచడం ద్వారా కోట్ల మంది కార్మికులకు సామాజిక రక్షణకు దూరమయ్యారు. అనేక రంగాలలో పరిమిత కాల నియామకాలను ఈ కోడ్లు అనుమతిస్తుంది.అనగా శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల నియామకాలను నిరుత్సాహపరిచి కార్మికుల ఉద్యోగ భద్రతను గాలికొదిలేశాయి. ఇది కార్మికులు బేరమాడే శక్తి నుండి నిర్వీర్యం చేస్తుంది. నిరంతరం ఉద్యోగ భద్రతపై భయంతో బానిసలాగా పనిచేయాల్సిన పరిస్థితులలోకి కార్మికులను నెట్టే ప్రమాదం ఉంది. నాణ్యమైన ఉద్యోగ నియామకాల స్థానంలో ఇటువంటి నిబంధనలు ఉద్యోగభద్రత లేని పొరుగుసేవల నియామకాలను మరింత వేగవంతం చేస్తుంది. సమ్మె హక్కు, సంఘాల ఏర్పాటుపై ఆంక్షలు కార్మికులు వారి న్యాయమైన కోర్కెల కోసం అనేక రకాల ప్రయత్నాల తర్వాత చివరి ఆయుధంగా సమ్మెను ప్రయోగించి వారి హక్కులను కాపాడుకునే ప్రయత్నం చేస్తారు. అటువంటి బలమైన ఆయుధం కార్మికుల చేతి నుండి దూరం చేయడమే లక్ష్యంగా ఈ చట్టాలు రూపొందించారు. సమ్మె నోటీసు ఇచ్చిన పద్నాలుగు రోజులకు తర్వాత మాత్రమే సమ్మెకు వెళ్లాలనే నిబంధన విధించారు. ఈ కాలంలో కార్మికుల డిమాండ్లపై కోర్టు కేసు ఉంటే సమ్మెకు వెళ్లడానికి నిరాకరిస్తుంది. ఈ పేరుతో యాజ మాన్యాలు కోర్టుల ద్వారా సమ్మెహక్కును నిర్వీర్యం చేస్తాయి. యాభైశాతం మంది పైగా కార్మికులు సెలవులోకి వెళ్లడాన్ని సమ్మెగా పున: నిర్వ చించడం ద్వారా కార్మికులను జాతీయస్థాయి సార్వత్రిక సమ్మె పాల్గొనడానికి, అదేవిధంగా సమ్మెకు మద్దతుగా ఇతర వర్గాల వారు పాల్గొనడాన్ని నిలుపుదల చేస్తుంది. దీనితో సమ్మెహక్కు అనే కార్మికుల బలమైన ఆయుధం యజమానుల చేతిలో కీలుబొమ్మగా మారి కార్మి కులు బేరమాడే శక్తిని నిర్వీర్యంచేసి కట్టు బానిసలుగా మార్చే ప్రమాదం ఉంది. గిగ్ కార్మికులను గుర్తింపు ఇవ్వడం ద్వారా రక్షణ పరిధిలోకి తీసుకురావడం చారిత్రాత్మక నిర్ణయంగా పాలకులు చేస్తున్న ప్రచారం బూటకంగా మారింది. వాస్తవానికి గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత పథకాలకు, పెన్షన్లకు, ఆరోగ్య పథకాలకు సంబంధించిన నిధులకు యజమాని నుండి ఎటువంటి చెల్లింపు లేకుండా చేస్తుంది. మహిళా కార్మికులకు రాత్రి సమయంలో పనిచేయడానికి లేబర్‌కోడ్స్ సహకరిస్తాయి. సరైన రక్షణ చర్యలను రవాణా సదుపాయాలని, గ్రీవెన్స్ యంత్రాంగాలను ఏర్పరచకుండా దీన్ని అమలు చేయడమంటే మహిళలను మరింత ప్రమాదంలో పెట్టడమే. కార్మికుల నిరసనలు, పారిశ్రామికవేత్తలు అనుకూల ప్రచారాలు, అంతర్జాతీయ పెట్టుబడి దారులు ఈ చట్టాలను అత్యంత అనుకూల సంస్కరణలుగా ఆకాశానికెత్తుతున్నాయి ఈ దేశ సంపద సృష్టికర్తలైన కోట్లకొలది కార్మికులు, వారి ప్రతినిధి సంఘాలు ఈ చట్టాలను కార్మిక వ్యతిరేక చట్టాలుగా రద్దు చేయాలని విధిగా పోరాటాలు చేస్తున్నాయి. అంటే, ఇవి ఎవరి ప్రయోజనం కోసమో స్పష్టమవుతుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల ఈజ్ ఆఫ్ లివింగ్‌ని బలిపెట్టడం ద్వారా ఈ పాలకులు సంపద సృష్టికర్తలైనా కోట్లాది మంది కార్మికుల వైపు కాకుండా పెట్టుబడిదారులవైపు ఒరిగిపోయారనేది స్పష్టం. 1920 నుండి దేశంలోని కార్మికులు ఐక్యంగా వారి హక్కుల కోసం పోరాటం చేసి అనేక విజయాలను సాధించారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ నడివీధిలో నిలబడి చట్టాలను రద్దు చేయించారు.

# బ్రాండ్ ఇమేజ్ Vs గ్రౌండ్ రియాలిటీ - జగన్ బాటలోనే బాబు.. నష్టం తప్పదా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు దేశ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేత. ఏపీకి నాలుగోసారి సీఎంగా పనిచేస్తున్న చంద్రబాబు.. తన 4.0 పాలనలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి విధానాలనే అనుసరిస్తున్నారా? అన్న చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న అనేక దుష్పరిణామాలను ఎప్పటికప్పుడు ఖండిస్తున్న సీఎం చంద్రబాబు మీడియాకు ప్రకటనలు జారీ చేసే విషయంలో మాత్రం జగన్ బాటలోనే నడుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ తన సొంత పత్రిక సాక్షితోపాటు జాతీయ మీడియాకు ఎక్కువ ప్రకటనలు ఇచ్చేవారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా చంద్రబాబు 4.0 పాలనలో టీడీపీ అనుకూల మీడియాతోపాటు జాతీయ పత్రికలకు సింహభాగం ప్రకటనలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. దీనివల్ల ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం లభించడం లేదని, పైగా ఎక్కువగా నష్టపోతోందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం జాతీయ మీడియాకు ప్రకటనలు ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఆశిస్తుందో కానీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న నష్టాన్ని పట్టించుకోవడంలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి ఆంగ్ల మీడియాలో ప్రచారం చేసుకుని క్షేత్రస్థాయి ప్రచారానికి దూరమయ్యారని అంటున్నారు. ప్రభుత్వం ఏం చేస్తున్నది అన్న విషయం ప్రజలకు తెలియాలంటే స్థానిక మీడియాలో ఎక్కువ ప్రచారం జరగాల్సివుంటుందని అంటున్నారు. కానీ, గత ప్రభుత్వంలో స్థానిక మీడియాకు బదులుగా జాతీయ మీడియాలో ప్రచారం చేయడానికి ప్రాధాన్యమిచ్చారని, దీనివల్ల జగన్ ప్రవేశపెట్టిన కొన్ని పథకాలకు జాతీయ స్థాయిలో ప్రచారం వచ్చినా, ఓటు వేసే ప్రజలకు అవగాహన లేకుండా పోయిందని అంటున్నారు. ఇప్పుడు కూడా చంద్రబాబు ప్రభుత్వంలో అదే పద్ధతి కొనసాగుతోందని అంటున్నారు. జాతీయ పత్రికల్లో ప్రకటనలు ఇస్తూ తమ ఇమేజ్ పెంచుకుంటున్నారే తప్ప, ప్రజలలో ప్రభుత్వం రీచ్ పెరుగుతుందా? లేదా? అన్న విషయాలను పట్టించుకోవడం లేదన్న చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో 90 శాతం మంది ప్రజలు స్థానిక తెలుగు మీడియానే ఫాలో అవుతుంటారు. ప్రభుత్వ పథకాల ప్రచారం చేయాలన్నా, రాజకీయ ప్రయోజనం పొందాలన్నా ప్రభుత్వాలు తెలుగు మీడియా ద్వారా గరిష్టంగా లబ్ది పొందే అవకాశాలు



ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. కానీ, ప్రభుత్వాధినేతలుగా చంద్రబాబు, జగన్ వంటి నేతలు మాత్రం ఈ విషయాన్ని విస్మరిస్తున్నారని అంటున్నారు. జాతీయ స్థాయిలో ప్రచారం కోసం పరితపిస్తూ స్థానికంగా తమ ప్రభుత్వ విజయాలను చెప్పుకోలేకపోతున్నారని అంటున్నారు. స్థానిక మీడియాను సమర్థంగా వాడుకోలేకపోవడం వల్ల ప్రభుత్వాలు నష్టపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహనరెడ్డికి ఇది అనుభవ పూర్వకంగా తెలిసిందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలకు అర్థమయ్యే భాషలోను అందుబాటులో ఉన్న వ్యవస్థ ద్వారా సమాచారం చేరవేయకపోతే ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. ఇది ఎన్నికల సమయంలో ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీయొచ్చని అంటున్నారు. గతంలో జగన్మోహనరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో స్థానిక మీడియాలో వచ్చే అంశాలను పట్టించుకోకుండా, ఓ ఆంగ్ల పత్రిక నెలనెలా ఇచ్చే సర్వే రిపోర్టులు నమ్మి దెబ్బతిన్నారని గుర్తు చేస్తున్నారు. ఈ అనుభవం నుంచి పాఠం నేర్చుకోవాల్సిన ప్రస్తుత ప్రభుత్వం అలా చేయడం లేదని అంటున్నారు. తమ బ్రాండ్ ఇమేజ్ కోసం జాతీయ మీడియా వెనుక పడటం వల్ల ప్రజలకు దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. తల్లికి వందనం, పింఛన్లు, అన్నదాతా సుఖీభవ వంటి పథకాలకు రీచ్ రావాలంటే స్థానిక మీడియాలో ప్రచారం ఎక్కువగా జరగాలని, కానీ ప్రజలకు అర్థం కాని జాతీయ మీడియాలో ప్రకటనలు ఇవ్వడం వల్ల జరిగే ప్రయోజనం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం పట్టించుకోని కారణంగానే జగన్మోహనరెడ్డి దెబ్బతిన్నారని, కానీ అనుభవం ఉన్న నేతగా చంద్రబాబు కూడా అదే తప్పు చేయడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కావాల్సింది మేధావుల ప్రశంసలు కాదని, ఆంధ్రా పల్లెల్లో సామాన్యుల నమ్మకం అంటున్నారు. ఇమేజ్ మేనేజ్‌మెంట్ కంటే ఇన్ఫర్మేషన్ డిసెమినేషన్ చాలా ముఖ్యమని గుర్తించాలని చెబుతున్నారు. గత పాలకుల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకపోతే, చరిత్ర పునరావృతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ఇద్దరు యూట్యూబర్స్ మధ్య ప్రేమ.. కట్ చేస్తే.. కోమలి ఆత్మహత్య!

**హైదరాబాద్ పెన్ పవర్:** యూట్యూబ్ ప్రపంచంలో నవ్వుతూ కనిపించే ముఖాల వెనుక ఇన్ని కష్టాలు ఉంటాయని ఎవరూ ఊహించలేదు. ప్రేమ పేరుతో జరిగిన గొడవలు చివరకు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. విశాఖపట్నానికి చెందిన వర్ధమాన యూట్యూబర్ కోమలి (21), హైదరాబాద్‌లో చదువుకుంటూనే తనకంటూ గుర్తింపు తెచ్చుకోవాలనుకుంది. కానీ, తోటి యూట్యూబర్ నిఖిల్ రెడ్డితో ఏర్పడిన ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన ఇప్పుడు చిత్రపురి కాలనీలో కలకలం రేపుతోంది.



**ప్రేమతో మొదలై.. పెళ్లి గొడవతో ముగిసిన కథ:**

ఇక కోమలి, నిఖిల్ రెడ్డి ఇద్దరూ విశాఖపట్నానికి చెందినవారే. యూట్యూబ్ రంగంలో ఉన్న పరిచయం కాస్తా వీరి మధ్య ప్రేమకు దారితీసింది. హైదరాబాద్‌లో బీఎస్సీ చదువుతున్న కోమలి, మణికొండలోని చిత్రపురి కాలనీలో బంధువుల ఇంట్లో ఉంటూ తన కలలను నిజం చేసుకోవాలనుకుంది. ఇక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మరియు యూట్యూబర్ అయిన నిఖిల్ రెడ్డిని ఆమె ప్రాణంగా ప్రేమించింది. అయితే, గత కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్థలు రావడం, నిఖిల్ ఆమెకు దూరంగా ఉండటానికి ప్రయత్నించడం కోమలిని తీవ్రంగా కలచివేసింది. పెళ్లి విషయంపై వీరిద్దరి మధ్య జరిగిన గొడవ ఈ ఘోర నిర్ణయానికి కారణమైందని తెలుస్తోంది.

**ఆరు నెలల క్రితమే హెచ్చరిక.. కానీ అగని విషాదం:**

నిజానికి కోమలి ఆత్మహత్యాయత్నం చేయడం ఇది మొదటిసారి కాదట. నిఖిల్ తనను దూరం పెడుతున్నాడనే బాధతో ఆరు నెలల క్రితమే ఆమె తనువు చాలించాలని చూసిందట. అప్పట్లో బంధువులు, స్నేహితులు ఆమెకు సర్దిచెప్పి అడ్డుకున్నట్లు సమాచారం. కానీ, మనసులో గూడుకట్టుకున్న బాధ మాత్రం అలాగే ఉండిపోయింది. ఇక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కోమలి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఆమె తల్లి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషాదకరమైన వార్త బయటకు వచ్చింది. ఒక చిరునవ్వుల యూట్యూబర్ ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం అందరినీ కలిచివేస్తోంది.

**డిజిటల్ ప్రపంచంలో ఒంటరితనం:**

ఈ ఘటన సోషల్ మీడియా మరియు డిజిటల్ ప్రపంచంలో పెరిగిపోతున్న మానసిక ఒత్తిడిని మరోసారి గుర్తు చేస్తోంది. తెరపై ఎంతో సరదాగా కనిపించే యువత, వ్యక్తిగత జీవితంలో చిన్న చిన్న సమస్యలను కూడా తట్టుకోలేక ప్రాణాలు వదులుతున్నారు. ప్రేమలో గొడవలు సహజమే అయినా, ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదనే విషయాన్ని మర్చిపోతున్నారు. రాయదుర్గం పోలీసులు ఈ కేసును నమోదు చేసుకుని, నిఖిల్ రెడ్డి పాత్రపై విచారణ జరుపుతున్నారు. కేవలం 21 ఏళ్ల వయసులో, ఎంతో భవిష్యత్తు ఉన్న కోమలి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఆమె కుటుంబ సభ్యులకు తీరని లోటును మిగిల్చింది.

# పులివెందులలో జగన్.. ఆ విమర్శలకు చెక్!

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో పర్యటిస్తున్నారు. మంగళవారం పులివెందులకు వెళ్లిన జగన్ బుధవారం నియోజకవర్గ పరిధిలోని వేంపల్లె మండలం నందిపల్లె గ్రామంలో నందీశ్వర ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ నేతల చొరవతో రూ.6 కోట్ల విరాళాలతో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. వైసీపీ అధినేత జగన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి నందీశ్వరుడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయించారు. సొంత నియోజకవర్గంలో నందీశ్వర ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ సీఎం జగన్ తనపై కూటమి ప్రభుత్వం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేశారని అంటున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని వాడారంటూ గత కొన్ని నెలలుగా వైసీపీని టార్గెట్ చేస్తూ కూటమి నేతలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మాజీ సీఎం జగన్ కు హిందూ మతం అంటే గౌరవం లేదని, హిందూ మత విశ్వాసాలపై నమ్మకం లేదని కూటమి నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఈ తరహా ఆరోపణలు, విమర్శలతో మాజీ సీఎం జగన్ ను ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అంటున్నారు. అయితే తనపై కూటమి నేతలు చేస్తున్న విమర్శలపై జగన్ నేరుగా స్పందించకపోయినా, సొంత నియోజకవర్గం పులివెందులలో శివాలయం ప్రతిష్టకు హాజరుకావడం, స్వయంగా పూజలు, హోమాలు చేయడం ద్వారా తనకు హిందూ దేవుళ్లపై నమ్మకం ఉందని చాటుకున్నారని అంటున్నారు. సంప్రదాయ వస్త్రాలను ధరించి నందీశ్వరుని నూతన విగ్రహా ప్రతిష్ట, కుంభాభిషేక



మహోత్సవంలో జగన్ పూజలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా తనకు హిందూ మత ఆచార, వ్యవహారాలు అంటే గౌరవం ఉందని చాటుకునే ప్రయత్నం చేశారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం సందర్భంగా ఎలాంటి రాజకీయ ప్రకటనలు చేయకపోవడం గమనార్హం అంటున్నారు. వైసీపీ కార్యకర్తలు సైతం పూర్తి భక్తి ప్రవర్తులతో నడుచుకోవడాన్ని ప్రత్యేకంగా చెబుతున్నారు. సాధారణంగా జగన్ ఎక్కడకు వెళ్లినా, జై జగన్, సీఎం.. సీఎం.. అంటూ ఆయన అభిమానులు నినాదాలతో హోరెత్తిస్తుంటారు. అయితే సొంత నియోజకవర్గం పరిధిలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో రాజకీయ నినాదాలు చేయకుండా శ్రేణులను వైసీపీ నేతలు కట్టడి చేయడం కూడా ఆకట్టుకుందని అంటున్నారు. మొత్తానికి శివుడి ద్వారా తనపై కూటమి నేతలు చేస్తున్న విమర్శలను జగన్ తిప్పికొట్టే ప్రయత్నం చేశారని వ్యాఖ్యానిస్తున్నారు.

# అమెరికాలో భారతీయుడి దారుణ హత్య: పొరపాటున కిడ్నాప్ చేసి చంపేశారు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ప్రవాస భారతీయుల భద్రతపై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. కాలిఫోర్నియాలోని ట్రేసీ నగరంలో నివసిస్తున్న భారతీయ మూలాలున్న అవ్తార్ సింగ్ (57) అనే వ్యక్తిని దుండగులు కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేశారు. అయితే ఈ హత్యలో ఒక విస్తుపోయే నిజం వెలుగుచూసింది. దుండగుల అసలు లక్ష్యం అవ్తార్ సింగ్ కాదని 'పొరపాటున' ఆయనను ఎత్తుకెళ్లి ప్రాణాలు తీసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

**గురుద్వారా బయటే అపహరణ**

స్థానిక సిక్కు సమాజంలో ఎంతో గౌరవనీయుడైన అవ్తార్ సింగ్ గత 20 ఏళ్లుగా ట్రేసీలోని గురుద్వారాలో ప్రధాన వంటకుడిగా సేవలందిస్తున్నారు. ఫిబ్రవరి 17న మధ్యాహ్నం సమయంలో ఆయన గురుద్వారా వెలుపల ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆయనను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని అపహరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

**మూడు రోజుల తర్వాత మృతదేహం లభ్యం**

కిడ్నాప్ జరిగిన మూడు రోజుల తర్వాత ట్రేసీకి సుమారు రెండు గంటల దూరంలో ఉన్న లేక్ బెరియెస్సా సమీపంలో అవ్తార్ సింగ్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ఇది యాదృచ్ఛికంగా జరిగిన దాడి కాదని, ఒక పథకం ప్రకారం జరిగిన కిడ్నాప్ అని పోలీసులు నిర్ధారించారు. కానీ, దుండగులు వేరొకరి కోసం వచ్చి పొరపాటున అవ్తార్ సింగ్‌ను తీసుకెళ్లినట్లు సాన్ జోక్విన్ కౌంటీ షెరిఫ్ కార్యాలయం అనుమానిస్తోంది.

**ఆరు నెలల ముగ్గురు పసికందులు..**

అవ్తార్ సింగ్ మృతితో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆయనకు భార్యతో పాటు ఆరు నెలల వయసున్న ముగ్గురు కవల పిల్లలు ఉన్నారు. అనారోగ్య కారణాలతో ఆ పసికందులు ఇటీవలే ఆసుపత్రి నుంచి డిస్చార్జ్ అయ్యి ఇంటికి చేరుకున్నారు. తండ్రి నీడలో పెరగాల్సిన ఆ చిన్నారి ప్రాణాలు దుండగుల చిన్న 'పొరపాటు' వల్ల అనాథలయ్యాయని స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**దర్యాప్తు ముమ్మరం**

ఈ కేసును హత్యగా నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు. పోస్ట్‌మార్టం నివేదిక రావాల్సి ఉందని మరణానికి గల ఖచ్చితమైన కారణాన్ని ఇంకా వెల్లడించలేమని అధికారులు తెలిపారు.

ఈ ఘటన కాలిఫోర్నియాలోని భారతీయ, సిక్కు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. నిందితులను తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని ప్రవాస భారతీయులు డిమాండ్ చేస్తున్నారు.

# వచ్చే వేసవి మామూలుగా ఉండదు.. హైరిస్క్ జోన్ లో ఏపీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** రానున్న వేసవి కాలంలో ఎండలు మండిపోతాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా వడగాల్పులు ప్రజలకు నరకం చూపే అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. దేశంలో పది రాష్ట్రాల్లో వేడి తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఈ పది జిల్లాల్లో ఏపీ 8వ స్థానంలో ఉండటం భయపెడుతోందని చెబుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువ జిల్లాలు తీవ్ర ఎండ ప్రభావిత జాబితాలో ఉన్నట్లు సమాచారం. దీనిప్రభావంతో జనజీవనం తీవ్ర అవస్థలు ఎదుర్కొనే అవకాశం ఉందని అంటున్నారు. వేడి తీవ్రత వల్ల వడదెబ్బ బాధితుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందంటున్నారు. రాష్ట్రంలో ఎక్కువ మంది వ్యవసాయం, ఆరు బయట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎండల తీవ్రత వల్ల వీరు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. దేశంలో 23 రాష్ట్రాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఈ రాష్ట్రాల్లో నివసిస్తున్న వంద కోట్ల మంది ఆరోగ్యంపై వడగాలులు ప్రభావం చూపుతున్నాయని అంటున్నారు. గత 40 ఏళ్లలో వేసవిలో ఎండ తీవ్రత పెరుగుతూ వస్తోందని వాతావరణ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. దీంతో దేశంలో గత పదేళ్లలో నాలుగు సార్లు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెబుతున్నారు. 2013, 2016, 2019, 2024ల్లో రికార్డు స్థాయిల్లో వడగాల్పులు వీచినట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రధానంగా వాతావరణ మార్పులకు ఎల్ నినో, లానినా కారణం అవుతుంటాయి. ఈ ఏడాది లానినా ఏర్పడే అవకాశం ఉందన్న అంచనాలు మరింత భయపడుతున్నాయని అంటున్నారు. ఇదే సమయంలో అర్బన్ హీట్ ఐలాండ్ కారణంగానూ వేడి ఎక్కువవుతోందని చెబుతున్నారు. పది లక్షలకు పైగా జనాభా ఉన్న జిల్లాల్లో వెచ్చటి రాత్రులు పెరుగుదల ఉందని శాస్త్రవేత్తలు, వాతావరణ నిపుణులు వివరిస్తున్నారు. దీనివల్ల పగటిపూట ఎండ తీవ్రతతో అల్లాడిపోయే ప్రజలకు రాత్రి సమయంలోనూ ఉపశమనం లభించడం లేదని అంటున్నారు. ఇక గత ఏడాది దేశంలో 734 జిల్లాలకు సంబంధించిన హీట్ ఇండెక్స్ చూస్తే మన రాష్ట్రం హై రిస్క్ జోన్ లో ఉందని అంటున్నారు. ఈ లెక్కల ప్రకారం 10 జిల్లాలలో వేడి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించగా, అందులో ఏపీ 8వ స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. రాష్ట్రంలో ఎక్కువ జిల్లాలు తీవ్రమైన వేడి ప్రభావానికి గురికానున్నట్లు అంచనా వేస్తున్నారు. కౌన్సిల్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్మెంట్, వాటర్ (సీఈఈడబ్ల్యూ) విడుదల చేసిన హీట్ హైరిస్క్ ఇండెక్స్ ప్రకారం ఏపీలోని ఉమ్మడి శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలు అత్యంత ప్రమాదకరమైన జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా విజయనగరం, విశాఖపట్నం, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలు ప్రమాదకర కేటగిరిలో ఉన్నాయని చెబుతున్నారు. అదే సమయంలో క్లైమేట్ హజార్డ్స్ అండ్ వల్నరబులిటీ అట్లాస్ ఆఫ్ ఇండియా ప్రకారం 1969–2019 మధ్య రాష్ట్రంలో వెయ్యి రోజులు వడగాలులు వీచాయని చెబుతున్నారు. ఈ విషయంలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## అమెరికాలో విషాదం..
## కిడ్నాపైన భారత సంతతి వ్యక్తి హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో మరో విషాదం చోటుచేసుకుంది. కాలిఫోర్నియాలో కిడ్నాప్‌కు గురైన భారత సంతతి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. 57 ఏళ్ల అవతార్ సింగ్ మృతదేహాన్ని బెర్రీస్సా సరస్సు సమీపంలో అధికారులు కనుగొన్నారు. గత వారం ట్రేసీ నగరంలోని ఓ గురుద్వారా వెలుపల ఆయన్ను అపహరించుకుపోయిన నాలుగు రోజుల తర్వాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే? ఈ నెల 17న ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు అవతార్ సింగ్‌ను బలవంతంగా ఓ తెల్లని కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. ఆయన ప్రతిఘటించినా దుండగులు అపహరించుకుపోయారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా కిడ్నాప్ దృశ్యాలు రికార్డయ్యాయి."కిడ్నాప్ అయిన అవతార్ సింగ్ మరణించినట్లు ధ్రువీకరిస్తున్నాం. ఈ దారుణానికి పాల్పడిన వారిని గుర్తించేందుకు మా డిటెక్టివ్‌లు దర్యాప్తు చేస్తున్నారు" అని శాన్ జోక్విన్ షెరిఫ్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ఈ దాడి యాదృచ్ఛికంగా జరగలేదని, దుండగుల అసలు లక్ష్యం అవతార్ సింగ్ కాకపోవచ్చని పోలీసులు భావిస్తున్నారు. "వారు ఒక ప్రత్యేకమైన కారణంతో వేరొక వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్నారు. ఆ కారణం త్వరలోనే వెలుగులోకి వస్తుందని ఆశిస్తున్నాం" అని షెరిఫ్ పాట్రిక్ విత్‌రో స్థానిక మీడియాకు తెలిపారు.

## ఉక్రెయిన్‌కు స్లొవేకియా షాక్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉక్రెయిన్ విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా రష్యా భీకర దాడులు చేస్తున్న క్రమంలో.. కీవ్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఉక్రెయిన్‌కు అత్యవసర విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్టు స్లొవేకియా ప్రకటిం చింది. రష్యా నుంచి స్లొవేకియాకు సరఫరా అయ్యే చమురును కీవ్ ఆపడమే రెండు దేశాల మధ్య వివాదానికి దారితీసినట్టు తెలుస్తోంది. ఉక్రెయిన్‌లోని భూభాగం మీదుగా వెళ్లే డ్రుజ్బా పైప్‌లైన్ ద్వారా మధ్య ఐరోపా ప్రాంతానికి రష్యా ముడి చమురు సరఫరా అవుతోంది. అయితే, జనవరి 27 నుంచి స్లొవేకియా, హంగరీకి చమురు సరఫరా నిలిచిపోయింది. రష్యా జరిపిన భీకర డ్రోన్ దాడుల్లో డ్రుజ్బా పైప్‌లైన్ దెబ్బతిందని ఉక్రెయిన్ అధికారులు పేర్కొన్నారు. కానీ, కీవ్ ఉద్దేశపూర్వకంగానే చమురు సప్లరును నిలిపివేసిందని స్లొవేకియా ఆరోపించింది. పైప్‌లైన్ బాగానే ఉందని, దాన్ని పరిశీలించేందుకు తమ రాయబారికి ఉక్రెయిన్ అనుమతినివ్వడం లేదని పేర్కొంది. దీనిపై చర్చించేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలన్‌స్కీ నిరాకరిస్తు న్నారని తెలిపింది. అందుకే ఆ దేశంపై ప్రతీకార చర్యలు చేపట్టామని స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో వెల్లడించారు. ఉక్రెయిన్‌కు అత్యవసర విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. రష్యా చమురు సరఫరాను కీవ్ పునరుద్ధరించే వరకు ఈ చర్యలు కొనసాగుతాయన్నారు.చమురు సరఫరా తిరిగి ప్రారంభం కాకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఫికో బెదిరించారు.

## అమెరికాలో మంచు తుపాన్ బీభత్సం

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలోని ఈశాన్య ప్రాంతాలపై భారీ మంచు తుపాన్ కురుస్తోంది. మేరీల్యాండ్ నుంచి మెయిన్ వరకు విస్తరించిన ఈ మంచు తుపాను ధాటికి జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. వాతావరణ శాస్త్రవేత్తలు దీనిని 'బాంబ్ సైక్లోన్'గా అభివర్ణిస్తున్నారు.విమానయాన రంగంపై ఈ తుపాను ప్రభావం తీవ్రంగా పడింది. దేశవ్యాప్తంగా సోమవారం నాటికి 5,600 విమాన సర్వీసులు రద్దు కాగా, మంగళవారం మరో 2,000 సర్వీసులను నిలిపివేశారు. ముఖ్యంగా న్యూయార్క్, న్యూజెర్సీ, బోస్టన్ విమానాశ్రయాల్లో కార్యకలాపాలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. రోడ్ ఐలాండ్‌లోని టిఎఫ్ గ్రీన్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏకంగా 38 అంగుళాల మంచుతో నిండిపోయింది. అటు రైలు, బస్సు సర్వీసులు కూడా పాక్షికంగా నిలిపివేయగా, స్టాటన్ ఐలాండ్‌లో రైలు రాకపోకలను అధికారులు పూర్తిగా రద్దు చేశారు. కేప్ కాడ్ తీరంలో గంటకు 133 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు హరికేన్‌ను తలపించాయి. ఈ పెనుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ మంచు తుపాను బీభత్సం నుంచి సాధారణ స్థితికి వచ్చేందుకు మరికొంత సమయం పట్టేలా కనిపిస్తోంది.

## లండన్‌లో 16 ఏళ్ల నాటి
## భారత రెస్టారెంట్ రంగ్రేజ్ మూసివేత

**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్ రాజధాని లండన్‌లో 16 ఏళ్లుగా భారతీయ రుచులను అందిస్తున్న ప్రముఖ 'రంగ్రేజ్' రెస్టారెంట్ శాశ్వతంగా మూతపడనుంది. పెరిగిన నిర్వహణ ఖర్చులు, నిరంతర వేధింపులు, దాడులతో పాటు స్థానిక పోలీసుల నుంచి సరైన మద్దతు లేకపోవడమే ఇందుకు కారణమని యజమాని హర్మన్ సింగ్ కపూర్ ప్రకటించారు. వచ్చే నెలలో రెస్టారెంట్‌ను మూసివేయనున్నట్లు ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.గత కొంతకాలంగా హర్మన్ సింగ్ ఖలిస్థాన్ వేర్పాటువాదానికి వ్యతిరేకంగా తన గళం వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పాకిస్థానీల నుంచి తనకు, తన కుటుంబానికి ఆన్‌లైన్‌లో వేధింపులు, దాడులు పెరిగిపోయాయని ఆయన ఆరోపించారు.16 ఏళ్ల మరపురాని ప్రయాణం తర్వాత, వచ్చే నెలలో రంగ్రేజ్ రెస్టారెంట్‌ను మూసివేయాలని బాధతో నిర్ణయం తీసుకున్నాను. పెరిగిన ఖర్చులు, పాకిస్థానీల నుంచి దాడులు, పోలీసుల నుంచి సరైన మద్దతు లేకపోవడం వల్ల వ్యాపారాన్ని కొనసాగించడం అసాధ్యంగా మారింది అని హర్మన్ సింగ్ తన పోస్టులో పేర్కొన్నారు.రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ఇకపై పూర్తిస్థాయిలో ఉద్యమకారుడిగా మారతానని స్పష్టం చేశారు. వేర్పాటువాదులు ఒకటి గుర్తుంచుకోవాలి. మీరు నా వ్యాపారాన్ని దెబ్బతీయగలరు కానీ, నా సంకల్పాన్ని కాదు. ఇకపై ఎలాంటి ఆటంకాలు లేకుండా వారిపై మరింత బలంగా పోరాడతాను అని ఆయన హెచ్చరించారు. గతంలో 2023లో కూడా ఖలిస్థాన్ మద్దతుదారుల నుంచి తనకు బెదిరింపులు వచ్చాయని, రెస్టారెంట్‌పై దాడి జరిగిందని హర్మన్ సింగ్ ఆరోపించారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై
## కొనసాగుతోన్న దారుణాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా మైనార్టీలు ముఖ్యంగా హిందువులకు రక్షణ కరవయ్యింది. హిందువులపై దాడులు, అఘాయిత్యాలు అకృత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తాజాగా, మరో ఘోరం వెలుగుచూసింది. ఓ హిందూ మహిళను ముగ్గురు దుండగులు అపహరించి, సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. ఈ దారుణ ఘటన బరిషాల్ జిల్లాలోని చందాపుర్ తాలూకాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దివ్యాంగురాలైన ఆమె రాత్రి 9 గంటల సమయంలో ఓ చోట భజనకు వెళ్లి తిరిగొస్తుండగా.. ముగ్గురు నిందితులు బలవంతంగా ఎత్తుకెళ్లారు. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం రోడ్డుపక్కన స్పృహకోల్పోయి ఉన్న ఆమెను గుర్తించిన స్థానికులు.. చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. తనను రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు అపహరించి, సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు వెల్లడించింది. తనను చిత్రహింసలకు గురిచేసి గాయపరిచినట్లు ఆమె తెలిపింది. అయితే, ఇప్పటి వరకు ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను అరెస్టు చేయాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందూ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ప్రస్తుతం బాధితురాలు భోలా సదర్ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. ఆమెకు తీవ్ర గాయాలైనట్టు వైద్యులు తెలిపారు. బాధితురాలిని చందాపూర్ తాలూకా షయేస్థాకండి గ్రామానికి చెందిన వివాహితగా గుర్తించారు. వరుస ఘటనలతో స్థానిక హిందువులు ఆందోళనకు గురవుతున్నారు. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత నుంచి బంగ్లాదేశ్‌లో మైనార్టీలే లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి.

# ట్రేడ్ డీల్‌పై వెనక్కి తగ్గితే టారీఫ్‌లను భారీగా పెంచుతా..



**హైదరాబాద్ పెన్ పవర్:** తాను విధించిన సుంకాలను రద్దుచేస్తూ అమెరికా సుప్రీంకోర్టు గతవారం ఇచ్చిన తీర్పును అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగతాళి చేశారు. ఇదో 'హాస్యాస్పదమైన' 'మూర్ఖపు' తీర్పు అంటూ ట్రంప్ విమర్శలు చేశారు. అధ్యక్షుడు తన అధికార పరిధిని దాటారని చెప్పిన తీర్పు వాస్తవానికి తన అధికారాలను పెంచుకునేలా చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్ పెట్టారు. "విదేశాలకు ముఖ్యంగా దశాబ్దాలుగా మనల్ని నాశనం చేస్తున్న దేశాలపై 'భయంకరమైన' పన్నులు వసూలుకు లైసెన్స్‌లను ఉపయోగిస్తాం " అని పేర్కొన్నారు. అంతేకాదు, వాణిజ్య ఒప్పందంపై వెనక్కి తగ్గే దేశాలు మరింత మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన బెదిరింపులకు దిగారు. తమతో ఒప్పందం కొనసాగించాల్సిందేనని, లేకుంటా సుంకాలను మరింత ఎక్కువ విధించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కీలక దశలో ఉన్న విషయం తెలిసిందే. ఈ ఒప్పందంపై మార్చిలో సంతకాలు చేయాల్సి ఉండగా.. సుప్రీంకోర్టు టారీఫ్‌లను రద్దు చేయడంతో ఫిబ్రవరి 23న ఇరు దేశాల ప్రతినిధుల మధ్య జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. అయితే,సుప్రీంకోర్టు తీర్పు తనకు అసాధారణ అధికారాలు ఎలా ఇచ్చిందనేది మాత్రం ఆయన స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. పూర్తిగా గౌరవం లేకపోవడంతో చిన్న అక్షరాలను (సుప్రీం కోర్టును సూచించడానికి) ఉపయోగిస్తానని' ట్రంప్ ప్రకటించారు. "అమెరికా సుప్రీంకోర్టు హాస్యాస్పదమైన, మూర్ఖత్వమైన, అంతర్జాతీయంగా విభేదాలకు దారి తీసిన తీర్పు ద్వారా నాకు మునుపెన్నడూ లేనంత ఎక్కువ అధికారాలు, శక్తిని ఇచ్చింది" అని ఆయన వ్యాఖ్యానించారు.

# ఎప్‌స్టీన్ కేసులో బ్రిటన్ మాజీ రాయబారి పీటర్ మాండెల్సన్ పేరు



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన అమెరికా లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్ కుంభకోణం ఇప్పుడు బ్రిటన్ ప్రభుత్వ పునాదులను కదిలిస్తోంది. బ్రిటన్ రాజకీయాల్లో ప్రముఖ నాయకుడు, అమెరికాలో ఆ దేశ మాజీ రాయబారి పీటర్ మాండెల్సన్ (72)ను లండన్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో ఉంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. సుమారు తొమ్మిది గంటల విచారించగా.. గంటల్లోనే ఆయనకు బెయిల్ రావడంతో విడుదల చేశారు. ఇటీవల విడుదలైన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని కీలక పత్రాలు మాండెల్సన్‌ను ఇరకాటంలో పడేశాయి. 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమయంలో.. మాండెల్సన్ ప్రభుత్వ మంత్రిగా ఉన్నప్పుడు కొన్ని అత్యంత సున్నితమైన, రహస్య పత్రాలను జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు పంపినట్లువిచారణలో తేలింది.

ఈ ఆరోపణల నేపథ్యంలోనే పోలీసులు ఆయన నివాసాలపై దాడులు నిర్వహించి.. కీలక ఆధారాలు సేకరించారు. మాండెల్సన్ అరెస్ట్ బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. మాండెల్సన్‌కు ఎప్‌స్టీన్‌తో ఉన్న అనుబంధం గురించి తెలిసినప్పటికీ.. ఆయన్ను వాషింగ్టన్ రాయబారిగా నియమించారన్న ఆరోపణలు స్టార్మర్‌పై వస్తున్నాయి. ఈ వివాదం కారణంగా స్టార్మర్‌కు అత్యంత సన్నిహితులైన ఇద్దరు ఉన్నతాధికారులు ఇప్పటికే రాజీనామా చేశారు. ఈక్రమంలోనే ఎప్‌స్టీన్ బాధితులకు ప్రధాని స్టార్మర్ క్షమాపణలు చెప్పారు. మాండెల్సన్ తన నేపథ్యం గురించి అబద్ధాలు చెప్పి పదవి పొందారని ఆరోపించారు. మాండెల్సన్ స్థాపించిన 'గ్లోబల్ కౌన్సిల్' సంస్థ కూడా దివాలా తీసే స్థితికి చేరుకుంది. టెస్కో, బార్క్లేస్ వంటి దిగ్గజ సంస్థలు ఈయనతో సంబంధాలను తెంచుకున్నాయి.

# తమిళనాడు రాజకీయాల్లోకి శశికళ
## జయలలిత జయంతి సందర్భంగా జెండా ఆవిష్కరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే బహిష్కృత నేత, దివంగత ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ తన రాజకీయ పునరాగమనాన్ని ప్రకటిస్తూ కొత్త పార్టీని స్థాపిస్తున్నట్లు వెల్లడించారు. జయలలిత జయంతిని పురస్కరించుకుని రామనాథపురం జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో, ఇంకా పేరు పెట్టని తన పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. శశికళ మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా మౌనంగా ఉన్నానని, ఇకపై ప్రేక్షకపాత్ర వహించలేనని స్పష్టం చేశారు.ప్రజల కోసం, పార్టీ కార్యకర్తల కోసం కొత్త పార్టీని ప్రారంభిస్తున్నాం. ద్రోహులు, శత్రువులను కూకటివేళ్లతో పెకిలించడమే మా లక్ష్యం అని ఆమె ప్రకటించారు. తమ పార్టీ అన్నాదురై, ఎంజీఆర్ జయలలిత చూపిన ద్రావిడ మార్గంలో నడుస్తుందని, పేదలు, అణగారిన వర్గాలు,

సామాన్య ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపారు. జయలలిత మరణాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. పార్టీ జెండాలో నలుపు, తెలుపు, ఎరుపు రంగులతో పాటు అన్నాదురై ఎంజీఆర్, జయలలిత చిత్రాలు ఉన్నాయి. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిస్వామిపై శశికళ పరోక్షంగా తీవ్ర విమర్శలు చేశారు.నేనే అతడిని సీఎం చేశాను. కానీ నన్ను ఓ కాగితంలా విసిరిపారేశారు. అలాంటి వ్యక్తి ఎలాంటివాడో ఊహించుకోండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి జెండాను మాత్రమే పరిచయం చేస్తున్నానని త్వరలోనే పార్టీ పేరును అధికారికంగా ప్రకటిస్తానని శశికళ స్పష్టం చేశారు. కాగా, అక్రమాస్తుల కేసులో శిక్ష పడటంతో శశికళ 2027 వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హురాలన్న విషయం తెలిసిందే.

# కేరళ సీఎం పినరయి విజయన్‌ను
## ఇంటర్వ్యూ చేసిన సూపర్ స్టార్ మోహన్‌లాల్

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరువనంతపురం: సాధారణంగా సినీ ప్రముఖులను జర్నలిస్టులు, రాజకీయ నేతలు ఇంటర్వ్యూ చేస్తుంటారు. కానీ, కేరళలో దీనికి భిన్నమైన దృశ్యం ఆవిష్కృతమైంది. మలయాళ సూపర్ స్టార్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మోహన్‌లాల్ ఏకంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఇంటర్వ్యూ చేశారు. ఇప్పటివరకు అనేక ఇంటర్వ్యూలలో ప్రశ్నలను ఎదుర్కొన్న మోహన్‌లాల్, ఈసారి ప్రశ్నలు అడిగే పాత్రను పోషించడం ఆసక్తి కలిగిస్తోంది.సీఎం అధికారిక నివాసమైన క్లిఫ్ హౌజ్‌లో ఈ ప్రత్యేక ముఖాముఖి జరిగింది. ఈ ప్రాజెక్ట్ కోసం మోహన్‌లాల్ రెండు రోజులు తిరువనంతపురంలో గడిపినట్లు సమాచారం. ఒక రోజు చర్చలు జరిపి, మరుసటి రోజు ఇంటర్వ్యూను చిత్రీకరించారు. ఇందులో ముఖ్యమంత్రి వ్యక్తిగత జీవితం, రాజకీయ ప్రస్థానం, ప్రభుత్వ



పాలన వంటి అంశాలపై మోహన్‌లాల్ ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఈ ఇంటర్వ్యూ టీజర్‌ను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. పూర్తి ఇంటర్వ్యూ త్వరలో ప్రముఖ ఛానెళ్లలో ప్రసారం కానుంది.ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఇంటర్వ్యూ జరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది ప్రభుత్వ పబ్లిక్ రిలేషన్స్ ప్రయత్నాల్లో భాగమేనని విపక్షాలు ఇప్పటికే ఆరోపణలు గుప్పిస్తున్నాయి. అయితే, మోహన్‌లాల్ ఒక ముఖ్యమంత్రిని ఇంటర్వ్యూ చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో మాజీ సీఎం ఊమెన్ చాందీని కూడా ఆయన ఇలాగే ఇంటర్వ్యూ చేశారు.ఇప్పటికే క్లిఫ్ హౌజ్‌లో మోహన్‌లాల్, పినరయి విజయన్ కలిసి ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ముఖాముఖి రాజకీయాలను ప్రభావితం చేస్తుందో లేదో కానీ, ఒక సూపర్ స్టార్ ప్రశ్నలు అడుగుతుంటే కేరళ మొత్తం ఆసక్తిగా చూస్తుందనడంలో సందేహం లేదు.

# ఏసీ ప్రియులకు బ్యాడ్ న్యూస్ 15% వరకు పెరగనున్న ధరలు!



ఈ ఏడాది వేసవి కాలం రాకముందే ఎండలు మండిపోతున్నాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం గతంతో పోలిస్తే.. భారీగా ఎండల తీవ్రత ఉండనుంది. ఈ క్రమంలో ఎండ వేడి నుంచి రక్షించుకునేందుకు సామాన్య మధ్యతరగతి కుటుంబాలు ఏసీ (ఎంఅ)లు కొనుక్కొవాలనే ప్రణాళికల్లో ఉన్నారు. అలాంటి వారికి తాజా పరిణామాలు షాక్ ఇస్తున్నాయి. ఏసీల తయారీలో ఉపయోగించే ముడి సరుకుల ధరలు భారీగా పెరగడం, రూపాయి విలువ పడిపోవడంతో ఏసీల ధరలను 5 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఎండీ ముకుందన్ మేనన్ చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఏసీల తయారీలో అత్యంత కీలకమైన రాగి ధర అంతర్జాతీయ మార్కెట్లో టన్నుకు 13 వేల డాలర్లకు చేరడం ఉత్పత్తి వ్యయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. దీనికి తోడు కొత్త ఎనర్జీ సేవింగ్ నిబంధనల వల్ల ఏసీల తయారీలో అదనపు మెటీరియల్ వాడాల్సి వస్తోందని, దీంతో ఒక యూనిట్ ధర గణనీయంగా పెరుగుతుందని వోల్టాస్ ఎండీ ముకుందన్ మేనన్ స్పష్టం చేశారు. ధరలు పెరిగినప్పటికీ, ఈ ఏడాది ఏసీల అమ్మకాలు మాత్రం 15 నుంచి 20 శాతం మేర పెరుగుతాయని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా మొదటిసారి ఏసీ కొనేవారి సంఖ్య పెరగడం, తీవ్రమైన ఎండల ప్రభావం వల్ల డిమాండ్ అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో 18 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్న వోల్టాస్, పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేలా తన ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా పెంచుకుంటోంది. రాబోయే రెండేళ్లలో విడిభాగాల దిగుమతులను తగ్గించి, భారత్‌లోనే 90 శాతం మేర తయారీ చేపట్టాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

# అన్‌లిస్టెడ్ కంపెనీల జాబితాలో రిలయన్స్ రిటైల్ అగ్రస్థానం




దేశీయ స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాకుండా ఉన్న కంపెనీల్లో రిలయన్స్ రిటైల్ సంస్థ భారీ ఆదాయంతో అగ్రస్థానం సొంతం చేసుకుంది. మంగళవారం జేఎమ్ ఫైనాన్షియల్, హురున్ ఇండియా విడుదల చేసిన అన్‌లిస్టెడ్ జెమ్స్-2026 జాబితాలో రిలయన్స్ రిటైల్ రూ. 2.7 లక్షల కోట్ల భారీ ఆదాయంతో దేశంలోనే అతిపెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీగా అగ్రస్థానంలో నిలిచింది. దీని తర్వాత రూ. 83,105 కోట్ల ఆదాయంతో ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ రెండో స్థానం దక్కించుకుంది. ఈ జాబితాలో దేశంలోని 100 పెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీలు ఉన్నాయి, ఇవి ఒక్కొక్కటి కనీసం రూ. 1,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. జేఎమ్ ఫైనాన్షియల్, హురున్ ఇండియా నివేదిక ప్రకారం, రూ. 66,000 కోట్లతో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మూడో స్థానంలో ఉంది. ఈ వంద కంపెనీలు సంయుక్తంగా 2025లో రూ. 8.9 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. ఈ కంపెనీలన్నిటి విలువ రూ. 28.5 లక్షల కోట్లు. ఇవి దాదాపు 12 లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. దేశంలో అన్‌లిస్టెడ్ కంపెనీలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, దేశ ఆర్థికవ్యవస్థలో బలమైన విభాగంగా మారాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయని, వీటిలో చాలావరకు భవిష్యత్తులో ఐపీఓలుగా వస్తాయని నివేదిక తెలిపింది. ఈ జాబితాలో కొన్ని కంపెనీలు చాలా వేగంగా అభివృద్ధి చెందాయి. టాటా ఎలక్ట్రానిక్స్ 3,173 శాతంతో రికార్డు స్థాయి వృద్ధి రేటును నమోదు చేయగా, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ 904 శాతం, జేఎస్‌డబ్ల్యూ వన్ ప్లాట్‌ఫామ్‌లు 522 శాతం వృద్ధి చూశాయి. ఈ వృద్ధి ఎలక్ట్రానిక్స్ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, డిజిటల్ బీ2బీ ప్లాట్‌ఫామ్ వంటి రంగాలలో పెరుగుతున్న డిమాండ్‌ను చూపిస్తుందని నివేదిక పేర్కొంది.

## టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ మూడవ టర్మ్‌పై నిర్ణయాన్ని వాయిదా వేసిన బోర్డు



టాటా సన్స్ ఛైర్మన్‌గా నటరాజన్ చంద్రశేఖరన్‌ను మూడవసారి ఛైర్మన్‌గా కొనసాగించే నిర్ణయాన్ని టాటా సన్స్ బోర్డు మంగళవారం వాయిదా వేసింది. ఈ నిర్ణయంతో టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీలో నెలకొన్న విభేదాలను సూచిస్తుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రెండో టర్మ్ పదవీకాలం 2027, ఫిబ్రవరిలో ముగియనుంది. ఆయన పదవీకాలాన్ని పొడిగించడంపై బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని జాతీయ మీడియా తెలిపింది. అయితే, మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ అంశం గురించి చంద్రశేఖరన్ స్వయంగా వాయిదా వేయాలని కోరినట్టు తెలుస్తోంది. బోర్డు సమావేశంలో సభ్యులు ఆయన కొనసాగాలని మద్దతివ్వగా, టాటా ట్రస్ట్ ఛైర్మన్‌గా ఉన్న నోయల్ టాటా అభ్యంతరాలు తెలిపారు. కొత్త వ్యాపారాల విషయంలో చర్చించాల్సిన విషయాలు ఉన్నాయని, దీనికితోడు చంద్రశేఖరన్ పునర్నియామకంపై ఆయన సందేహాలు వ్యక్తం చేసినట్టు జాతీయ మీడియా నివేదికలు వెల్లడించాయి. ముఖ్యంగా టాటా సన్స్ లిస్టింగ్‌కి వెళ్లకపోవడం, రిస్క్ ఉన్న పెట్టుబడులకు సంస్థ దూరంగా ఉండటం, అప్పులు, ఎయిర్‌ఇండియా అప్పులను తగ్గించడం వంటి అంశాలను నోయల్ టాటా లేవనెత్తినట్టు సమాచారం. దీంతో కొందరు సభ్యులు ఓటింగ్ ప్రతిపాదన చేయగా, చంద్రశేఖరన్ ప్రస్తుతానికి ఈ అంశాన్ని వాయిదా వేయాలని కోరారు.

# కీర్తి సురేష్, ఆంటోని తట్టిల్ 'హౌస్ ఆఫ్ ఫన్'లో..




నగరం నడిబొడ్డున పచ్చని ప్రకృతి ఒడిలో వ్యక్తిగత జ్ఞాపకాలు, వినూత్న కళాఖండాల కలయికతో నటి కీర్తి సురేష్ తన ఇంటిని ఒక అద్భుత ప్రపంచంగా తీర్చిదిద్దుకున్నారు. పదిహేనేళ్ళ ప్రేమ ప్రయాణానికి ప్రతీకగా నిలిచే ఈ 'హౌస్ ఆఫ్ ఫన్' విశేషాలు 'ఏషియన్ పెయింట్స్ - వేర్ ద హార్ట్ ఈజ్' సీజన్ 9, రెండో ఎపిసోడ్‌లో ఆమె మనతో పంచుకున్నారు. ఈ ఇంటికి వారు 'హౌస్ ఆఫ్ ఫన్' అని పేరు పెట్టుకున్నారు. అపార్ట్‌మెంట్ పై అంతస్తులో ఉన్న ఈ నివాసం నుంచి చుట్టూ ఉన్న ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ధారాళంగా వచ్చే సూర్యరశ్మి, ప్రశాంతమైన వాతావరణం ఈ ఇంటి ప్రత్యేకత. 'కలిసి ఒక ఇల్లు నిర్మించుకోవడం అనేది ఒక అద్భుతమైన అనుభూతి. మాకు అన్నింటికంటే ముఖ్యమైనది సౌకర్యం' అని కీర్తి ఈ సందర్భంగా పేర్కొన్నారు. గోడపై నిలువుగా ఉన్న రెండు కాన్వాస్ పెయింటింగ్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. అందులో ఒకటి వారు ప్రేమించుకోవడం మొదలుపెట్టిన రోజు నాటి చంద్రుడి ఆకారం కాగా మరొకటి సరిగ్గా 15 ఏళ్ల తర్వాత వారి వివాహం జరిగిన రోజు నాటిది. తన పెళ్లి జ్ఞాపకాలను పంచుకునే క్రమంలో కీర్తి సహజంగానే మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో మాట్లాడుతూ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ఈ ఇల్లు కేవలం ఒక కట్టడంలా కాకుండా వారి 15 ఏళ్ల ప్రయాణానికి నిలువుటద్దంలా కనిపిస్తోంది. ఈ ఇంటి రూపకల్పనలో రంగులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ప్రకాశవంతమైన డెకర్, ఫర్నిచర్, ఛాయాచిత్రాలు, పచ్చని రంగులు ఆ ప్రదేశానికి జీవం పోస్తుంటే నలుపు-తెలుపు ఫ్లోర్ టైల్స్ ఇంటికి సమతుల్యతను, ప్రశాంతతను అందిస్తాయి. కీర్తి సురేష్ జాతీయ అవార్డు గెలుచుకున్న సమయంలో 'మహానటి' సినిమా గురించి వచ్చిన వార్తాపత్రిక క్లిప్పింగ్‌లతో తయారు చేసిన ఒక ఫ్రేమ్డ్ ఆర్ట్‌వర్క్ ఇక్కడ ఉంది. ఇది ఆమె నటనా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఈ దంపతుల బెడ్‌రూమ్ సంప్రదాయ, ఆధునిక అభిరుచుల కలయికగా ఉంటుంది. కేరళ శైలి మంచం, ఒక సంప్రదాయ అనుభూతిని ఇస్తుంది. ఏషియన్ పెయింట్స్ నిలయ ఆర్క్ అందించిన లైట్ గ్రే టెక్చర్డ్ వాల్ గదిలో మృదువైన, వెచ్చని వాతావరణాన్ని సృష్టిస్తుంది. అతిథుల కోసం కేటాయించిన గదిలో ఏషియన్ పెయింట్స్ 'మూన్ లైట్' షేడ్ ఉపయోగించారు. కీర్తికి ఈ రంగు అంటే చాలా ఇష్టం, ఎందుకంటే ఇది డెకర్‌కు ప్రశాంతమైన పునాదిని ఇస్తుంది. వీరికి అతిథులకు ఆతిథ్యం ఇవ్వడం అంటే చాలా ఇష్టం. అందుకే తమ ఇల్లు ఎప్పుడూ సందడిగా, అందరికీ సాదర స్వాగతం పలికేలా ఉండాలని కోరుకుంటారు. జ్ఞాపకాలు, అర్థవంతమైన విశేషాలతో నిండిన తన ఇంటిని డిజైన్ చేసుకున్న అనుభవం గురించి కీర్తి మాట్లాడుతూ మాలాంటి యువ జంటలు ఇల్లు నిర్మించుకోవాలని అనుకుంటే, ప్రతి విషయంలోనూ వ్యక్తిగత ముద్ర ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంట్లోని ప్రతి వస్తువు మీ గురించి, మీ ఇద్దరి ప్రయాణం గురించి చెప్పేలా ఉండాలని సూచించారు. చిన్న చిన్న విషయాల్లో కూడా శ్రద్ధ వహించడం వల్లే ఒక కట్టడం నిజమైన 'ఇల్లు'గా మారుతుందని పేర్కొన్నారు. రంగురంగుల డిజైన్లు, కళాఖండాలు, స్ఫూర్తినిచ్చే వాక్యాలు, మెరిలిన్ మన్రో మురల్ (గోడ చిత్రం), పచ్చని అందాలతో ఈ అపార్ట్‌మెంట్ వారి వ్యక్తిత్వానికి ప్రతిబింబంలా కనిపిస్తుంది. వీడియోలోనే కాకుండా వీరి ఇంటి విశేషాలను మరింత లోతుగా తెలుసుకోవడానికి 'ఏషియన్ పెయింట్స్ వేర్ ద హార్ట్ ఈజ్ లుక్‌బుక్' అందుబాటులో ఉంది. కీర్తి ఆంటోనీల 'కొచ్చి హోమ్' విశేషాలను ఈ క్రింది లింక్స్ ద్వారా చూడవచ్చు..

# మహీంద్రా యూనివర్సిటీ 50కు పైగా విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల ఐరో, ఈథర్ 2026 ఉత్సవం



మహీంద్రా యూనివర్సిటీ తన వార్షిక క్రీడా, టెక్నో-సాంస్కృతిక ఉత్సవాలైన ఐరో, ఈథర్ తాజా సంచికలను విజయవంతంగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా 50కు పైగా కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్న ఈ వారాంత వేడుకలు క్రీడాకారులు, కళాకారులు, సృజనశీలులను ఒకే వేదికపైకి తీసుకువచ్చాయి. సమగ్ర విద్యా విధానం నాయకత్వాభివృద్ధిపై విశ్వవిద్యాలయం కట్టుబాటును ఈ వేడుకలు మరింత బలపరిచాయి. ఐరో 2026 సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రాంగణం ఉత్సాహభరిత క్రీడా వేదికగా మారింది. 20కు పైగా క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించబడ్డాయి. ఖో-ఖో, పవర్‌లిఫ్టింగ్, పూల్ మరియు స్నూకర్, ఈత (ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్), టేబుల్ టెన్నిస్, టెన్నిస్, త్రోబాల్, వాలీబాల్, యోగా వంటి విభాగాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ క్రీడా ఉత్సవంలో బిట్స్ పిలాని, ఐ ఐ టి మద్రాస్, ఐ ఐ టి హైదరాబాద్, వోక్సెన్ యూనివర్సిటీ, నల్సార్ లా యూనివర్సిటీ, అనురాగ్ యూనివర్సిటీ, సింబయోసిస్ హైదరాబాద్, ఓ.పి. జిందాల్ యూనివర్సిటీ తదితర విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేదురి మాట్లాడుతూ, "మహీంద్రా యూనివర్సిటీ ఆత్మ అకాడెమిక్ కఠినతను సృజనాత్మకత, నాయకత్వం, బాధ్యతతో సమన్వయం చేయడంలో ఉంది. ఐరో ఈథర్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు. ఇవి యువతలో బాధ్యతాభావాన్ని పెంపొందించి, భారీ స్థాయి ఈవెంట్లను నిర్వహించే సామర్థ్యాన్ని, నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి. టోర్నమెంట్ల నిర్వహణ, సాంస్కృతిక అనుభవాల రూపకల్పన, దేశవ్యాప్తంగా సహ విద్యార్థులతో పరస్పర చర్యల ద్వారా వారు నాయకత్వం, నిర్ణయాత్మకత, జట్టు భావనను ఆచరణలో నేర్చుకుంటారు. ఈ అనుభవాలు వారికి వృత్తి, సామాజిక రంగాల్లో విశ్వాసంతో ముందుకు సాగేందుకు దోహదపడతాయని యాజులు మేదురి అన్నారు. క్రీడా ఉత్సాహానికి తోడుగా ఈథర్ 2026 సాంస్కృతిక వేదికగా ఆకట్టుకుంది. విద్యార్థులు మరియు విశ్వవిద్యాలయ నాయకత్వం సంయుక్తంగా రూపకల్పన చేసిన ఈ వేడుకలో సాహిత్య పోటీలు, వాదోపవాదాలు, క్విజ్‌లు, సినిమా మరాథాన్‌లు, ఇంటరాక్టివ్ అడ్వెంచర్ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. సంగీతం, నృత్యం, దృశ్యకళలు, సినిమా, గేమింగ్ వంటి విభిన్న వ్యక్తీకరణ రూపాలు ఈ ఏడాది ప్రత్యేకతగా నిలిచాయి. న్యూస్‌పేపర్ అప్-సైక్లింగ్, లోగో లోకో, నియాన్ రైడ్, గ్రాఫిటీ ల్యాబ్స్, ఫ్రేమ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫైనల్స్, ఫ్రేమ్ అండ్ ఫేమ్, ట్రెజర్ హంట్, కామిక్ స్కిట్స్, స్టాండ్-అప్ కామెడీ వంటి పోటీలు నిర్వహించబడ్డాయి. ఉస్మానియా యూనివర్సిటీ, లయోలా అకాడమీ, నిఫ్ట్ హైదరాబాద్, బిట్స్ గోవ, సీబీఐటీ తదితర విద్యాసంస్థల విద్యార్థులు ఈథర్ 2026లో పాల్గొన్నారు. "వన్స్ అపాన్ ఎ టైమ్", "స్మాష్ ది స్టిగ్మా" వంటి కార్యక్రమాలు సంభాషణ సృజనాత్మకతకు వేదికగా నిలిచాయి. బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్ అండ్ వాయిసెస్, బ్యాటిల్ ఆఫ్ బీట్స్ (సోలో, డ్యూయెట్, గ్రూప్ విభాగాల్లో), క్రౌన్ అండ్ కల్చర్ వంటి పోటీలు ఉత్సాహభరిత స్పందనను సాధించాయి.

# ధర్మపురి యముడు.. అకాల మృత్యుహారుడు...

"భూషణ వికాస శ్రీధర్మ పుర నివాస, దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరుడు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగువారుండరంటే అతిశయోక్తి లేదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టుకొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచార కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది... జగిత్యాల జిల్లాలోని గోదావరీ తీరస్థ సుప్రసిద్ధ తీర్థమైన ప్రాచీన ధర్మపురి పుణ్యక్షేత్రం. తెలుగు నేలపై సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరిహర క్షేత్రంగా, పౌరాణిక ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నదీ క్షేత్ర రాజం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడినది. ఈక్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమ ధర్మరాజు మందిరం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావని లోనే అరుదుగా, అపురూపంగా ధర్మపురి క్షేత్రంలో వెలసిన "యమ ధర్మరాజును దర్శిస్తే యమపురి ఉండబోదని" ప్రతీతి. హిరణ్యకశిపుని సంహారానంతరం, ఉగ్ర నారసింహుని శాంతింప జేసేందుకై బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థమూ, పవిత్ర క్షేత్రమూ అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానాది సత్కర్మల నొనరించినట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమ ధర్మరాజు, తన లోకమునందు అనేక నరక బాధలను అనుభవించు చున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తను ఇట్లు విచారించెనని, పుణ్యాత్ములను దర్శించినచో పుణ్యము, పాపాత్ములను చూసినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుటచే తనకు పాప సంచయమే కలుగుచున్నదని, తన యందు స్వయంకృత పాప మనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనముతో మనశ్శాంతి కలుగడం లేదని తలంచి, మనశ్శాంతిని పొందుటకు పుణ్య క్షేత్ర దర్శన ప్రయాణ ఉన్ముఖుడై, సమస్త క్షేత్రముల తిరిగి చివరకు ధర్మపురికి ఏతెంచెనని, ఈ క్షేత్రమున గోదావరి నదీ స్నానమాచరించగనే యమునకు మనశ్శాంతి కలుగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెనని, బ్రహ్మాండ, స్కాంద పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు, నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమ ధర్మ రాజు నృసింహుని మందిరాని కేగి చేసిన పూజలకు ప్రసన్నుడైన నారసింహుడు, యమ ధర్మరాజును తన సన్నిధిలో నివసించుమని తెలిపెనని, యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమకుండ"మని పేరు కలుగునట్లు, అచట స్నానమాచరించి నృసింహుని పూజించు వారికి యమలోక బాధలు కలుగ కుండునట్లు, సర్వపాప విముక్తి కలుగునట్లు నరసింహుడు వరమిచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును శ్రీనరసింహ మందిర పురోభాగమున నిలిపినట్లు పురాణాలు విశదీకరిస్తున్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన ఉంది యమ ధర్మరాజు మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. 'దక్షిణాభి ముఖీగంగా, యత్ర దేవో నృకే సరీ, తత్రశ్రీర్విజయోర్భూతి:, కాశ్య యశ్శత గుణం భవేత్" అని దక్షిణాభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి యున్నది. వేరెచ్చటనూ కానరాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తున్నది. అష్ట దిక్పాలకులలో ఒకరైన యముడు దక్షిణ దిశాధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా కుజుడు దక్షిణ దిశాధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడని పరాశరుడు "బృహత్ పరాశర హోరా శాస్త్రం" నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహిని.యైన గౌతమి యందు దక్షిణాభి ముఖులై, స్నానాలు ఆచరించి, నరసింహుని దర్శిస్తే నరక బాధలుండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యతను సంతరించికున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజునును దర్శించే భక్తుల సంఖ్య నానాటికీ అధికమవుతున్నది. ఇటీవల సంభ విస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్యసూక్త" ప్రత్యేక పూజాదులలో అంతర్భాగంగా అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్త పఠనాలు, జ్వరహర స్తోత్రం, రోగ నివారణ సూక్తాలు,యమాష్టకాది పూజలలో పాల్గొనేందుకై సుదూర ప్రాంతాల నుండి భక్తులు క్షేత్రానికి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య నానాటికీ అధికమవుతున్నది. ఫిబ్రవరి 27నుండి మార్చి 11వ తేదీ వరకు 13రోజులపాటు నిర్వహించనున్న శ్రీ లక్ష్మీ నరసింహ శ్రీ వేంకటేశ్వర స్వామి వారల వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా యమ ధర్మరాజు దర్శనం, అపమృత్యు నివారణకు యమ గండా దీపంలో నూనె సమర్పించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.

# రోజంతా గోరువెచ్చని నీరు తాగితే ఏమవుతుంది..?

మన శరీరంలో 70 శాతం నీరే ఉంటుంది. అయితే ఆధునిక జీవనశైలిలో మనం రకరకాల డ్రింక్స్‌కు అలవాటు పడి, ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన నీటిని ఎలా తాగాలో మర్చిపోతున్నాం. ముఖ్యంగా ఉదయాన్నే నిద్రలేవగానే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి ప్రయోజనాలు ఉన్నాయా..?ఇది అందరికీ మంచిదేనా? నీరు శరీర దాహాన్ని తీర్చడమే కాకుండా రక్తంలో కలిసిపోయి ప్రతి కణానికి ఆక్సిజన్‌ను సరఫరా చేసే జీవనాధారం. మానవ శరీరం 70 శాతం నీటితోనే నిర్మితమై ఉంటుంది. అయితే ఏ రకమైన నీరు ఎప్పుడు తాగాలి అనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. మన పూర్వీకుల నుండి వస్తున్న ఉదయం గోరువెచ్చని నీరు తాగే అలవాటు కేవలం సంప్రదాయం మాత్రమే కాదు అదొక అద్భుతమైన ఆరోగ్య ప్రక్రియ అని ఆయుర్వేదం చెబుతోంది.ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణ అగ్ని యాక్టివేట్ అవుతుంది. ఇది శరీరంలోని కఫ దోషాన్ని సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.జీర్ణక్రియ మెరుగు: తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం సమస్యను వదిలించడానికి ఇది చక్కటి పరిష్కారం.టాక్సిన్స్ తొలగింపు: శరీరం లోపల పేరుకుపోయిన హానికరమైన విష పదార్థాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.బరువు తగ్గడం: క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరిగి, కొవ్వు కరగడానికి సహాయపడుతుంది.శ్వాసకోశ సమస్యలకు చెక్: గొంతులో పేరుకుపోయిన కఫాన్ని వదులు చేసి, దగ్గు, జలుబు నుండి ఉపశమనాన్ని ఇస్తుంది.ఉదయం ఖాళీ కడుపుతో: బాడీని రీఛార్జ్ చేయడానికి, జీర్ణక్రియను వేగవంతం చేయడానికి ఇది బెస్ట్



టైమ్.భోజనానికి 30 నిమిషాల ముందు: ఇది ఆకలిని నియంత్రించి, బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది.భోజనం చేసిన గంట తర్వాత: తిన్న ఆహారం మెత్తగా మారి, పోషకాలు ఒంటికి పట్టడానికి ఇది సహాయపడుతుంది.గోరువెచ్చని నీరు ఆరోగ్యానికి మంచిదే అయినా, ఈ కింది సందర్భాల్లో తాగడం ప్రమాదకరమని ఆయుర్వేదం హెచ్చరిస్తోంది..తీవ్రమైన వేసవిలో: ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు వేడి నీరు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి అసౌకర్యం కలుగుతుంది.పిత్త సమస్యలు ఉన్నప్పుడు: కడుపులో మంట లేదా అసిడిటీతో బాధపడేవారు వేడి నీటికి దూరంగా ఉండాలి. అధిక దాహం: విపరీతమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు తాగితే శరీరంలోని తేమ మరింత తగ్గే అవకాశం ఉంది.

# రోగాలను నయం చేసే శక్తి దీనికి ఉంది!



అతిబల మొక్క, భారతీయ సంప్రదాయ వైద్యంలో శతాబ్దాలుగా ఉపయోగించబడుతోంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో జ్వరం, దగ్గు, కీళ్లనొప్పులు, కిడ్నీలో రాళ్లు, మూత్రనాళ వ్యాధులు, నడుము నొప్పి వంటి 100కు పైగా రోగాలను నయం చేయగలదని ఆయుర్వేదం చెబుతుంది. మన చుట్టూ ఉండే ఎన్నో మొక్కలు అలివికాని మొండి రోగాలను సైతం నయం చేయగలవని చాలామందికి తెలియదు. అలాంటి అద్భుత ఔషధ గుణాలు కలిగిన మొక్కల్లో అతిబల ఒకటి. దీనిని దువ్వెన బెండ, ముద్ర బెండ, తుత్తురు బెండ అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మాల్వేసి కుటుంబానికి చెందినది. రోడ్ల పక్కన, పొలాల కంచెల వెంట విస్తారంగా కనిపించే ఈ మొక్కలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలు చాలామందికి తెలియదు. అతిబల మొక్క యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ధర్మాలను కలిగి ఉంటుంది. భారతీయ సంప్రదాయ వైద్యంలో, ముఖ్యంగా తమిళ సిద్ధ వైద్యంలో, భారతీయ ఆయుర్వేదంలో దీనిలోని ప్రతి భాగాన్ని వివిధ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. ఈ మొక్క జ్వరం, దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రనాళ వ్యాధులు, కిడ్నీలో రాళ్లు కరిగించడానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కీళ్లనొప్పి లేదా కీళ్లవాతం ఉన్నప్పుడు అతిబల ఆకుల పేస్ట్‌కు ఆవాల నూనె కలిపి రాయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. రక్త మొలలు ఉన్నవారు ఆకులను ఉడికించి తింటే తగ్గుతాయని చెబుతారు. ఆడవారిలో యోని ఇన్ఫెక్షన్లు ఉంటే, దీని ఆకుల డికాక్షన్‌తో శుభ్రం చేసుకోవచ్చు. చర్మంపై వాపులు, గాయాలు, పుండ్లు ఉన్నప్పుడు అతిబల ఆకులను పసుపుతో కలిపి పేస్ట్‌గా చేసి రాయడం వల్ల త్వరగా నయం అవుతాయి, ఎందుకంటే ఆకులకు యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. మూత్రంలో మంట, మూత్రాశయంలో రాళ్లు ఉన్నవారు అతిబల ఆకులను నీటిలో మరిగించి తేనె కలిపి త్రాగడం వల్ల రాళు కరిగి, మంట తగ్గుతుంది. అతిసారం ఉన్నవారికి దీని విత్తనాల పొడితో చేసిన టీ ఔషధంలా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుపరచడానికి అతిబల ఆకుల డికాక్షన్‌తో కళ్ళు కడుక్కుంటే మంచిది. ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ, శ్వాసనాళ వాపులకు దీని మొత్తం మొక్క భాగాన్ని (పూలు, కాండం, ఆకులు, కాయలు, వేర్లు) ఉపయోగించి కషాయం కాచి తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. జ్వరం తగ్గడానికి అతిబల ఆకులను నానబెట్టి, ఆ నీటికి పటికబెల్లం కలిపి త్రాగుతారు. దంతాల ఆరోగ్యం కోసం దీని ఆకుల రసాన్ని నోటిలో ఉంచుకొని ఊసేయడం, డికాక్షన్‌తో పుక్కిలించడం వల్ల దంతాలు గట్టిపడి పంటినొప్పి తగ్గుతుంది. నడుము నొప్పి తగ్గడానికి అతిబల ఆకుల కషాయం త్రాగాలి. గౌట్, క్షయ, నోటిపూత, పేగుపూత, రక్తస్రావాలకు కూడా దీని డికాక్షన్ ఉపయోగిస్తారు. శరీరానికి బలం రావాలంటే, అతిబల మొక్క వేరును ఆవుపాలతో మరిగించి పటికబెల్లం కలిపి తీసుకోవాలని ఆయుర్వేద గ్రంథాలు సూచిస్తున్నాయి. మూత్రంలో రక్తం పడటం, మూత్రనాళంలో మంట తగ్గడానికి దీని ఆకుల రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటారు. అతిబల ఆకుల రసాన్ని చక్కెరతో కలిపి త్రాగితే గుండె ఆరోగ్యానికి మంచిది. మగవారిలో శీఘ్రస్కలనం సమస్యకు, యూరినరీ ఇన్ఫెక్షన్లకు దీని వేరు కషాయం ఔషధంగా పనిచేస్తుంది. అతిబల మొక్క రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించి షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. ఈ మొక్క ఆకులు రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

# కళ్ల కింద డార్క్ సర్కిల్స్, వెనుక అసలు రహస్యం ఇదే!




చాలామంది కళ్ల కింద నల్లటి వలయాలు రాగానే ఖరీదైన క్రీములు వాడుతూ ఉంటారు. కనురెప్పలు అదురుతూ ఉంటే ఏదో కీడు జరుగుతుందని భయపడతారు. కానీ ఇవన్నీ మీ శరీరంలో ఒక ముఖ్యమైన పోషకాహారం తగ్గిందని చెప్పే హెచ్చరికలు కావొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖం పాలిపోవడం, దవడ కండరాలు బిగుసుకుపోవడం వంటి చిన్న చిన్న మార్పుల వెనుక పెద్ద ఆరోగ్య సమస్యే ఉండవచ్చు. సాధారణంగా అలసట, ఒత్తిడి లేదా ఎక్కువ కాఫీ తాగడం వల్ల కళ్లు అదురుతుంటాయి. కానీ ఇది తరచుగా జరుగుతుంటే మెగ్నీషియం లోపం కారణం కావచ్చు. మెగ్నీషియం నరాలు మరియు కండరాల మధ్య సంబంధాన్ని స్థిరంగా ఉంచుతుంది. ఇది తగ్గినప్పుడు కళ్ల చుట్టూ ఉండే చిన్న చిన్న కండరాలు స్పేమ్స్ కు గురవుతాయి.ఎంత నిద్రపోయినా కళ్ల కింద నలుపు తగ్గడం లేదంటే అది కేవలం కాస్మెటిక్ సమస్య కాదు. మెగ్నీషియం లోపం వల్ల నిద్ర సరిగ్గా పట్టదు, దీనివల్ల కళ్ల కింద చర్మం పల్చబడి రక్తనాళాలు బయటకు కనిపిస్తాయి. ఫలితంగా డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి. కేవలం క్రీములు రాస్తే ఇది తగ్గదు, ఆహారంలో మార్పులు చేసుకోవాల్సిందే.

ఉదయాన్నే నిద్రలేవగానే ముఖం, కళ్లు ఉబ్బినట్లు అనిపిస్తున్నాయా? అయితే శరీరంలో ఫ్లూయిడ్ బ్యాలెన్స్ తప్పిందని అర్థం. మెగ్నీషియం వాపును తగ్గిస్తుంది. ఇది లోపించినప్పుడు ముఖం ఉబ్బుగా, చర్మం పొడిగా మరియు నిర్జీవంగా కనిపిస్తుంది. అలాగే దవడ కండరాలు బిగుసుకుపోవడం, పెదవుల దగ్గర అదురు రావడం వంటివి కూడా దీని లక్షణాలే.డెర్మటాలజీ నిపుణులు చెబుతున్న ప్రకారం.. మెగ్నీషియం, నిద్ర, జీర్ణక్రియ కలిస్తేనే అందమైన చర్మం సాధ్యం. మెగ్నీషియం వల్ల గాఢ నిద్ర పడుతుంది, ఆ సమయంలోనే చర్మం తనను తాను బాగు చేసుకుని కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది లోపిస్తే చర్మం త్వరగా ముడతలు పడటం, మొటిమలు రావడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

మెగ్నీషియం లోపాన్ని అధిగమించడానికి మన భారతీయ ఆహారంలో లభించే పాలకూర, గుమ్మడి గింజలు, బాదం, అరటిపండ్లు, తృణధాన్యాలు మరియు పప్పు దినుసులను డైట్‌లో చేర్చుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్ సలహాతో మెగ్నీషియం గ్లైసినేట్ వంటి సప్లిమెంట్లు వాడవచ్చు. మెగ్నీషియం లోపం అనేది నిశ్శబ్దంగా వచ్చే సమస్య. మీ ముఖం ఇచ్చే ఈ చిన్న చిన్న సంకేతాలను గమనించడం ద్వారా పెద్ద ఆరోగ్య సమస్యలను ముందే నివారించవచ్చు.

# నల్ల మిరియాలు.. ఔషధ గుణాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు!



నల్లగా ఉన్నాయి కదా అని తీసిపారేకయండి. వీటి ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఇందులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు వైద్య నిపుణులు. వీటిని ప్రతి రోజు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ రోజుల్లో బరువు తగ్గడం అనేది ప్రతి ఒక్కరికీ ఒక ప్రధాన కోరికగా మారింది. చాలా మంది గంటల తరబడి వ్యాయామం చేస్తారు. కఠినమైన ఆహారాలను పాటిస్తారు. కానీ ఇప్పటికీ ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నారు. అటువంటి పరిస్థితిలో మీ వంటగదిలో ఉండే నల్ల మిరియాలు వంటి చిన్న మసాలా దినుసును సరిగ్గా ఉపయోగించడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుందని మీకు తెలిస్తే ఆశ్చర్యపోతారు. నల్ల మిరియాలు ఆహారాన్ని కారంగా మార్చడమే కాకుండా, శరీర కొవ్వును కాల్చే సామర్థ్యాన్ని కూడా పెంచుతాయి. ఇందులో ఉండే పైపెరిన్ అనే సమ్మేళనం జీవక్రియను వేగవంతం చేస్తుంది. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉబ్బరాన్ని నివారిస్తుంది. శరీరం థర్మోజెనిక్ కార్యకలాపాలను పెంచుతుంది. నిర్విషీకరణలో సహాయపడుతుంది. అందువల్ల ప్రతిరోజూ సరైన మొత్తంలో నల్ల మిరియాలను తీసుకోవడం వల్ల మీ బరువు తగ్గించే ప్రయాణం సులభం, వేగంగా ఉంటుంది. ఇది థర్మోజెనిక్ కార్యకలాపాలను పెంచుతుంది. ఇది కేలరీలను వేగంగా బర్న్ చేయడానికి సహాయపడుతుంది. ఇది యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది ఆహారం బాగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఉబ్బరం నివారిస్తుంది.

## ఈ గింజలు వదలకుండా తినేయండి..!



జాక్ ఫ్రూట్ గింజలు ఫైబర్ తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల మీరు ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగి ఉంటారు. అతిగా తినకుండా ఉండటానికి సహాయపడుతుంది. పనస గింజల్లో ఇనుము పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు కూడా సహాయపడుతుంది. దీన్ని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చు. పనస గింజలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది కాబట్టి, తరచుగా మలబద్ధకంతో బాధపడేవారు వీటిని తినాలి. అలాగే, జీర్ణ సమస్యలు ఉన్న వారికి కూడా పనస గింజలు ఎంతో మంచిదని చెబుతున్నారు. పనస గింజలను పొడి చేసుకుని తీసుకుంటే జీర్ణ సమస్యలు ముఖ్యంగా గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు దూరం అవుతాయని సూచిస్తున్నారు. అలాగే, విటమిన్ ఎ పనస గింజల్లో పుష్కలంగా లభ్యమవుతుంది. విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి ముఖ్యమైన పోషకాలలో ఒకటన్న సంగతి తెలిసిందే. కాబట్టి, పనస గింజలను ఉడకబెట్టి లేదా వేరే విధంగా కూడా తీసుకోవచ్చు. దాంతో కంటి ఆరోగ్యం పెరుగుపడుతుంది. అదేవిధంగా పనస గింజల్లో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఎముకులను, దంతాలను దృఢంగా మారుస్తాయి. గుండె పోటు, ఇతర గుండె జబ్బులు రాకుండా రక్షిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మీరు పనస గింజలను వేయించి తినవచ్చు. వాటిని ఒక పాన్ మీద 15-20 నిమిషాలు వేయించాలి. అవి కొద్దిగా గోధుమ రంగులోకి మారిన తర్వాత, వాటిపై కొంచెం నల్ల ఉప్పు, చాట్ మసాలా చల్లి తినండి. పనస గింజలను ఎండలో ఎండబెట్టి పొడి చేసి, సలాడ్లు లేదా పండ్లపై చల్లి తినవచ్చు. మీకు ఇష్టమైన పండ్లతో పాటు పనస గింజల సహాయంతో మీరు స్మూతీలను కూడా తయారు చేసుకోవచ్చు.

## చికెన్‌లో ఈ పార్ట్ సైలెంట్ కిల్లర్..



బిర్యానీలో చికెన్ లెగ్ ముక్కలు తినడం ఆరోగ్యానికి ప్రయోజనకరమా లేదా హానికరమా? గుండె జబ్బులు, మధుమేహం, బరువు పెరిగే సమస్యలు ఉన్నవారు లెగ్ ముక్కలు ఎందుకు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.. బిర్యానీలో చాలామందికి ముందుగా గుర్తుకు వచ్చేది జ్యూసీ చికెన్ లెగ్ పీస్. బిర్యానీలో చాలామందికి ముందుగా గుర్తుకు వచ్చేది జ్యూసీ చికెన్ లెగ్ పీస్. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ ముక్క కోసం పోటీపడతారు. అయితే ఈ రుచికరమైన చికెన్ పీస్ మీ ఆరోగ్యానికి మేలు చేస్తుందా లేదా అనే దాని గురించి తప్పక తెలుసుకోవాలి.ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం చికెన్ లెగ్ ముక్కలలో ప్రోటీన్‌తోపాటు దాదాపు 12 రకాల విటమిన్లు ఖనిజాలు ఉన్నప్పటికీ, అవి కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి సైలెంట్ కిల్లర్‌లా ప్రాణాలను హరిస్తాయట.చికెన్ లెగ్ ముక్కల్లో ముదురు మాంసం ఉంటుంది. తెల్ల మాంసంతో పోలిస్తే చికెన్ లెగ్ పీస్‌లో కొవ్వు, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు వాటిని జాగ్రత్తగా తీసుకోవాలి.లెగ్ ముక్కల్లో సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది. ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారికి ఇది ప్రమాదకరం. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నవారు, డైట్ ఫాలో అవుతున్నవారు లెగ్ పీసెస్ తినకుండా ఉండాలి. వీటిలో ఉండే అదనపు కేలరీలు వేగంగా బరువు పెరగడానికి దారితీస్తాయి. డయాబెటిక్ రోగులు తమ ఆహారంలో కొవ్వు పరిమాణాన్ని నియంత్రించుకోవాలి. చికెన్ అధికంగా తీసుకోవడం వల్ల జీవక్రియపై ప్రభావం చూపుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణకు ఆటంకం కలిగిస్తుంది.

## గ్లాస్ జామపండు జ్యూస్ తాగితే..



సాధారణంగా మనకు తక్కువ ధరలో, సులభంగా దొరికే పండ్లలో జామపండు ఒకటి. అయితే దీనిని కేవలం ఒక సామాన్యమైన పండుగా తీసిపారేయకండి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జామపండులో ఉండే పోషకాలు ఖరీదైన బ్లూబెర్రీస్ వంటి పండ్లకు ఏమాత్రం తీసిపోవు. ముఖ్యంగా జామపండును ముక్కలుగా తినడమే కాకుండా రసం రూపంలో తీసుకోవడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. జామలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. నారింజ పండుతో పోలిస్తే జామలో విటమిన్ సి శాతం ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది శరీరానికి రక్షణ కవచంలా పనిచేస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల నుండి తప్పించుకోవాలంటే శరీరంలో రోగనిరోధక శక్తి బలంగా ఉండాలి. ప్రతిరోజూ జామ రసాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన విటమిన్ సి అందుతుంది. తద్వారా తరచూ అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చు. జామపండు తీయ్యగా ఉన్నప్పటికీ.. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. లో-గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎటువంటి భయం లేకుండా జామ రసాన్ని తమ డైట్‌లో చేర్చుకోవచ్చు. జామలో ఉండే మెగ్నీషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారు జామ రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం మంచిది. జామలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కొంతమందికి జామకాయను నేరుగా తింటే కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి వారు రసం రూపంలో తీసుకోవడం వల్ల మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. జామ రసం కేవలం అంతర్గత ఆరోగ్యానికే కాదు, బాహ్య సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు చర్మానికి సహజమైన మెరుపును ఇవ్వడమే కాకుండా జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తాయి.

## రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ లో రచ్చ రచ్చ..

# పరాస్- అనీష్ మధ్య గొడవ



**హైదరాబాద్ పెన్ పవర్:** రంజీ ట్రోఫీ 2025--26 ఫైనల్ మ్యాచ్ హుబ్లీలోని కేఎస్‌సీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఉత్కంఠభరితంగా కొనసాగింది. ఈ మ్యాచ్ లో ఓ అనూహ్య ఘటన చోటు చేసుకుంది. జమ్మూ కాశ్మీర్ టీం కెప్టెన్ పరాస్ డోగ్రా, కర్ణాటక ఫీల్డర్ అనీష్ కేవీ మధ్య ఘర్షణ జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు కర్ణాటక ఆటగాడు మయాంక్ అగర్వాల్ మధ్యలోకి వచ్చి ఇద్దరినీ కంట్రోల్‌లో చేశాడు. జమ్మూ కాశ్మీర్ ఇన్నింగ్స్ 100వ ఓవర్‌లో ఈ వివాదం జరిగింది. కర్ణాటక పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ వేగంగా వేసిన బంతి మిడిల్, ఆఫ్ స్టంప్ దిశగా పడి, పిచ్ మీద తాకిన అనంతరం కొంచెం స్ట్రెయిట్ కావ్వడంతో పరాస్ డోగ్రా షాక్ అయ్యాడు. డిఫెన్స్ ఆడే ప్రయత్నంలో బంతి అతడి బ్యాట్ ఎడ్జ్‌లో తాకి బౌండర్ వైపు దూసుకెళ్లింది. అక్కడే ఉన్న ఫీల్డర్ ఫుల్ డైవ్ చేసినప్పటికీ బంతిని అడ్డుకోలేకపో యాడు. బంతి బౌండరీకి చేరడంతో డోగ్రాకు నాలుగు రన్స్ లభించాయి. కానీ బౌండరీ తర్వాత జరిగిన ఘటన అందరినీ ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురి చేసింది. సిల్లీ పాయింట్‌లో హెల్మెట్ ధరించి నిలిచిన అనీష్ కేవీతో పరాస్ డోగ్రా మధ్య మాటల యుద్ధానికి దిగాడు. జస్ట్ సెకండ్ లోనే ఆ గొడవ తీవ్ర స్థాయికి చేరిపోయింది. ఇద్దరూ కోపంగా కనిపించడంతో పరిస్థితి చేజారేలా అనిపించింది.

గొడవ పెద్దగా కాకుండా మయాంక్ అగర్వాల్ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ ఘటన తర్వాత అంపైర్లు కర్ణాటక కెప్టెన్ దేవదత్ పడిక్కల్‌తో కూడా మాట్లాడి, ఫీల్డింగ్ టీం క్రమశిక్షణ పాటించాలని వార్నింగ్ ఇచ్చారు . అనంతరం అనీష్ కేవీకి పరాస్ డోగ్రా క్షమాపణ చెప్పేందుకు ట్రై చేశాడు. కానీ ఫీల్డర్ అనీష్ ఆ క్షమాపణను స్వీకరించడానికి ఇంట్రెస్ట్ చూపించలేదని తెలుస్తుంది. అంపైర్లు కూడా పరిస్థితిని వివరించి అతడిని శాంతింపజేయడానికి యత్నించారు.

ఈ ఫైనల్‌కు చేరుకునే క్రమంలో ఇరు జట్లు కూడా చాలా కష్టపడ్డాయి. కర్ణాటక జట్టు ప్రారంభంలో బలంగా ఆడినా మధ్యప్రదేశ్ చేతిలో ఓడిపోయిన తర్వాత ముంబై, ఉత్తరాఖండ్‌పై గెలిచి ఫైనల్‌కు వచ్చింది. జమ్మూ కాశ్మీర్ కూడా ముంబై చేతిలో తొలి మ్యాచ్లో ఓడిన అనంతరం సెమీఫైనల్‌లో బెంగాల్‌ను ఓడించి 67 ఏళ్లలో తొలిసారిగా రంజీ ట్రోఫీ ఫైనల్‌కు జమ్ము కాశ్మీర్ అడుగు పెట్టింది. ప్రస్తుతం ఫైనల్ రెండో రోజు ముగిసే సమయానికి జమ్మూ కాశ్మీర్ 109 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 351 రన్స్ చేసింది. పరాస్ డోగ్రా (22బి), కన్హయ్య వాధవన్ (30బి) క్రీజులో కొనసాగుతున్నారు.

**ఇరు జట్ల ప్లేయింగ్ ఎలెవెన్:**

కర్ణాటక జట్టు: కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, దేవదత్ పడిక్కల్ (కెప్టెన్), కరుణ్ నాయర్, స్మరణ్ రవిచంద్రన్, శ్రేయాస్ గోపాల్, కృథిక్ కృష్ణ (వికెట్ కీపర్), విద్యాధర్ పాటిల్, విజయ్‌కుమార్ వైశాక్, శిఖర్ షెట్టి, ప్రసిద్ధ్ కృష్ణ

జమ్మూ కాశ్మీర్ జట్టు: కామ్‌రాన్ ఇక్బాల్, యావర్ హసన్, శుభమ్ పుండీర్, పరాస్ డోగ్రా (కెప్టెన్), అబ్దుల్ సమద్, కన్హయ్య వాధవన్ (వికెట్ కీపర్), అబిద్ ముస్తాక్, ఆఖిబ్ నబీ దార్, యుద్వీర్ సింగ్ చరక్, సాహిల్ లోత్రా, సునీల్ కుమార్.

# రింకు సింగ్ ఇస్ బ్యాక్.. జోరుగా నెట్స్‌లో ప్రాక్టీస్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ బ్యాటర్, ఫినిషర్ రింకు సింగ్ (ఫిబ్రవరి 24న) ఉన్నట్టుండి టీమ్ ని వదిలి పెట్టిన సంగతి అందరికీ తెలిసిందే. కుటుంబ అత్యవసర కారణాలతోనే రింకు తన స్వగ్రామానికి వెళ్లినట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అతడి తండ్రి కచన్ చంద్ సింగ్ క్యాన్సర్‌తో పోరాడుతూ వెంటిలెటర్‌పై ట్రీట్మెంట్ తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. గురువారం చెన్నైలోని చిదంబరం స్టేడియంలో భారత్ వర్సెస్ జింబాబ్వే జట్ల మధ్య కీలక పోరు జరగనుంది. రింకు సింగ్ ఉన్నట్టుండి జట్టును వదిలి పెట్టడంతో అభిమానుల్లో ఆందోళన స్టార్ట్ అయింది. ఇవాళ రింకు సింగ్ గురించి భారత్ మేనేజ్మెంట్ ఓ కీలక అప్‌డేట్ ఇచ్చింది. సూపర్-8లో జింబాబ్వేతో ( ఫిబ్రవరి 26న) జరిగే మ్యాచ్‌కి రింకు సింగ్ అందుబాటులో ఉంటాడని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ శితాంశు కోటక్ తేల్చి చెప్పారు. రింకు సింగ్ తండ్రి అనారోగ్యంతో ఉండటం వలన.. ఇలాంటి ఎమర్జెన్సీ పరిస్థితుల్లో కుటుంబంతో ఉండటానికి అతడు టీమ్ ని వీడాడు. కానీ జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌కు అతడు అందుబాటులో వస్తాదని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రానికి రింకు టీమిండియాతో చేరి, రేపటి మ్యాచ్ కోసం నెట్స్‌లో ప్రాక్టీస్ చేసే అవకాశం ఉందని శితాంశు కోటక్ స్పష్టం చేశారు. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌కు జింబాబ్వేతో జరిగే మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. సూపర్-- 8లో సౌతాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో సూర్య సేన ఓడిపోయింది. దీని వల్ల నెట్ రన్‌రేట్ -3.800కి పడిపోయింది. కాబట్టి ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ ఆశలు సజీవంగా ఉంటాయి. మరోవైపు టాప్ ఆర్డర్ బ్యాటింగ్ వైఫల్యం భారత జట్టును తీవ్రంగా కలవర పెడుతోంది. అభిషేక్ శర్మ ఫామ్ జట్టుకు తీవ్రంగా నష్టం కలిగిస్తుంది. ఇటు ఫినిషర్‌గా రింకు సింగ్ కూడా ఇప్పటి వరకు మంచి ప్రదర్శనలు చేయలేదు. జింబాబ్వేతో మ్యాచ్‌లో కట్టుదిట్టమైన ప్రణాళికతో బరిలోకి దిగి విజయం సాధించాలని భారత్ క్రికెట్ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ దూకుడు..

# బ్యాటింగ్, బౌలింగ్‌లో మనమే నెంబర్ వన్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 జట్టు తాజా ఐసీసీ మెన్స్ టీ20 ర్యాంకింగ్స్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసింది. టాప్--10 బ్యాటర్ల జాబితాలో భారత జట్టు డామినేషన్ మరింత పెరిగింది. టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్--1 స్థానాన్ని కొనసాగిస్తుండగా, వికెట్‌కీపర్ ఇషాన్ కిషన్ ఇషాన్ కిషన్ మూడు స్థానాలు మెరుగు పర్చుకుని టాప్--5లోకి దూసుకొచ్చాడు. టీ20 వరల్డ్ కప్‌లో అభిషేక్ శర్మకు ఆరంభంలో పెద్ద స్కోర్లు చేయకపోయినా, ర్యాంకింగ్స్‌లో మాత్రం అతడి ఆధిపత్యం ఇంకా కొనసాగుతోంది. ఇంగ్లాండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో నిలిచాడు. పాకిస్థాన్ ఓపెనర్ సహిబ్‌జాదా ఫర్హాన్ రెండు స్థానాలు ఎగబాకి థర్డ్ ప్లేస్ కి చేరుకున్నాడు. ప్రస్తుత టోర్నీలో ఫర్హాన్ ఎక్కువ రన్స్ చేసిన ఆటగాడిగా కొనసాగుతున్నాడు.దక్షిణాఫ్రికా యువ ఆటగాడు డీవాల్డ్ బ్రెవిస్ 10 స్థానాలు మెరుగుపడి 9వ స్థానానికి చేరుకోగా, అఫ్ఘానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్, వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్, ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రుక్ కూడా ఈ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మరింత మెరుగుపర్చుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా మళ్లీ నంబర్--1 స్థానాన్ని దక్కించుకోగా, భారత్ నుంచి శివమ్ దూబే రెండు స్థానాలు మెరుగుపడి 7వ స్థానానికి చేరుకోగా, అఫ్ఘానిస్థాన్ సీనియర్ ప్లేయర్ మహమ్మద్ నబీ 8వ స్థానం కొనసాగుతున్నాడు. మరోవైపు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో కూడా భారత ఆటగాళ్లు మంచి ప్రదర్శన చేశారు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో భారీగా పరుగులు ఇచ్చినప్పటికీ, వరుణ్ చక్రవర్తి నంబర్--1 స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. దక్షిణాఫ్రికా పేసర్ కార్బిన్ బోష్ అద్భుత ప్రదర్శనతో 21 స్థానాలు ఎగబాకి మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కూడా టాప్--10లో చేరాడు. తాజా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో నెంబర్ వన్ గా నిలిచాయి.

# మానుషి స్టన్నింగ్ బ్లాక్ బికినీ మేకోవర్

ఒక రకంగా మానుషి దురదృష్ట నాయిక అని అనాలి. మానుషి సినీఆరంగేట్రం చేసే సమయంలోనే కరోనా క్రైసిస్ ముంచుకొచ్చింది. తన మొదటి పెద్ద అవకాశం వచ్చేప్పటికి కరోనా రంగ ప్రవేశం చేసి ఆశల్ని అడియాశల్ని చేసింది. తను నటించిన క్రేజీ సినిమా విడుదల కావడానికి ఏళ్లు పట్టింది. దానికి తోడు పరాజయం వెక్కిరించింది. మొత్తానికి అందాల భామల్లో అదృష్టం కలిసి రాని నటిగా మిగిలిపోయింది. అయితే మానుషి తనను తాను నిలబెట్టుకునేందుకు, స్టార్ గా లైమ్ లైట్ లో ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలు, హార్డ్ వర్క్ గురించి ప్రశంసించి తీరాలి. ఈ బ్యూటీ నిరంతరం కాంపిటీషన్ లో నెగ్గేందుకు ఇతర భామల్లానే సోషల్ మీడియాల్లో వేగంగా ఉంది. మానుషి ఇన్ స్టాలో నిరంతరం ఫోటోలను షేర్ చేస్తుంటే అవి వైరల్ గా మారుతున్నాయి. మానుషి తన బ్లాక్ బికినీ ఫోటోలను షేర్ చేసి వాటికి ఆసక్తికర వ్యాఖ్యను జోడించింది. "నేను చాలా ఫన్నీగా ఉంటాను.. కానీ నేను మంచి లైటింగ్‌ను గౌరవిస్తాను" అని క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ వెబ్‌లో గుబులు పుట్టిస్తోంది.సాధారణంగా మోడల్స్ లేదా నటీమణుల ఫోటో షూట్లలో చాలా సీరియస్‌గా, గ్లామరస్‌గా కనిపిస్తారు. దీనివల్ల వారు వ్యక్తిగతంగా కూడా చాలా సీరియస్ గా ఉంటారని జనం అనుకుంటారు. కానీ మానుషి ఈ క్యాప్షన్ తో సందేహాన్ని పటాపంచలు చేసింది. నేను నిజానికి చాలా సరదా మనిషిని, కానీ మంచి లైటింగ్ ఉన్నప్పుడు దాని విలువ తెలిసిన దానిగా ఇలా గ్లామరస్ పోజులు ఇస్తున్నాను! అని చమత్కరించింది. అంటే తన అందం వెనుక లైటింగ్ పాత్రను కూడా అంగీకరిస్తూ తనలోని హ్యూమర్ సెన్స్‌ను బయటపెట్టింది.

**తదుపరి చిత్రాలు - వెబ్ సిరీస్‌ల వివరాలు:**


మానుషి కెరీర్‌లో -పృథ్వీరాజ్-, -ఆపరేషన్ వాలెంటైన్-, -బడే మియాన్ చోటే మియాన్- వంటి భారీ చిత్రాలు నిరాశపరిచినా కానీ, ప్రస్తుతం కొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులలో నటిస్తోంది. జాన్ అబ్రహం సరసన నటించిన టెహ్రాన్ గత ఏడాది విడుదలైంది. కానీ ప్లస్ కాలేదు. యాక్షన్ కామెడీ-క్రైమ్ చిత్రం -వెల్‌కమ్ టు ది జంగిల్-లో ఒక పాత్ర పోషించింది. -నో ఎంట్రీ 2-, -రేస్ 4: రీలోడెడ్-లలో కనిపించనుంది. మానుషి చిల్లర్ డిజిటల్ లోను ఎంట్రీ ఇవ్వబోతోంది. నెట్‌ఫ్లిక్స్ కోసం నిర్మిస్తున్న ఒక భారీ పీరియడ్ డ్రామా లేదా థ్రిల్లర్ సిరీస్‌లో ఆమె నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే కొన్ని ప్రముఖ ఓటీటీ సంస్థలతో టచ్ లో ఉందని సమాచారం.

**మానుషి -షైన్- అవ్వాలంటే..?**

మిస్ వరల్డ్ కావడమే మానుషికి పెద్ద గుర్తింపు, కానీ నటిగా నిలదొక్కుకోవాలంటే కొన్ని మార్పులు అవసరం. ఈ బ్యూటీ కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న చిన్న బడ్జెట్ సినిమాల్లో నటించాలి. స్టార్ హీరోల పక్కన కేవలం సాంగ్స్ కోసం కాకుండా, సందీప్ రెడ్డి వంగా లేదా సంజయ్ లీలా భన్సాలీ వంటి దర్శకుల సినిమాల్లో చిన్న పాత్రలైనా చేస్తే ఆమెలోని యూనిక్ క్వాలిటీ బయటపడుతుంది. ఫోటోషూట్లు సోషల్ మీడియా ఫాలోయింగ్‌ను పెంచుతున్నాయి. కానీ కావాల్సింది ఒక సాలిడ్ హిట్.. ఆ ఒక్క బ్లాక్ బస్టర్ పడితే మానుషి రేంజ్ మారిపోతుంది.



ఫిలింఫేర్ సౌత్ 2026లో హెబ్బా పటేల్ క్రిమ్సన్ క్వీన్



మానుషికి



పాయల్ రాజ్‌పుత్: పచ్చదనం మరియు సినిమాటిక్ ఆకర్షణలో చక్కదనం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965